# భారత దేశ సంస్కృతిపై ఇస్లాం, ముస్లింల ప్రభావం



**Impact of Islam & Muslims on Indian Civilization (Telugu)**

# భారతదేశ సంస్కృతిపై ఇస్లాం, ముస్లింల ప్రభావం

*సేకరణ :*

**అబ్దుర్రహ్మాన్ సాబిర్**

*ప్రకాశకులు :*

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

*సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,*

*హైదరాబాద్ – 500 002. ఫోన్ : 24564583*

**Bharatadesa Samskrutipai Islam, Muslimla Prabhavam**
**Impact of Islam & Muslims on Indian Civilization (Telugu)**

**TIP Series No. : 262**

Compiled by : Abdur Rahman Sabir

*All Rights Reserved with Publishrs*

First Edition : January 2013

Copies : 2000

**Price : Rs. 35/-**

ISBN : 978-93-81111-13-0

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 0091 - 040 - 24564583
E-mail: tiphyderabad@rediffmail.com
website: www.geeturai.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# మా మాట

ఆవరించిన అపార్థాల మబ్బులను చీల్చుకుంటూ భారత దేశంలో ఇస్లాం తన విశిష్ఠ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉంది. అయినా ఇది దాని వైశిష్ట్యానికి తగిన గమనం కాకపోవటానికి కారణం దానిని ఆవరించి ఉన్న మబ్బుల బలం అనేకంటే వాటిని తొలగించవలసిన వెలుగుల బలహీనత అనటం సమంజసంగా ఉంటుంది. అయినా సూర్యోదయం కావటం మబ్బులు తొలగటం ఎంతటి ప్రాకృతిక సత్యమో, సత్యం బహిర్గతం కావటం, అసత్యం అణగారిపోవటం కూడా అంతే సత్యం. ఇస్లాం, ముస్లింల యెడ కమ్ముకున్న అపోహలను దూరం చేయటానికై చేసిన ఒక చిన్న ప్రయత్నమే ఇప్పుడు పాఠకుల చేతిలో ఉన్న ఈ చిరు పుస్తకం. ఇస్లాం ధర్మం మరియు దాని విశ్వాసులైన ముస్లింల యెడ జాతీయ అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ మేధావులు, చరిత్రకారులు – 1. డాక్టర్ తారాచంద్ 2. డాక్తర్ ఎం.ఎన్. రాయ్ 3. డాక్టర్ సయ్యద్ మహ్మూద్ 4. సర్ సి.పి. రాయ్ 5. ప్రొఫెసర్ జె. ఆర్నాల్డ్ 6. ప్రొఫెసర్ జే.సి. చటర్జీ 7. బి.యన్. పాండే 8. కె. చంద్రయ్య – వారల అభిప్రాయాలను సంకలనం చేసి పాఠకుల ముందుంచటానికై చేసిన మా ఈ చిన్న కృషి పాఠకులలో ఓ చిన్న అపోహ తొలగించగలిగినా దానిని దైవ ప్రసాదంగా భావిస్తాము.

**– ప్రకాశకులు**

# విషయ సూచిక


1. దక్షిణ భారతంలో ఇస్లాం 05
2. ముస్లిం పాలకుల సాటిలేని పరిపాలన 09
3. హిందూదేశాన్ని నందనవనంగా మార్చిందెవరు? 13
4. చరిత్రకారులు ఏమంటున్నారు? 17
5. నేను దర్శించిన ఇస్లాం 21
6. భారత సంస్కృతీ వికాసంలో ముస్లిం పాలకుల కీలక పాత్ర 25
7. సామరస్య రథ సారథులెవరు? 30
8. నిజం నిప్పులాంటిది, దాన్ని ఏ చరిత్రా దాచలేదు 34
9. సామాజిక కార్యక్రమాలే ఇస్లాం విజయానికి మూలం 38
10. సెక్యులర్ ప్రభుత్వాన్ని స్థాపించింది ముస్లింలే 41
11. విభేదాలను విస్మరించిన విజేతలు – భారత దేశంలో హిందూ ముస్లింల సఖ్యత 44
12. మతవర్గాల సుహృద్భావానికి మచ్చుతునక 48
13. భారత్‌లో ఇస్లాం విరాజిల్లిన వేళ 52
14. ముస్లింలు ఈ దేశానికి ఏం చేశారు? 61
15. చరిత్ర చెప్పే నిజాలు 65
16. ఇస్లాం ఛాందస మతం కాదు 68

*అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో*

# దక్షిణ భారతంలో ఇస్లాం

**- డా. తారాచంద్**

నిస్సంశయంగా ఇస్లాంలో కొన్ని ఉత్తమ లక్షణాలు ఉండబట్టే అది కొద్ది కాలంలోనే అసాధారణమయిన ప్రగతి సాధించింది. అది సాధించిన విజయాలు వ్యాప్తిలో ఒక భాగం అన్నది కూడా నిజమే. కాని అసలు వాస్తవం ఏమంటే ఈ మతంలో ప్రజలకు అసాధారణమయిన ఆకర్షణ ఉంది. ఆ ఆకర్షణ దాని ప్రగతికి ఎంతో దోహదపడింది.

మతం ప్రగతి సాధించడానికి యుగాలు పడతాయి. కానీ ఇస్లాం మొదటి శతాబ్దిలోనే దాదాపు అరేబియా పరిసర దేశాలన్నింటిలోనూ వ్యాపించింది. ప్రారంభంలోనే హిందూ దేశంలో కూడా దాన్ని స్వీకరించిన వారు ఉన్నారు. హిజ్రీ రెండవ శతాబ్దిలో ఇక్కడ ముస్లింల జనావాసాలు క్రమబద్ధంగా ఏర్పడ్డాయి. అందువల్ల కోవళంలో "మయ్యత్‌కట్టు" పేరుగల ఒక శ్మశానంలో అలి బిన్ ఉస్మాన్ సమాధి శిలాఫలకంపై 126 హిజ్రీ (క్రీ.శ. 783) అని చెక్కబడి ఉంది. దీనినిబట్టి క్రీ.శ. 8వ శతాబ్ది ప్రారంభంలోనే ముస్లింలు మలబార్ తీరాన నివాసం ఏర్పరచుకున్నారని తెలుస్తున్నది.

ముస్లింల ప్రభావం హిందూదేశంలో శీఘ్రంగా పురోగమించింది. హిందూ రాజులు వారిని గొప్పగా గౌరవించి ఆహ్వానించారు. వారి వ్యాపారానికి సౌలభ్యాలు కలుగజేశారు. వారు భూమిని కొనడానికి, మస్జిద్‌లు నిర్మించుకోవడానికి అనుమతించారు. వారు మలబారులో నివాసం ఏర్పరచుకోగానే తమ ధర్మ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ కారణం వల్ల ఇస్లాం దక్షిణ భారతంలో వ్యాపించడం ప్రారంభమయింది.

ముస్లింలలో పురోహితులు, ఫాదర్‌లు ఉండరు. ధర్మ ప్రచారం చేయడం తమ బాధ్యతని భావిస్తాడు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది :

**“ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు వివేకంతో, చక్కని ఉపదేశంతో.”** (16 : 125). ఈ ప్రచార కార్యంలో పురుషులే కాక స్త్రీలపై కూడా బాధ్యత ఉంది. అంతేకాదు, ముస్లిం ఖైదీలు ఇస్లాం ప్రచారం చేశారని గులాం సర్వర్ “ఖజీనతుల్ అస్ఫియా” అనే గ్రంథంలో : “ఇంకా షేఖ్ అహ్మద్ సర్ హిందీని జహంగీర్ జైల్లో పడవేసినప్పుడు ఆయన రెండు సంవత్సరాలు ఆ కారాగృహ జీవితంలో కొన్ని వందల మంది ఖైదీలకు ఇస్లాం పరిచయం చేశారు” అని రాశారు.

క్రీ. శ. 8వ శతాబ్దిలో దక్షిణ భారతంలో ఇస్లాం వ్యాప్తికి ఎన్నో కారణాలున్నాయి. దక్షిణాది ప్రజలు ముస్లింలను గౌరవంగా చూసేవారు. వారి రుజువర్తనం ప్రజల హృదయాలపై గట్టి ముద్రవేసింది. అన్నింటికంటే మించి ముస్లింల ఉన్నత భావాలు, వారి ఆచార వ్యవహారాలు, పద్ధతులు, వారి వ్యక్తిగత ప్రవర్తన వగైరాల ప్రభావం చెప్పుకోదగినది. ముస్లింల మతం అర్థమయ్యేటటువంటిది, నిరాడంబరమైనది, సులభగ్రాహ్యమైనది. వారి ఆరాధనా పద్ధతులు హృదయాలను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఈ విషయాల ప్రభావం కూడా వారిపై పడింది.

ఫ్రాన్స్ విద్వాంసుడు రీనాన్ ఇలా వ్రాశాడు : “నేను ఎప్పుడు మస్జిద్‌లోకి వెళ్ళినా, నమాజు చేసే వారిని చూసినా నా హృదయం వర్ణనాతీతమయిన మధురానుభూతితో నిండిపోయేది. నా హృదయంలో, నేనెందుకు ముస్లిం కాలేదన్న ఆలోచన జనించేది.” రీనాన్ వంటి రాటుదేలిన నాస్తికుని హృదయాన్ని ఇస్లాం ఆరాధనలు అలా ప్రభావితం చేసినప్పుడు ఇతరుల గురించి ఇక చెప్పేదేముంది!? ఇక్కడ ఇంకో విషయం, కూడా గమనార్హమైనది. అదేమంటే,

ప్రారంభంలో ఇస్లాం ఒక క్రియాశీల ధర్మం. దానిని విశ్వసించినవారు తమ నమ్మకాలను కేవలం నోటితో వల్లించేవారు కాదు. వారి జీవితంలో, వారి నడవడికల్లో వారు విశ్వసించిన ఉత్తమ నమ్మకాల కాంతి మెరుస్తూ ఉండేది. మాటల్లో చేతల్లో సమన్వయానికి వారికి వారే సాటి. అంతేకాకుండా వారి నమాజ్ వరుస క్రమం, అతి కఠినమయిన రోజా వ్రతాలు, జకాత్, దాన ధర్మాల పద్ధతులు, సమాజంలో సర్వసమానతను పాటించటం వంటి అంశాలు మనిషి హృదయంపై ప్రభావం వేయక మానవు.

దీనికి ప్రతికూలంగా 8వ శతాబ్దిలో దక్షిణ భారతంలో స్థానిక మతాల్లో తీవ్రమయిన విభేదాలు తలెత్తాయి. బౌద్ధులు, జైనులు, వైదిక ధర్మాన్ని నమ్మినవారు పరస్పరం ప్రాణ శత్రువుల్లా మారిపొయ్యారు. బ్రాహ్మణుల ప్రయత్నాల వల్ల బౌద్ధ, జైన ధర్మాలు మెల్లిమెల్లిగా అంతరించిపోసాగాయి. శైవ, వైష్ణవ మతాలు వ్యాప్తిచెందాయి. అంటరానితనం, మూఢవిశ్వాసాలలో మగ్గే సమాజం, పరస్పరం ఘర్షించుకునే కాలంలో ముస్లింలు దక్షిణ భారతానికి వచ్చారు. వారిలో ఉన్న మానవ సమానత ప్రభావం ప్రజలపై సహజంగానే పడింది.

9వ శతాబ్ది మధ్యకాలంలో మలబారులోని చేరమణ్ పెరుమాల్ పేరుగల ఓ ప్రసిద్ధ కుటుంబంలోని ఆఖరి రాజు యొక్క రాజధాని బెంగళూరు. అతడు ఇస్లాం స్వీకరించాడు. రాజు ధర్మ పరివర్తన దేశంలో చాలా కలకలం రేపింది. ఈ సంఘటన ప్రజల హృదయాలను బాగా ప్రభావితం చేసింది.

కొచ్చిన్ రాజు వల్ల కూడా ఇస్లాం వ్యాప్తికి బాగా సహకారం లభించింది. ఆ రాజు జమేరిన్ అనే పేరుతో ప్రసిద్ధి పొందాడు. అరబ్ వ్యాపారులంటే ఆయనకు అపారమయిన ప్రేమ. అతని అనుమతితో కొచ్చిన్ రాజ్యంలో చాలామంది ముస్లిం వ్యాపారులు నివాసాలు ఏర్పరచుకున్నారు. వారి వ్యాపారం వల్ల చాలా ద్రవ్యలాభం చేకూరింది. ముస్లింల వల్ల అతనికి శక్తి, బలం పెరిగిపోగానే జమేరిన్ రాజు ఇరుగు పొరుగున ఉన్న చిన్న రాజుల్ని ఓడించి వారి నేలను ఆక్రమించుకున్నాడు. జమేరిన్ రాజు అధీనంలో ఉన్న భూభాగంలో ముస్లిం వ్యాపారులు తమ వ్యాపార కేంద్రాలు నెలకొల్పుకున్నారు. ఆ విధంగా కాలికట్ ఓడరేవుకు శంకుస్థాపన జరిగింది.

జమేరిన్ రాజ్యంలోని "ఖాజీ" (అక్కడి భాషలో కోయా) రాజుకు ఎంతో సహాయకారిగా ఉండేవాడు. అతడు రాజు కోసం శక్తిమంతమయిన ఒక ముస్లిం సేనను ఏర్పాటు చేసి పెట్టాడు. ఆ సైన్యం జమేరిన్ రాజు తరఫున ఇతర రాజుల తరఫున పోరాడేది. ఖాజీ సహాయ సహకారాల వల్ల ఆ రాజు దక్షిణ మలబారులో అత్యంత శక్తిమంతుడయిపోయాడు.

ఆ ప్రాంతంలోని రాజులు ముస్లింలను ఎంతగానో గౌరవించేవారు తమ ప్రజల్ని ఇస్లాం స్వీకరించేందుకు స్వయంగా ప్రోత్సహించేవారు. వారిని ఆ రాజులు తమ సముద్ర వాణిజ్యంలో ఉద్యోగులుగా నియమించేవారు. క్లుప్తంగా, క్రీ. శ.

9వ శతాబ్ది తర్వాత దక్షిణ భారతంలో ఇస్లాం ధర్మం రోజుకు రోజు పురోగమిస్తూనే పోయింది. క్రీ.శ. 916లో హిందూ దేశ యాత్ర చేసిన మసూది ఇలా వ్రాశాడు :

"కేవలం చోళలోనే పదివేలకు మించి ముస్లిం ప్రజలు నివసించారు."

ప్రసిద్ధ యాత్రికుడు ఇబ్నె సయీద్ 13వ శతాబ్దిలో సముద్ర తీరంలోని ప్రతి స్థలంలో ముస్లింలను చూశాడు. లంక రాజు ముస్లిం సిపాయీలను విదేశాల నుండి రప్పించుకొని తన సైన్యంలో చేర్చుకోవడం సర్ మార్కోపోలో చూశాడు. ఇబ్నె బతూత ఖంబాహట్ మొదలు మొత్తం మలబారు తీరాన్ని చుట్టివచ్చాడు. అతనికి ప్రతి చోటా ముస్లింలు కలిశారు. వారందరు మంచి స్థితిలో ఉన్నవారే. అయితే ఇస్లాం పురోగతికి రెండు కారణాలున్నాయి.

ఒకటి : ఇస్లాంలో చెప్పలేనంత ఆకర్షణ ఉండటం. రెండోది, దక్షిణ భారతంలోని రాజులు ఇస్లాం పట్ల ప్రభావితులు కావడం.

# ముస్లిం పాలకుల సాటిలేని పరిపాలన

**- డా. ఎం.ఎన్. రాయ్.**

*(సుప్రసిద్ధ భారత చరిత్రకారుడు, రచయిత, విద్వాంసుడు ఎం.ఎన్. రాయ్ భారత ముస్లిం పాలకుల పరిపాలనా వ్యవస్థపై వ్రాసిన ఒక సుదీర్ఘమయిన వ్యాసంలోని కొన్ని భాగాలను ఇక్కడ పొందుపరుస్తున్నాం)*

ఇస్లాం ఉద్భవించిన తర్వాత, ముస్లింలు ఎంత వేగంగా ప్రగతి సాధించారంటే, ఈ విషయంలో ప్రపంచ చరిత్రలోనే వారికి ఎవరూ సాటిరారు. వారొక జాతిగా ఏర్పడిన ఒక శతాబ్దిలోనే ఆసియా, ఐరోపా, ఆఫ్రికా ఖండాల్లోని ఒక పెద్ద భాగానికి అధిపతులయ్యారు. వారి పరిపాలన నేటి ఆధునిక రాజ్యాల పాలన కంటే ఎంతో మెరుగైనదిగా ఉండింది. సంస్కృతీ నాగరికతల వికాసానికై వారు చేసిన సేవ అనన్యమైనది. అది నేటి నవనాగరికతకు పునాదిరాయి వంటిది.

పక్షపాతం, అసూయాద్వేషాలు మనిషిలోని గొప్ప బలహీనతలు. వీటికి జాత్యాహంకారం కూడా తోడయితే ఒక జాతి మరొక జాతిలో ఉన్న సర్వ సద్గుణాలను నిరాకరించడమే కాక, వాటిని దుర్గుణాలని నిరూపించడానికి ప్రయత్నిస్తుంటుంది. ముస్లింల పట్ల సరిగ్గా ఇలాగే జరిగింది. ముస్లింలకు శత్రువులైన జాతులు నిరంతరం వారి మంచి విషయాలను చెడుగా ప్రచారం చేసి, వారిని అపఖ్యాతిపాలు చేశాయి.

ఇస్లాం ఆవిర్భవించినప్పుడు సామాన్యంగా ప్రజలు అగ్నిని ఆరాధించేవారుగానో, యూదులుగానో, క్రైస్తవులుగానో ఉండేవారు. వారిలో అగ్ని పూజారులు అధికంగా

ఇస్లాంను స్వీకరించారు. ఆనాడు యూదులు సాధారణంగా పరాజితులై, అల్పులై ఉన్నారు. కేవలం క్రైస్తవులే అన్ని విధాల ముస్లింలకు తాము ప్రత్యర్థులమని భావించేవారు. అందుకే ఇస్లాం – క్రైస్తవాల చరిత్రలు పరస్పరం యుద్ధాలతో నిండి ఉన్నాయి. కాని ఈ చరిత్రల అధ్యయనం వల్ల తేటతెల్లమయ్యేదేమంటే ఈ యుద్ధాల్లో తరచుగా క్రైస్తవులే ఓడించేవారు. ఈ పరాజయాలే, ముస్లింల పట్ల వారిలో అసూయాద్వేషాలకు జన్మనిచ్చాయి. ముస్లింలపై ఉన్న ద్వేషం వల్లనే, వారిలోని మంచి గుణాలను సైతం తృణీకరించటమే గాక, ముస్లింలను క్రూరులుగా, దౌర్జన్యకారులుగా నిరూపించటానికై క్రైస్తవులు శాయశక్తులా ప్రయత్నం చేశారు. భారతదేశంలో ముస్లింల పట్ల ఏర్పడిన తప్పుడు అభిప్రాయాలన్నీ ఆ కాలంలోని క్రైస్తవ పండితులు, చరిత్రకారులు వ్రాసిన వాటిపై ఆధారపడినవే. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఏ జాతి అయితే ముస్లింలను అధోగతిపాలు చేయడానికి పూనుకున్నారో ఆ జాతికే ముస్లింలు, మహోపకారాలు చేశారు.

ముస్లింలు తమ పరిపాలనా కాలంలో యూదులతో, క్రైస్తవులతో ఎలాంటి సత్ప్రవర్తనతో మెలిగారో ఇక్కడ చర్చించడం నా అభిమతం కాదు. స్వయానా క్రైస్తవ విద్వాంసులు, చరిత్రకారులే ముస్లింల సహిష్ణుత, సత్ప్రవర్తనను గురించి ఒప్పుకుంటున్నారని తెల్పితే చాలనుకుంటాను. కాని మన దేశంలో ముస్లింల గురించి ఏర్పడిన అపోహల్లో ఎలాంటి మార్పూ రాలేదు. అంతేకాక ఈ దురభిప్రాయాల్ని తొలగించడానిక్కూడా ఎలాంటి సంఘటిత కృషి ఇంతవరకూ జరుగలేదు – అందుకని ముస్లింలు తమ పరిపాలనా కాలంలో భారతదేశ ప్రజలతో మెలిగిన తీరును, వారి నిర్మాణాత్మక కార్యాలను ఇక్కడ క్లుప్తంగా వివరించడం సబబుగా ఉంటుంది.

భారతదేశాన్ని ఏలిన రాజులలో మొగలు చక్రవర్తుల గురించి ప్రత్యేకంగా చెప్పబడుతుంది. ఎందుకంటే ఈ వంశం శతాబ్దాల తరబడి మన దేశాన్ని పరిపాలించింది. అందువల్లనే మొగలు వంశ పాదుషాల్లో కొందరిని అత్యంత శ్రేష్ఠులని భావించడం జరిగింది. అయితే భారత దేశాన్ని కేవలం మొగలు చక్రవర్తులే కాదు, ఇతర వంశాలవారు కూడా పరిపాలించారు.

చరిత్ర అధ్యయనం వల్ల తేలేదేమంటే, భారతదేశాన్ని పాలించిన ముస్లిం

రాజులు, కొందరిలో వ్యక్తిగత బలహీనతలున్నప్పటికీ, పరిపాలనా వ్యవస్థలో, దేశ ప్రజల యోగక్షేమాలకై వారందరి ప్రవర్తన ఒకేవిధంగా ఉన్నట్టు కనబడుతుంది. ఇంకా వారంతా దేశ ప్రగతికై, దేశ ప్రజల సౌఖ్యానికై తమ శాయశక్తులా కృషి చేసినట్లు వ్రాశారు.

ఈ వ్యాసంలో చారిత్రాత్మక సంఘటనల్ని దృష్టాంతాలతో సహా నిరూపించడం సాధ్యపడదు. కాబట్టి నేను ముస్లిం రాజుల పరిపాలనా కాలంపై దృష్టిని సారిస్తూ ముస్లింలు ద్రోహులు, క్రూరులు, దౌర్జన్యపరులు కారని మీకు విశదీకరించదలిచాను. వారు తమ పరిపాలనా కాలంలో ఎవరిపై కూడా అన్యాయంగాని, బలాత్కారంగాని చేయలేదు.

ముస్లింల ఏలికలో భారత దేశం అన్ని రంగాల్లోనూ బహుముఖ ప్రగతిని సాధిస్తున్న రోజుల్లో, ఇంగ్లాండ్ దేశంలో వ్యవసాయ సేద్యానికి పనికివచ్చే సరయిన ఒక్క కాలువగాని, ప్రయాణించటానికనుకూలమైన ఒక్క రహదారి గాని ఉండేది కాదని చరిత్ర మనకు తెల్పుతోంది. ఇంగ్లాండ్ ప్రజల ధన, మాన, ప్రాణాలకు సరైన రక్షణ ఉండేది కాదు. దానికి భిన్నంగా అదే కాలంలో, భారత దేశంలోని పరిస్థితుల్ని, అప్పట్లో భారత దేశాన్ని సందర్శించిన ఒక యాత్రికుడు మిస్టర్ హాల్‌వేల్ తన డైరీలో ఇలా వ్రాసుకున్నాడు:

"భారతదేశంలోని ప్రజల ధన, మాన, ప్రాణాలకు పూర్తి రక్షణ ఉంది. ఇక్కడ దొంగతనాలు, దోపిడీల సంఘటనలు జరుగవు. ప్రయాణీకుడు ఒంటరిగా గాని, వస్తు సామగ్రితోగాని ప్రయాణించినా అతను నేరుగా ప్రభుత్వ సంరక్షణలో ఉంటాడు. ప్రయాణీకుల రక్షణార్థం అదనంగా ప్రభుత్వాధికారులు నియమింపబడి ఉన్నారు. వారు ప్రయాణీకుల్ని తమ రక్షణలో ఒక మజిలీ నుండి వేరొక మజిలీకి చేరుస్తారు. అక్కడి నుండి ఇంకా ముందుకు సాగే మజిలీ వాళ్ళకప్పగిస్తారు. అంతేకాదు, రెండవ మజిలీ అధికారులు ఆ ప్రయాణీకుల్ని తమ సంరక్షణలో తీసుకునే ముందు, అక్కడికి చేరేవరకు దారిలో తమకెలాంటి కష్టం, నష్టం కలుగలేదని ప్రయాణీకులు సాక్ష్యం చెప్పిన మీదటే వారినక్కడికి చేర్చిన అధికారులకు రశీదు ఇస్తారు. ఆ రశీదు ఆ శాఖ ఉన్నతాధికారి ముందు సమర్పించబడుతుంది–"

మిస్టర్ హాల్‌వెల్ ఇంకా ఇలా వ్రాసుకున్నాడు :

“ప్రయాణీకులు ప్రయాణ సందర్భంలో తమ భోజన, వసతి గురించి బెంగపడనక్కర్లేదు. వారి భోజన, వసతులను భరించడమే కాదు, వారి సామాన్లను చేరవేయడానికి అయ్యే ఖర్చులు, ఒక్కొక్క ప్రదేశంలో మూడు రోజుల వరకు అయ్యే అతని ఖర్చులు మూడు రోజుల తరువాత ప్రయాణీకుడు ఏ బలమైన కారణం లేకుండా ఆగిపోతే ఖర్చులు అతను స్వయంగా భరించుకోవాల్సి వస్తుంది. ఏ ప్రయాణీకుడయినా తన వస్తువు అక్కడ మర్చిపోయి ఉంటే, కనుగొన్నవారు ఆ వస్తువును దగ్గరి చెట్టుకు వ్రేలాడదీసి, సమీపంలోని ప్రభుత్వ అతిథి గృహ అధికారికి తెలుపుతారు. ఆ అధికారి వెంటనే చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ప్రకటన చేయిస్తాడు” -

మిస్టర్ హాల్‌వెల్ పేర్కొన్న పై విషయాల ద్వారా, ముస్లిం పాలకుల కాలంలో భారత దేశ పరిపాలనా విధానం అత్యంత మేలైనదని, ముస్లిం పాలకులు ప్రజలపై అన్యాయం, అత్యాచారం, దౌర్జన్యం చేసేవారు కాదని, వారు ప్రజలకు సాధ్యమయినంత సౌలభ్యాన్ని కల్పించేవారని, వారి దృష్టిలో ముస్లిం, ముస్లిమేతరులనే విచక్షణ భావం ఉండేది కాదని అర్థం కావడం లేదా? ఇలా జరగడానికి కారణమేమంటారు? ముస్లిం పాలకులు ప్రతి విషయంలోనూ ఏ చట్టాలపై అమలు జరిపేవారో, అవి ఖుర్ఆన్ చట్టాలు. ఖుర్ఆన్ మత ప్రాతిపదికపై ఎవరినీ అసహ్యించుకోవటం నేర్పలేదు. అందుకే ముస్లిం పాలకుల కాలంలో ఇక్కడి పురాతన ధర్మాలు పునరుజ్జీవనమయ్యాయి. వారి ధార్మిక గ్రంథాలు బహుళంగా ప్రచురితమయ్యాయి. నిజం చెప్పాలంటే, ముస్లిం ప్రభువుల పరిపాలనా కాలం పరమత సహనం విషయంలో, నేటి అనేక ప్రగతి చెందిన దేశాల ప్రభుత్వాలకంటే వేయి రెట్లు మేలైనది.

# హిందూదేశాన్ని నందనవనంగా మార్చిందెవరు?

**- సర్ సి.పి. రాయ్**

ముస్లింలు హిందూ దేశంలోనికి ఏ కారణాలవల్ల ప్రవేశించినప్పటికీ ఇప్పుడు మాత్రం వారు హిందువుల వలెనే ఈ దేశవాసులు, శతాబ్దాల తరబడి హిందువులు, ముస్లింలు సోదరుల వలె ఈ దేశంలో ఉంటూ వస్తున్నారు. ఇది తిరుగులేని చారిత్రక సత్యం. ఈ దేశంతో వారి జీవితాలు, ప్రయోజనాలు, ఆలోచనలు విడదీయలేని బంధాలు.

ముస్లింలు హిందూ దేశంలోకి వచ్చి గుదిబండలా తయారయ్యారని భావించడం, వారివల్ల దేశానికి ఏం ఒరిగిందని ప్రశ్నించడం సరైన పద్ధతి కాదు. వారు సాహిత్యంలో, నిర్మాణ కళాకౌశలంలో, పరిపాలనా దక్షతలో ఎనలేని సేవల్ని అందించారు. హిందూ దేశపు నాగరికతలో, సంస్కృతిలో కనబడే రంగు రంగుల హరివిల్లు వారికి గల అనన్యమైన మేధస్సుకు తార్కాణం. హిందూ దేశానికి వారు ధరింపజేసిన పట్టువస్త్రాల్ని తొలగించివేస్తే దాని అపురూప అందచందాలన్నీ అంతమయిపోతాయి. ఈ వాస్తవాన్ని అందరూ గ్రహించాలి. నేను ఈ అంశం మీద చర్చించడం అనవసరమనే భావిస్తాను. నేను చేస్తున్న ఈ అప్రతిహతమైన వాదన సమర్థనకు ఒక్క కుతుబ్ మీనార్, ఒక్క తాజ్‌మహల్ చాలు. ఈనాడు కూడ హిందూ దేశం గర్విస్తున్న మహోన్నతమైన ఇస్లామీయ కట్టడాలవి.

హిందూ దేశంలో ముస్లింల రాజ్యపాలన, హిందూ, ముస్లింల సఖ్యత, సామరస్యం, సౌభ్రాతృత్వం మరువలేని, మరుపురాని చరిత్ర. ముస్లిం పాదుషాల దర్బారులో అత్యున్నత స్థానాల్లో సైన్యాధిపతులుగా, దివానులుగా, అమాత్యులుగా

వెలుగొందినవారు హిందువులే. ఆంగ్లేయుల పాలన అవసాన దశలో లార్డ్ సిన్హాను ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించినందుకు మనం వారి సామరస్యాన్ని హర్షిస్తాము. కానీ ముస్లిం పాలకుల కాలంలో అలాంటి ఎంతోమంది సిన్హాలు, జస్వంత్ సింగ్, జైసింగ్, మాన్‌సింగ్, తోడర్‌మల్ లాంటివారు అంతకంటే అత్యున్నత స్థానాల్ని అలంకరించారు. ఆ వాస్తవాన్ని మనం విస్మరిస్తాము. హిందూ దేశంలోని ముస్లిం పాలకుల సామరస్యం, విశాల దృక్పథం ఎలాంటిదో ఓ విషయం ద్వారా గ్రహించవచ్చు. ఇంగ్లాండును ఓ రాణి పాలించిన కాలంలో మతపరమైన విభేదం వల్ల ఒక వర్గాన్ని సజీవ దహనం చేస్తున్న సమయంలో వారు ఇక్కడ అక్బర్ చక్రవర్తి సామరస్యానికి గల సాధారణ సూత్రాల్ని ప్రచారం చేస్తూపోయారు.

హిందువుల పట్ల ఔరంగజేబు సంకుచితత్వం, అసూయ, కక్ష, ఈర్ష్య అంటూ అనేకానేక రచనలు చేయబడ్డాయి. కానీ ప్రసిద్ధ చరిత్రకారుడు "ఎల్ఫిన్‌స్టన్" ఇలా రాశాడు : "అతని పరిపాలనా కాలంలో ఏ ఒక్క హిందువు ప్రాణాన్నికాని, వస్తుసామగ్రినికాని కోల్పోలేదు. జైలు శిక్ష అనుభవించలేదు. జస్వంత్‌సింగ్, జయ్‌సింగ్‌లు ఔరంగజేబు ప్రధాన కార్యదర్శులుగా ఉండేవారు. వారిని ఔరంగజేబు తన సంతానం కంటే అధికంగా గౌరవించేవాడు."

హిందువుల పట్ల షేర్షా పఠాన్ ప్రవర్తన ఈనాడు కూడా చరిత్రపుటల్లో చెక్కు చెదరకుండా ఉంది. అతడు ఏర్పాటు చేసిన ప్రజా సంక్షేమశాఖ బహు ప్రసిద్ధి గాంచింది. అతను ప్రధాన రహదారుల్లో సత్రాలు, విశ్రాంతి గృహాలు నిర్మింపజేశాడు. వాటిలో ఓ ప్రత్యేక సౌకర్యాన్ని కూడా కల్పించాడు. అదేమంటే ఏ మత వర్గానికీ అసౌకర్యం కలుగకుండా ఉండడానికి హిందువులకు హిందువులే వండిన వంటకాలు వడ్డించబడేవి.

హిందువుల్లో తరతరాలుగా సాగుతూ వస్తున్న కులగోత్రాల రివాజును నిర్మూలించి, హిందూ సమాజంలో పేరుకుపోయిన ఈర్ష్య, ద్వేషాల్ని అంతమొందించి వారిలో విశాల దృక్పథాల్ని కలిగించడానికి ఇస్లామీయ ప్రజాస్వామ్య విధానం ఎంతో తోడ్పడింది. ఆ విప్లవాత్మక భావాలవల్ల బెంగాల్‌లో "విష్ణు ఉద్యమం" ఆవిర్భవించి హిందూ సమాజంలో ఇస్లామీయ ప్రజాస్వామ్య భావాల్ని పెంపొందింపజేసింది.

భారతదేశంలోని ముస్లిం పాదుషాల వల్ల ఇతర ముస్లిం దేశాలతో హిందూ దేశానికి సుహృద్భావ సంబంధాలు ఏర్పడ్డాయి. ఫలితంగా మన్సూర్ అలీ ఖిలాఫత్ కాలంలో హిందూ దేశం నుండి గొప్ప గొప్ప పండితులు బగ్దాద్‌కు ఆహ్వానించబడ్డారు. వారి సహకారంతో యజుర్వేదం మీద ఓ ఉత్తమ గ్రంథం “చర్‌కా” రచించబడింది. అంతేకాదు “సిద్ధాంతం” గ్రంథం కూడ అనువదించబడింది. విగ్రహాల్ని ఖండించే పాషాణ హృదయుడుగా పేరొందిన మహమూద్ గజనీ కూడా తన దర్బారులో అన్ని వర్గాలవారిని విభిన్న మతాల పండితుల్ని, మేధావుల్ని, కవుల్ని సమావేశపరిచేవాడు. అల్‌బేరూని అతని ఆస్థాన విద్వాంసుడు. అతడు గ్రీక్, సంస్కృత భాషల్ని ధారాళంగా మాట్లాడేవాడు. అతడు హిందూ శాస్త్రాలకు నిలయమైన బెనారస్‌లో ఉండి హిందువులకు గ్రీక్ శాస్త్రాలు, గణితం బోధిస్తూనే స్వయంగా హిందూ శాస్త్రాలను అభ్యసిస్తూ ఉండేవాడు.

మనిషిని మానవునిగా మలచడానికి ఇస్లాం చాలా గొప్ప పాత్ర వహించిందని నా అభిప్రాయం. ప్రజా రాజకీయాలను కూడా ఇస్లాం ఎంతో పెంచిపోషించింది. అసలు ఇస్లామీయ ప్రజాస్వామ్యమే నిజమైన ప్రజాస్వామ్యం. అది పాశ్చాత్య బుద్ధికి తోచిన ప్రజాస్వామ్యం లాంటిది కాదు. జాతి, వర్గం, ధనం ఆధిక్యతల వల్ల పాశ్చాత్య ప్రజా సామాన్యం అర్థరహితమై, అప్రభావితమై నిస్సారమయిపోయింది. కులం, గోత్రం వేర్పాటు ధోరణులవల్ల హిందువులమైన మనం ఎంతో నష్టపోయి పతనావస్థలో పడి ఉన్నాం. మీరు ఓ మందిరానికి వెళ్తే అక్కడ అనేక వర్గాలకు వేర్వేరు స్థానాలు కేటాయించబడి ఉండడం గమనిస్తారు. అందుకు విరుద్ధంగ ఓ మస్జిద్ మీనార్ నుండి ముఅజ్జిన్ అజాన్ పిలుపు ఇవ్వగానే అమీరు, ఫకీరు, కార్మికుడు, సంపన్నుడు అందరు ముస్లింలూ ఒకేచోట సమావేశమవుతారు. ఒకే వరుసలో సమానంగా నిల్చుంటారు.

ఇస్లాం మనిషీ మనిషికి మధ్య జన్మత: ఎలాంటి విభేదాల్ని కల్పించదు. “అది సర్వోన్నతుడయిన ఏకేశ్వరుణ్ణి విశ్వసించమంటుంది. అది సమానతకు, సమైక్యతకు, ప్రజాస్వామ్యానికి మూలసూత్రం. దాని ప్రవేశం వల్ల హిందూ దేశంలోని తీవ్రమయిన అంటరానితనం కూడ చాలావరకు తగ్గిపోయింది.

క్లుప్తంగా చెప్పేదేమంటే ముస్లింల ప్రవేశంవల్ల హిందూ దేశానికి ఎంతో లాభం జరిగింది. వారి నాగరికత హిందూ దేశపు నాగరికతతో మిళితమయి వివిధ

వర్ణాలు వెదజల్లే హరివిల్లు ఆవిర్భవించి మన దేశాన్ని రమణీయ నందనవనంగా మార్చివేసింది. ముస్లిం పాలకులు చేసిన మేలు, ఉపకారం ఎన్నటికీ మరువజాలనిది. విభిన్న రీతులుగా, అనేక భాగాలుగా విభజింపబడి ఉన్న దేశాన్ని వారు సంఘటితపరచి జాతి సమైక్యతను ప్రసాదించారు. ఒక పటిష్టమైన హిందూ దేశానికి పునాదులు వేసింది కూడా వారే. చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయిన దేశాన్ని సమైక్యపరచి శక్తిమంతమైన హిందూ దేశంగా రూపొందించారు. ఈ దేశాన్ని తమ స్వదేశంగా భావించి జాతి, మత భేదం లేకుండా ఇక్కడి నివాసులకు తమ నిస్వార్థ సేవల్ని అందించారు.

మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఈ దేశ వాసులకు మొట్టమొదటిసారిగా "సెక్యులరిజం" పాఠాలు నేర్పింది కూడా ముస్లిములే. వారు చేసిన జాతీయ, సామాజిక సేవల్ని మనం ఎన్నటికీ మరువకూడదు. ("ఇస్లామీయ నాగరికత" ప్రసంగాల నుండి)

❋ ❋ ❋

# చరిత్రకారులు ఏమంటున్నారు?

భారత దేశ చరిత్రను నిశితంగా శోధిస్తే వ్యక్తమయ్యే వాస్తవం ఏమంటే ఈ దేశాన్ని పాలించిన ముస్లిం రాజులు ఏ కాలంలోనూ మతతత్వవాదులుగా పరిపాలన చేయలేదు. వారు కేవలం స్వచ్ఛమైన దేశీయులుగానే పరిపాలించారు. వారి ప్రభుత్వంలో సర్వమత ధర్మాలకు, విభిన్న విశ్వాసాలుగల వారికి సమాన స్థానం ఇచ్చి గౌరవించాలన్న ప్రయత్నమే జరిగింది. తొమ్మిది వందల సంవత్సరాల వారి సుదీర్ఘ పరిపాలనా కాలంలో ఈ దేశ ప్రభుత్వ మతం ఇస్లాం అని ఎక్కడా పేర్కొనలేదు. ఇస్లాం ప్రచారానికిగాని, ప్రచురణకుగాని ఏ ముస్లిం పాలకుడూ తన ప్రభుత్వంలో ఏ శాఖనూ ఏర్పాటు చేయలేదు. ఇది వారి సెక్యులర్ పాలసీకి తిరుగులేని చారిత్రక సాక్ష్యం. అయినప్పటికీ భారత దేశం ముస్లిం పాలకుల్ని సంకుచిత దృష్టిగలవారని, అసూయాపరులని, మత సహనం, సామరస్యం లేనివారని, హిందూ ధర్మానికి శత్రువులని అంటే అది చరిత్రను హత్య చేయడమే అవుతుంది.

భారత ముస్లిం రాజుల పట్ల ఎన్ని కట్టుకథలు, కల్పిత గాధలు సృష్టించినా చరిత్ర చాలా స్పష్టమయిన మాటల్లో ఆ ముస్లిం రాజులు నిజమయిన దేశభక్తులని, వారు తమ శక్తి మేరకు సహృదయంతో ఈ దేశానికి సేవ చేశారని, వారు ఆంగ్లేయుల వలే స్వార్థపరులుగా కాకుండా గొప్ప చిత్తశుద్ధితో దేశానికి, దేశ ప్రజలకు సేవచేశారని సాక్ష్యం పలుకుతుంది. ఒకవేళ అలా కాకపోయినట్లయితే దేశభక్తిపరాయణులు, ఆత్మాభిమానం గల ఈ దేశవాసులు తొమ్మిది వందల సంవత్సరాలు కాదుకదా కొన్ని సంవత్సరాలు కూడా వారిని నిలువనిచ్చేవారు కాదు. వారి ప్రభుత్వాన్ని శక్తిమంతం చేయడానికి ఈ దేశవాసులు, రాజపుత్రులు శతాబ్దాల తరబడి తమ రక్తాన్ని ధారపోసే వారు కారు. అంతెందుకు, స్వయంగా హిందూ చరిత్రకారుల దృష్టిలో ముస్లిం పాలనా కాలం ఎలా ఉండేదో చరిత్ర చదివితే తెలుస్తుంది. సుప్రసిద్ధ హిందూ చరిత్రకారుడు

పండిట్ గిర్ధారీ లాల్ ప్రకటన వల్ల కూడా అది తేటతెల్లమవుతుంది. పండిట్ గిర్ధారీ లాల్ తన చరిత్ర "కితాబుల్ హింద్"లో ఇలా వ్రాశారు :

"ముస్లిం పాలకుల యుగం శాంతి యుగం. ముస్లిం పాలకులు రాకపూర్వం భారత దేశంలో దాడులు, తిరుగుబాట్లు జరిగేవి. దోపిడీదార్ల అలజడుల వల్ల శాంతి ఛిన్నాభిన్నమయిపోయింది. ప్రతిచోట పాశవిక కృత్యాలు, అమానుష కార్యాలు యధేచ్ఛగా సాగేవి. ముస్లింలు వచ్చి శాంతిని స్థాపించారు. దేశం నలుమూలల సైనిక స్థావరాలు ఏర్పాటు చేశారు." (కితాబుల్ హింద్ సంపుటి 1, పేజి 296)

ఇక ఈ దేశాన్ని సౌభాగ్యవంతం చేయడంలో, పరిశ్రమలను, వర్తకాన్ని అభివృద్ధి పరచడంలో ముస్లిం పాలకుల పాత్ర ఎలా ఉండిందో విమర్శనాత్మకంగా ఆ చరిత్రకారుడే ఇలా వ్రాస్తాడు : "ముస్లింల పరిపాలనకు ముందు భారత దేశం వాణిజ్యంలో అంతగా విజయం సాధించలేకపోయింది. ముస్లింలు అతి తక్కువ కాలంలోనే భూమార్గాన, సముద్రం మీద వాణిజ్యాన్ని అభివృద్ధిపరిచారు. ఈజిప్టు, ఇరాఖ్, సిరియా, పాలస్తీనా, ఈరాన్, కాబుల్ నుండి అసంఖ్యాకంగా వ్యాపార బృందాలు ఇక్కడకు వస్తూ ఉండేవి. అంతకు ముందు భారత దేశంలో బజార్లలో చూడని వస్తువులు కానవస్తున్నాయి." (కితాబుల్ హింద్, సంపుటి 1, పేజి 321)

ముస్లిం పాలకులు రాక పూర్వం భారత దేశంలో కులం, గోత్రం వంటి వాటికి అత్యధిక ప్రాధాన్యత ఉండేది. కులగోత్రాల పోరాటాల వల్ల ఇక్కడి విభిన్న వర్గాల్లో అంతంకాని వైషమ్యం జనించింది. విషాదకరమయిన ఆనాటి పరిస్థితుల్ని విశదీకరిస్తూ నాసిరుద్దీన్ మహ్మూద్ కాలంలోని ప్రసిద్ధ చరిత్రకారుడు పండిట్ చంద్రసేన్ (మరణం 1262 క్రీ.శ.) తన ప్రఖ్యాత గ్రంథం "ముంతఖబుత్తవారీఖ్"లో ఇలా వ్రాస్తారు –

"ముస్లిం పాదుషాల పరిపాలనకు పూర్వం హిందువుల్లో వంశానికి, కులానికి ఎంతో ప్రాముఖ్యత ఉండేది. వారు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులని ప్రత్యేక వర్గాలుగా చీలి ఉన్నారు. ఒకవేళ ఓ శూద్రుడు జాతి సేవ, దేశాభివృద్ధి కోసం ముందుకు వస్తే, దానికి అనుమతి ఉండేది కాదు. దానికి భిన్నంగా ముస్లిం పాదుషాలు కుల వైషమ్యాల పునాదుల్ని పెకలించి శూద్రులకు శాస్త్రాలు, కళలు అభ్యసించేందుకు

అవకాశం కలిగించారు. ఇప్పుడు వారు స్వేచ్ఛగా విద్యలను అభ్యసిస్తున్నారు. ముస్లిం సుల్తానుల దర్బారుల్లో కార్యనిర్వాహక శాఖల్లో అగ్రవర్ణాల హిందువులకు ఏ స్థానం ఉండేదో ఆ స్థానంలో ఓ శూద్రుడు కూడా ఉండేవాడు." (ముంతఖబుత్తావారిఖ్" సంపుటి 1, పేజి 258)

ఈ చరిత్రకారుడే ముస్లిం పాలకుల ప్రభుత్వ వ్యవహార సరళిని సమీక్షిస్తూ ఇలా వ్రాశాడు :

"హిందూ రాజుల పాలన విధానం కంటే ముస్లిం పాలకుల పాలనా పద్ధతి బాగుండేది. ఎలాగంటే హిందూ రాజుల కాలంలో రాజులు కొందరు బ్రాహ్మణుల సలహా, సహకారాలతో పరిపాలన సాగిస్తూ ఉండేవారు. అధికారుల నియామకం అనధికారికంగా ఉండేది. అందువల్ల దేశంలో అరాచకం వ్యాపిస్తూ ఉండేది. పీడితుల గోడు వినే నాథుడే లేకపొయ్యాడు. కానీ ముస్లింలు ఈ దేశంలో కాలుమోపగానే అన్ని శాఖల పర్యవేక్షణ కోసం అధికారికంగా ఉన్నతాధికారి, ప్రధాన పర్యవేక్షకుడు, మీర్ మున్షీ, మంత్రి, అమీర్ల అధ్యక్షుడు మొదలయినవారు నియమించబడ్డారు. వారి వారి విధులు, బాధ్యతలు నిర్ణయించబడ్డాయి. ఈ క్రమశిక్షణ ఫలితంగా దేశంలో వ్యాపించి ఉన్న అరాచకం అంతరించిపోయింది. నలుదిశల న్యాయం శాంతి వెల్లివిరిసింది." (ముంతఖబుత్తవారిఖ్" సంపుటి 1, పేజి 311)

ముస్లిం పాదుషాలు విద్యలు, కళల అభివృద్ధికి గణనీయమైన పాత్ర పోషించారు. జహంగీర్ పాదుషా ఆస్థాన చరిత్రకారుడు రతన్‌లాల్ (మరణం : 1627 క్రీ.శ.) తన ప్రసిద్ధ గ్రంథం "తారీఖె హింద్"లో వ్రాస్తారు : "మొగల్ పాదుషాలు భారత దేశస్థుల విద్య, శిక్షణలకోసం నెలకొల్పిన ఆదర్శం శోధించినా ఎక్కడా లభించదు. మొగలుల పరిపాలనా కాలంలో ముస్లింల కోసం ఎలా ప్రత్యేక పాఠశాలలు ఉండేవో అలాగే హిందువులకు కూడా ప్రత్యేక పాఠశాలలు ఉండేవి. ముస్లింలు ప్రసాదించిన విద్య వల్ల హిందువుల హృదయాల్లో ఓ నూతన ఉత్తేజం వచ్చింది. పండిట్ భగవాన్ దాస్, శ్రీపత్ మనోహర్‌లాల్, పండిట్ కిషన్ చందర్, పండిట్ డోగర్‌మల్ భారత పూగుచ్ఛంలోని పుష్పాలు. వారు మొగలుల విద్యా నందన వనంలో పరిమళాలు నింపుకున్న పూ రాజులు." (తారీఖె హింద్, పేజి 448)

విద్యా సేవలే కాకుండా ముస్లిం పాదుషాలు ఈ దేశపు సంస్కృతి ఔన్నత్యం కోసం ఎలా శ్రమించారో సమీక్షిస్తూ షాజహాన్ కాలంలోని ప్రసిద్ధ వార్తా విలేకరి పండిట్ రాజ్ నారాయణ్ (మరణం 1658 క్రీ.శ.) తన ఉద్గ్రంథం "గుల్షనే హింద్"లో ఇలా వ్రాశారు : "సంస్కృతిలో వాస్తుకళకు ప్రత్యేకమయిన పాత్ర ఉంది. దాని ద్వారా జాతుల కళా కౌశల్యం, నైపుణ్యం ఏమిటో తెలుస్తుంది. హిందూ రాజుల కాలంలో భవన నిర్మాణ పద్ధతి అంత ఉత్తమంగా ఉండేది కాదు. భవనాలు ఇరుకుగా, చీకటిగా ఉండేవి. అందులో నివసించేవారికి అదొక చెర కంటే తక్కువేమీ కాదు. అందులో విశాలత నామమాత్రానికయినా ఉండేది కాదు. ముస్లింలు ఈ దేశానికి వచ్చి నిర్మాణ రంగంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. అక్బర్, జహంగీర్, షాజహాన్‌ల కాలంలో ఢిల్లీ, లాహెూర్, ఆగ్రా, ఫతేహ్‌పూర్ సిక్రీలో అనుపమానమైన సుందర భవనాలు నిర్మితమయ్యాయి. ఢిల్లీలో ఎర్రకోట, ఆగ్రాకోట, ఢిల్లీలోని మస్జిద్‌లు, లాహెూర్‌లోని ఉద్యానవనాల సౌందర్యాన్ని శ్లాఘించకపోతే అది అత్యంత జుగుప్సాకరమైన హింసే అవుతుంది. (తారీకె గుల్షనె హింద్, పేజి 649)

ఈ చరిత్రకారుడే ముస్లింలు చేసిన ఇతర సంస్కరణలను ప్రస్తావిస్తూ ఇలా వ్రాస్తారు:

ముస్లిం పాదుషాలు భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించారు. అందుచేతనే దాని సంస్కరణ, నిర్మాణాలకై తమ అమూల్య కాలాన్ని వినియోగించారు. వారు టర్కీ, ఈరాన్‌లలోని వివిధ రకాల ఫల పుష్ప వృక్షాలతో భారత దేశాన్ని నందనవనంలా తీర్చిదిద్దారు, ముఖ్యంగా మొగల్ పాదుషాలు ఈ దేశంలో సుందరమయిన ఉద్యానవనాల్ని పెంచిపోషించారు. ముస్లింలు రాకముందు ఈ దేశవాసులు మంచి దుస్తులు, ఆహార పదార్థాలు ఎరుగరు. ముస్లింలు విలువైన వస్త్ర కర్మాగారములు స్థాపించి భారత దేశవాసులను అందమైన దుస్తులతో అలంకరించారు. అలాగే ఖుర్మా, బిర్యాని లాంటి రుచికరమైన వంటకాలు ఈ దేశవాసులకు బహు ప్రీతికరమైనవి." (తారీఖె గుల్షనే హింద్) (దీన్ దునియా సౌజన్యంతో)

❊ ❊ ❊

# నేను దర్శించిన ఇస్లాం

**– ప్రొ॥ జె. ఆర్నాల్డ్**

మనిషి మేధా, ఆలోచన, క్రియాశీలక శక్తుల్ని ప్రేరేపించి అతన్ని మానవమూర్తిగా తీర్చిదిద్దే అనితరమైన కార్య సాధనలో ఘన విజయం సాధించింది ఇస్లామీయ ధర్మం. అందువల్లే అది ఊహకందని విద్యుత్ తరంగంలా ప్రపంచ నలుదిశలా వ్యాపించింది. క్రైస్తవం తరువాత యుగాల తరబడి గొప్ప గొప్ప సామ్రాజ్యాల్ని పరిపాలించి తన అనుయాయులను సంఖ్యాపరంగా రెండవ స్థానంలో నిలబెట్టిన ఘనత కూడా ఇస్లాంకే దక్కుతుంది. ప్రపంచంలో క్రైస్తవుల తర్వాత అధిక సంఖ్యలో ఉన్న వారు ముస్లింలే. అయినా విశేషం ఏమంటే ఇస్లాం ఏ విషయాలనయితే నిషేధించి తన ధర్మంలో, సామాజిక జీవితంలో దానికి రవ్వంతయినా స్థానం కల్పించలేదో అదే ఇస్లాంను ఆ విషయాల్ని అవలంబిస్తున్న అపరాధిగా భావిస్తూ నిందారోపణలు మోపుతూ ఉంటే కొందరు న్యాయప్రియులు, నిస్వార్థులైన మేధావులు ఆ నిందారోపణలను వాస్తవాలుగా నమ్ముతున్నారు.

ఇస్లాం మరియు ముస్లింలకు విరుద్ధంగా మోపబడుతున్న అనేకానేక అభియోగాల్లో ప్రధానమైనది ఏమంటే మత విషయాల్లో ఇస్లాం అవకాశవాది అనీ, రాజీపడే విధానానికి అనుమతి ఇవ్వదనీ, ముస్లింలు మతం విషయంలో కరుడుగట్టిన సంకుచిత స్వభావులనీ, సామరస్యం లేని వారనీను.

ఈ ఆరోపణ ఇస్లాం ఆవిర్భవించిన తరువాత క్రైస్తవ లోకం ముస్లింలను తమ రాజకీయ ప్రత్యర్థులని భావించడంతో ప్రారంభమైంది. క్రైస్తవ రాజులు ఫాదరీల సహకారంతో క్రైస్తవుల్లో ముస్లింలకు వ్యతిరేకంగా శత్రుభావం కల్గించాలన్న లక్ష్యంతో వారి మత భావోద్రేకాన్ని రెచ్చగొడుతూ పోయారు.

చరిత్ర చాటిచెబుతున్న వాస్తవం ఏమంటే, ముస్లింలు అతి తక్కువ కాలంలోనే ఆఫ్రికా, ఆసియాలోని చాలా ప్రాంతాల్లో వ్యాపించిపోయారు. ఎంతో శ్రమకోర్చి, కష్టాల్ని సహించిన ఐరోపా, ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం లభించింది. అలాంటి కొన్ని దేశాల్లో వారు వేరుగా ముస్లింలను ఎదుర్కోవడం జరిగింది. మిగిలిన దేశాల్లో ముస్లింల ఉనికి వల్ల క్రైస్తవ ప్రభుత్వాలు పటిష్టంగా ఉండజాలవన్న అనుమానం ఉత్పన్నమైంది. ఆ కారణంగా వారు ముస్లిములకు విరుద్ధంగా పైన పేర్కొనబడిన ప్రచారాన్ని కొనసాగిస్తూ పోయారు. అలా తూర్పు నుండి పశ్చిమం వరకు ముస్లిములకు వ్యతిరేకంగా వారు మత సామరస్యం కలవారు కానేకారని ప్రచారం చేయడం జరిగింది.

ప్రపంచంలో మతాన్ని నమ్మినవారు, నమ్మనివారు – ఈ రెండు వర్గాలవారి ఏకాభిప్రాయం ఏమంటే జాతుల ప్రవర్తనాసరళిలో, వాటి నిర్మాణంలో మతానికి అత్యంత ప్రముఖ పాత్ర ఉందని, ముస్లింల విషయంలో మటుకు ఈ వాస్తవం నూరు శాతం వర్తిస్తుంది. ఎందుకంటే వారి జీవితంలోని ప్రతీ అంశం మత పరిధి నుండి వేరుగా లేదు. అందువల్ల మతం విషయంలో వారి జాతీయ జీవన సరళిని పరిశీలించాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

ప్రపంచంలో దివ్య ఖుర్ఆన్ ఏకైక దైవగ్రంథం. ఈ విషయంలో ఇస్లాం బద్ధవిరోధి కూడ అది అవతరించిన కాలం నుండి ఇప్పటి వరకు అందులో ఓ చుక్క, చిన్న గీత, ఓ ఫుల్‌స్టాప్, కామా సైతం చెక్కు చెదరలేదని అంగీకరిస్తాడు. ఆ ఖుర్ఆన్‌లోనే ధర్మం విషయంలో బలవంతం చేయరాదన్న స్పష్టమైన ప్రకటన మనకు కానవస్తుంది. పైగా సర్వమతాల్ని, వాటి మార్గదర్శకుల్ని సంపూర్ణంగా గౌరవించాలని అది ప్రబోధిస్తూ ఉంది. ఎక్కడ, ఏ ప్రాంతంలోనయినా ముస్లింలు పాలకులుగా ఉంటే అక్కడి ముస్లిమేతరుల మతం, పౌరహక్కుల సంరక్షణా బాధ్యత వహించాల్సిందిగా నిర్దేశిస్తుంది. ఇస్లాంలో ఇంతగా ప్రస్ఫుటమైన ఆజ్ఞలు వ్యక్తమవుతూ ఉంటే దానికి విరుద్ధంగా ఇస్లాంలో సామరస్యం లేదన్న అభియోగంలో రవ్వంతయినా వాస్తవం లేదు. ఇంకా ఆ అభియోగాన్ని ఖండించడానికి ముస్లింలు మతాలపట్ల ప్రదర్శిస్తూ వస్తున్న ప్రవర్తనా సరళిని కూడ పరిశోధించాల్సిన అవసరం ఉంది.

స్వయంగా క్రైస్తవ చరిత్రకారులు ఈ వాస్తవిక సంఘటన గురించి సంయుక్తంగా ప్రకటించారు. ముస్లింల రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజిఅన్)ను బైతుల్ మఖ్దిస్

పెద్ద చర్చ్ లోపల నమాజ్ చేసుకొమ్మని పెద్ద పెద్ద ఫాదిరీలందరూ కోరినా ఆయన అందుకు తిరస్కరించారు. ఎందుకంటే దాన్ని సాకుగా తీసుకొని భావితరాలవారు ఆ చర్చ్‌ని మస్జిద్‌గా మార్చివేస్తారేమోనని, ఆ సమయంలో హజ్రత్ ఉమర్ (రజిఅన్) చర్చ్ మెట్లమీదే నమాజ్ చేసుకున్నారు. ఆ తర్వాత ఫాదిరీలకు ఓ పత్రాన్ని వ్రాసి ఇచ్చారు. **"నేను ఇక్కడ నమాజ్ చేసుకున్నానన్న ఆధారం చూపి ఏ ముస్లిం కూడా ఇక్కడ నమాజ్ చేసుకోడానికి హక్కులేదు"** అని అందులో ఆయన స్పష్టపరిచారు.

ఖలీఫా ప్రదర్శించిన ఆదర్శం ఇస్లాం చరిత్రలో ఇదొక్కటే కాదు, ముస్లింలు ఏ ప్రాంతానికి వెళ్ళినా, ఏ పరిస్థితుల్లో ఉన్నా వారు ఇతర మతాల్ని, వాటి మార్గదర్శకుల్ని గౌరవించడం తమ బాధ్యతగా భావించారు. భారత దేశంలో ముహమ్మద్ బిన్ ఖాసిం హిందూ సోదరులకు సంపూర్ణ మత స్వాతంత్ర్యం ప్రకటించాడు. ఆ స్వేచ్ఛను ఉల్లంఘించిన ముస్లింలకు ఘోరమైన శిక్షలు విధించబడ్డాయి. అంతేకాదు, భారత దేశంలోని ముస్లిం పాలకులు దేవాలయాల నిర్మాణానికి అయ్యే ఖర్చులకు, పూజా విధులు నిర్వహించేందుకు పెద్ద పెద్ద జాగీర్లు, వస్తు సామగ్రి, ధన సంపత్తిని సమకూర్చారు.

అలా ఇస్లాం స్థాపించిన ఆదర్శవంతమైన మత సామరస్యం నేటి కాలంలోని ఇతర జాతుల జీవితంలో మచ్చుకయినా కానరాదు. అందువల్ల ఇస్లాంకు వ్యతిరేకంగా శతాబ్దాల తరబడి చేస్తూ వస్తున్న దుష్ప్రచారం నేడు మెల్లమెల్లగా అంతరించి పోతూ ఉంది. వాస్తవం ఏమంటే ఇస్లాం అత్యున్నతమైన సామరస్యం గల మత ధర్మం. యావత్ మానవ జాతి పట్ల సంపూర్ణ సామరస్యంతో ప్రవర్తించాలని తన అనుచరులకు ఆజ్ఞాపించిన విశ్వజనీన ధర్మం.

ఇస్లాం విగ్రహారాధనకు బద్ధ విరోధి. అయినా ఇతరుల విగ్రహాల్ని దూషించరాదని అది తన సహచరులకు ఆదేశిస్తున్నది. కాస్త ఆలోచించండి! ఇస్లాం సామరస్యానికి ఇంతకంటే మించిన సాక్ష్యాధారం ఇంకేమి కావాలి. నేను క్రైస్తవుణ్ణి, అయినప్పటికీ నా హృదయంలో ఇస్లాం పట్ల అమితమైన గౌరవం ఉంది. ఎందుకంటే నేను దర్శించిన ఇస్లాం సామరస్యం లాంటిది ఇతర మతాల్లో దాదాపు శూన్యమే.

పాదిరి రెవరెండ్ ఖుర్‌ఆన్ గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఇలా

ఉల్లేఖిస్తున్నారు : "పదమూడు వందల సంవత్సరాలు గడిచిపోయినా మార్పు చెందనిది ఖుర్‌ఆన్ గ్రంథం ఒక్కటే. ఖుర్‌ఆన్ శిక్షణ విగ్రహారాధనను రూపుమాపి విశ్వస్రష్ట, ఏకేశ్వరారాధనను స్థాపించింది. కూతుళ్లను హత్యచేసే ఆచారాన్ని అంతమొందించింది. సమాజంలోని అన్ని చెడులను రూపుమాపి సంస్కరింపబడిన సమాజాన్ని మానవజాతికి పరిచయం చేసింది ఇస్లాం."

# భారత సంస్కృతీ వికాసంలో ముస్లిం పాలకుల కీలక పాత్ర

**– కె. చంద్రయ్య,** *ఐ.ఎ.ఎస్.* (రిటైర్డ్)

భారత దేశానికి ముస్లిముల రాక, భారత సంస్కృతిపై ఇస్లాం ప్రభావం రమారమి 1200 ఏళ్ళ క్రితమే మొదలయింది. 1857లో వారి అధికారం పరిసమాప్తమయింది. వారి పరిపాలనా యుగం అపూర్వ సంఘటనలతో నిండి ఉంది. వారి హయాం భారత సంస్కృతీ నాగరికతల రూపకల్పనలో, పురోభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించింది. మరోసారి అంతర్జాతీయ ప్రపంచంతో వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవటానికి ఈ యుగమే దోహదపడింది. ఇస్లాం యొక్క స్వచ్ఛమయిన, ఏకేశ్వర సిద్ధాంతపు కానుక దేశానికి ప్రాప్తమయింది ప్రొ. కె.ఎం. పాటేకర్ ప్రకారం వీరి హయాంలోనే. ఈ కాలంలోనే ఇస్లాం భారతీయ సంస్కృతిపై చెరగని ముద్రవేసింది. ఇస్లాంలోని సర్వ మానవ సమానత్వం, సమైక్యభావపు సిద్ధాంతాలు సామాజికంగా ఎన్నో మార్పులను తెచ్చాయి. కులగోత్రాల కారాగారంలో బంధించబడిన అత్యధిక సంఖ్యలోని జనాలు ఈ సిద్ధాంతం పుణ్యమా అని స్వేచ్ఛా వాయువుల్ని పీల్చగలిగారు.

ముస్లిములలో సమాజపరంగా ఎటువంటి వర్గీకరణ ఉండేది కాదు. ముస్లిం సమాజంలో నిమ్నోన్నత భావం, అంటరానితనం కూడా ఉండేది కాదు. మనుషుల్లోని ఫలానా వర్గమే ఫలానా వృత్తిని చేపట్టాలి అనే వృత్తిపరమైన ఆంక్షలు కూడా ఉండేవి కావు. ఇది భారత వృత్తి వ్యవస్థకు పూర్తిగా భిన్నమైనది, విలక్షణమైనది. భారత సమాజంలోని కులతత్వపు కరుడుగట్టిన పునాదులను ఈ దృక్పథం కూల్చివేసింది.

మరోవైపు ముస్లిములు అన్ని స్థాయిల్లో ఒండొకరితో సంబంధాలు

ఏర్పరచుకున్నారు. వృత్తులపై గల నిర్బంధాలను క్రమేణా సడలించారు. విద్యార్జనకోసం శ్రీమంతులు పేదవారి దగ్గరికి వెళ్ళసాగారు. సమానత్వం, సౌభ్రాతృత్వాల ఈ భావన భారతీయులకు అప్పట్లో వినూత్న విషయంలా గోచరించింది. ఈ సంబంధాల ఫలితంగా కులాలు, వర్గాల సంకెళ్లలో బంధించబడిన సమాజం ఎంతో కొంత ఉపశమనం పొందినట్టు అనుభూతి చెందింది. పరాకాష్టకు చేరిన ఛాందసత్వం చాలా వరకు తగ్గిపోయింది. ఇతర రంగాలలో కూడా ఇస్లాం సంఘ సంస్కర్తలకు పోటీగా నిలిచింది. భారత సమాజ స్వరూప స్వభావాలపై పెరుగుతున్న ఇస్లాం మరియు ముస్లిముల ప్రభావాన్ని గురించి చెబుతూ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఇలా అభిప్రాయపడ్డారు :

"భారతదేశానికి వాయువ్యం వైపు నుంచి ముస్లిముల రాక వల్ల మన దేశంలో గమనార్హమైన మార్పులు జరిగాయి. భారత సమాజాన్ని దాస్య శృంఖలాలలో బంధించి ఉంచిన రుగ్మతలను వారు ఎత్తిచూపారు. ఇస్లాంలోని ప్రేమైక దృక్పథం, దాని అనుయాయుల్లో ఉన్న సమతా భావం, ముఖ్యంగా భారతీయ వ్యవస్థపై అయస్కాంతంలా పనిచేసింది. అటువంటి సమతా భావాన్ని అది మునుపెన్నడూ చూసి ఉండలేదు."

భారతీయ సంప్రదాయాలకు భిన్నంగా ముస్లిం దేశాలలో స్త్రీల గౌరవ ప్రతిష్ఠలకు, వారి హక్కులకు ఒక స్థాయి కల్పించబడింది. కుటుంబ వ్యవస్థలో ఆమె ఒక గౌరవనీయురాలైన వ్యక్తిగా, పురుషుని సహజీవనంలో ఆమెది కీలకమైన పాత్రగా గుర్తించడం జరిగింది. గొప్పింటి ఆడపడుచులు తమ భర్తల చితిపై తమను స్వయంగా అర్పించుకునే దేశంలో ఇస్లాం, స్త్రీలకు ప్రసాదించిన హక్కులు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటాయి.

బర్నియర్ (BURNER) అనే యాత్రికుడు ఒకచోట ఇలా రాస్తున్నాడు : "ఇటువంటి (సతి) సంఘటనలు గతాన్ని పోల్చుకుంటే ఎంతో తగ్గిపోయాయి. ముస్లిములు దేశాన్ని పాలిస్తున్న కాలంలో ఇలాంటి మూఢాచారాలను తుదముట్టించేందుకు పూర్తిబలం కలిగి ఉండేవారు. అయితే యధార్థానికి వారు బలప్రయోగానికి ఎన్నడూ ఒడిగట్టలేదు. ఈ దేశంలో తాము మైనారిటీలమని వారు గుర్తించారు. కనుక వారు అధిక సంఖ్యాకులైన హిందువులకు పూర్తిగా మత స్వేచ్ఛనిచ్చారు. అయితే సామాజిక దురాచారాలను రూపుమాపటానికి పరోక్షంగా

కొన్ని ఆంక్షలు పెట్టారు. ఏ స్త్రీ అయినా తన రాష్ట్ర గవర్నర్ అనుమతి పొందనిదే తనను భర్త చితిమంటలకు అర్పించుకోకూడదు. ఆ స్త్రీ మానసిక స్పృహలో ఉండి మనస్ఫూర్తిగా సతీసహగమనం చేయడానికి పూనుకుందని నిర్ధారణ అయినప్పుడే గవర్నర్ తరపున అందుకు ఆమోదముద్ర లభించేది."

బర్నియర్ ఇంకా ఇలా వ్రాశారు :

"భారత దేశపు ఒక చారిత్రక యుగం ముస్లిం దండయాత్రలతో ప్రారంభమయింది. ముస్లిములే భారతదేశపు ప్రథమ చరిత్రకారులు. భావ విశాలత, జాతి, దేశ ప్రయోజనాలను గురించిన నిస్వార్థమైన ఆలోచనా ధార, సాహితీరంగపు మెళుకువలతో వారు భారతదేశాన్ని కాంతిమంతం గావించారు. తాత్వికులు, ఆలోచనాపరులు, సాహితీపరులు లేనిదే ఏ దేశంలోనైనా ఆలోచనలకు కొత్త ఒరవడి లభించదు కదా!"

సజీవమైన, సచేతనమైన, సుందరమైన విశాల దృక్పథం కలిగిన ఉర్దూ భాషను ఈ దేశానికి ప్రసాదించిన ఘనత కూడా ముస్లిములకే దక్కుతుంది. ఉర్దూ భారతదేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య వారధి అయిపోయింది. సాహిత్య అభిరుచిని ప్రదర్శించగోరే వారికి అత్యుత్తమమైన సాధనంగా అలరారింది ఉర్దూ.

భారతీయుల భావ దారిద్ర్యాన్ని, బడుగుతనాన్ని గురించి బాబర్ వ్యక్తపరచిన అభిప్రాయాలను అవలోకిస్తూ జవహర్ లాల్ నెహ్రూ ఇలా అన్నారు :

"బాబర్ పలుకు మనకు ఉత్తరాదిన తాండవించిన మన సాంస్కృతిక దారిద్ర్యపు గాథను వినిపించింది. దీనికి కుంటి తైమూర్ సృష్టించిన వినాశనం కూడా కొంతవరకు కారణమే. మరో కారణం దక్షిణాది నుంచి వచ్చిన ప్రముఖ వ్యక్తులు, కళాకారులలో కూడా దాగి ఉంది. అయితే ప్రధాన కారణం ఏమిటంటే, అప్పట్లో భారతీయుల్లోని సృజనాత్మక శక్తి వాడిపోతుండేది."

ప్రసిద్ధ చరిత్రకారుడు సర్ జాదూనాథ్ సర్కార్, ముస్లిములు భారతదేశానికి ప్రసాదించిన కానుకలను పేర్కొన్నాడు – వాటిలో కొన్ని ఏమంటే,

1. బాహ్య ప్రపంచంతో సంబంధాలు నెలకొల్పుకోవటం.

2. రాజకీయ సమైక్యతను సాధించడం, అగ్రవర్ణాలలో నాగరీక, సాంస్కృతిక విషయాలలో, వస్త్రధారణలో సమన్వయం సాధించడం.

3. ఒక ఉమ్మడి అధికార భాషను, అతి సామాన్యమైన ఒక లిపిని చెలామణిలోకి తీసుకురావడం. ఈ కృషిని హిందువులు ముస్లిములు కలసి చేశారన్నది విస్మరించరాని విషయం.

4. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాంతీయ భాషల ప్రగతి వికాసం అన్ని ప్రాంతాలలో శాంతి భద్రతలు నెలకొనడానికి, సారస్వత సాంస్కృతిక రంగాలలో అన్ని ప్రాంతాల ప్రజలకు సమానావకాశాలు కల్పించడానికి ఇది అనివార్యమయింది.

5. సముద్రయానం ద్వారా వాణిజ్యం పునరుద్ధరణ. దక్షిణాది వారు అంతకు ముందు ఈ వాణిజ్యం చేసేవారు. అయితే మధ్యలో చాలాకాలం ఇది స్థంభించింది.

ఒక ముస్లిం మేధావి ప్రకారం, ముస్లిములు సతతం స్వదేశం పట్ల నిండు మనసుతో గౌరవ భావాన్ని, ప్రేమను ప్రదర్శించేవారు. భారతదేశ భౌతిక సాంస్కృతిక, వాస్తుకళల కోసం వారు శక్తివంచన లేకుండా కృషి చేశారు. అవసరమైతే తమ ప్రాణాన్ని పణంగా పెట్టడానికి కూడా వెనుకాడలేదు. దేశ సేవకోసం ఏ దశలోనూ నిర్లిప్తతను, అనాసక్తతను ప్రదర్శించలేదు. వారి ఈ స్ఫూర్తి నేటికీ అంతరించలేదు. వారు నేటికీ తమ సంస్కృతిని పరిరక్షించుకుంటున్నారు. ముస్లిం జగత్తుతో వారి అనుబంధం విడదీయరానిది. వారు ఇప్పటికీ తమను ఈ దేశ భాగస్తులుగా, ఇక్కడి పౌరులుగా, ఇక్కడి పాలితులుగా, పాలకులుగా చెప్పుకుంటూ ఉంటారు.

ఇక భారతీయ సమాజంపై సూఫీల ప్రభావం అంతా ఇంతా కాదు. ఆధ్యాత్మిక, విద్యారంగాలపై సూఫీలు చెరగని ముద్ర వేశారు. పారసీకం, అరబీ, ఉర్దూ భాషలు అభివృద్ధి చెందాయి. సూఫీల సారధ్యంలో ఐకమత్యం, విశ్వమానవ సౌభ్రాతృత్వాలకు విశేష ప్రాచుర్యం లభించింది. వారి వెనుక హిందూ ముస్లిం శిష్యగణాలుండేవి. అధికార బలం కలిగిన చక్రవర్తి సయితం సూఫీల పలుకులను వేదవాక్కుగా తీసుకునేవాడు. సూఫీలు, నిజామీలు, ఖాద్రీలు, చిష్తీలు, నఖ్షబందీల పరంపరకు చెందిన మహనీయులు ప్రజల సామాజిక జీవితంపై గట్టి ప్రభావం వేయగలిగారు. హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా (రహ్మలై), ఫతేపూర్ సిక్రీకి చెందిన చిష్తీ సలీమ్ (రహ్మలై), గుల్బర్గాలోని హజ్రత్ ఖాజా బందె నవాజ్ (రహ్మలై) ఎటువంటి మహనీయులంటే, వారి ఉరుసుల్ని నేటికీ ప్రజలు వైభవోపేతంగా జరుపుకుంటారు. కుల, మత, వర్గ విచక్షణ లేకుండా దేశం మారుమూలల నుంచి ప్రజలు

తండోపతండాలుగా తరలివచ్చి నివాళి ఘటిస్తారు. భారత దేశ చరిత్రలో సూఫీల పాత్ర ఎన్నదగినది. ముఖ్యంగా హజ్రత్ ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మాలై) పేరు అగ్రస్థానంలో పేర్కొనదగింది. చిష్తీ పరంపరకు ఆయన ఇక్కడ పునాది వేశారు. తన బోధనల జ్యోతితో ఉప ఖండమంతటా వెలుగును ప్రసరించారు.

క్రీ.శ. 7వ శతాబ్దిలో బగ్దాద్ ఖలీఫా హారూన్ రషీద్ కాలంలో పశ్చిమాసియా భారత వైద్యవిభాగం ద్వారా కొంత ప్రయోజనం పొందినప్పటికీ, దివ్యమయిన యూనాని వైద్యాన్ని ముస్లిములు భారతదేశానికి తీసుకువచ్చారు. ఈ వైద్యవిధానం అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రగతిశీలకమైనదిగా ఖ్యాతి గడించింది. యూనాని వైద్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా పరిఢవిల్లే కాలంలో ఈరాన్, టర్కీ, ఇరాక్ ఇంకా సమస్త ప్రపంచంలో యూనానీ వైద్యపు పెద్ద పెద్ద కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. మధ్య యుగంలో ఈ వైద్య విభాగంలో ఆరితేరిన వైద్యులు ఉండేవారు. భారతదేశంలో ముస్లింల పాలన నెలకొన్న తరువాత ఢిల్లీ సుల్తానులు, మొగలాయిలు, బహ్మనీలు, కుతుబ్‌షాహీల హయాములలో విశ్వవిఖ్యాత వైద్య నిపుణులు ఎందరో భారత దేశానికి తరలి వచ్చారు. ఆనాడు దేశంలో ప్రముఖ వైద్యుడు లేని పట్టణం, ప్రదేశం ఏదీ లేదని నేనంటే అది అతిశయోక్తి ఎంతమాత్రం కానేరదు.

# సామరస్య రథసారధులెవరు?

**- సుప్రసిద్ధ చరిత్రకారుడు ఎం.ఎన్. రాయ్.**

ఇస్లాం ప్రారంభ దశ దాదాపు అంతమైనప్పుడు భారత దేశంలో ఇస్లాం యుగం ఆరంభమైంది. మార్గదర్శకత్వపు భారం దాని మొట్టమొదటి విప్లవ రథసారధుల భుజస్కంధాలమీద లేకపోయినా దాని పతాకం మీద ప్రారంభకాలంలో ముద్రితమైన విప్లవ జాడలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. చరిత్ర అధ్యయనం ద్వారా తెలుస్తున్నదేమంటే ఈరాన్ మరియు కొన్ని క్రైస్తవ దేశాల్లో దాని విజయానికి కారణభూతమైన పరిస్థితులే భారత దేశంలో కూడా దాని పురోగతికి తోడ్పడ్డాయి.

ఇక్కడ ఓ అతి ముఖ్యమైన విషయాన్ని జ్ఞప్తియందుంచుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది. తరతరాల చరిత్ర కలిగి ఉండి, పూర్వపు సంస్కృతీ నాగరికతలతో శోభిల్లుతున్న జాతి, విదేశీ దండయాత్రీకుల ముందు అంత సులభంగా తన ఆయుధాన్ని దింపి వేయజాలదని, ఆ దాడులు చేసేవారిని తన సానుభూతిపరులు, మిత్రులు అని గ్రహించనంతవరకు లొంగిపోయే సమస్యే ఉదయించదని గ్రహించాలి. క్రీ.శ. 11, 12 శతాబ్దాలలో భారత దేశ పరిస్థితి ఏమంటే గౌతమ బుద్ధుడు ప్రజ్వరిల్లచేసిన విప్లవాన్ని బ్రాహ్మణత్వం పూర్తిగా రూపుమాపి ఆ స్థానాన్ని ఆక్రమించింది. తర్వాత దేశంలో అంటరానివారుగా, నీచులుగా పరిగణించబడిన అసంఖ్యాక ప్రజలు ఇస్లాం సందేశానికి స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉండినారు. ఆ కాలంలోనే ముహమ్మద్ బిన్ ఖాసిం భారతదేశంపై దండయాత్ర చేశాడు. సునాయాసంగా సింధూను జయించగలిగాడు. అదెలా జరిగింది? అప్పటి బ్రాహ్మణ ఆధిపత్యంలో అణగద్రొక్కబడి దిక్కు తోచని స్థితిలో ఉన్న జాట్లు, రైతుసోదరుల సహకారంతోనే ముహమ్మద్ బిన్ ఖాసిం సింధూ ప్రాంతాన్ని జయించాడు. ఏమయినా సింధూను జయించాక ముహమ్మద్

బిన్ ఖాసిం అక్కడి ప్రజల పట్ల చూపిన ఔదార్యం, వ్యవహార సరళిని ఇలియట్ తన గ్రంథం – "భారత చరిత్ర"లో ఇలా ప్రస్తావించాడు: "దేశంలో శాంతి, సౌమనస్యాలు, పరస్పర నమ్మకాలు నెలకొల్పే బాధ్యతా భారాన్ని ఆయన బ్రాహ్మణులకే అప్పగించాడు. మందిరాల మరమ్మతులు, పూర్వంలాగే ఆరాధన, పూజాపునస్కారాలు కొనసాగించ డానికి వారికి అనుమతి ఇచ్చాడు. దేశంలో పన్ను వసూలు చేయడానికి, పూర్వపు ప్రాంతీయ శాంతి భద్రతల్ని యథావిధిగా నెలకొల్పడానికి వారికి ఉద్యోగాలిచ్చాడు." హీవల్ పురాతన భారతీయ నాగరికత, సంస్కృతి పట్ల అపార భక్తి, పూజ్యభావంగల వారిలో సుప్రసిద్ధుడు. ఆయన ముస్లింల పట్ల మొగ్గుచూపడం అటుంచి వారి పట్ల న్యాయం చేస్తాడన్న ఊహకున్నాడ రవ్వంత అవకాశం లేదు. అయినా ఆయన భారతంలో ఇస్లాం ప్రగతిని ప్రస్తావిస్తూ ఇలా వ్రాశాడు :

"ఎవరు ఇస్లాంను స్వీకరించినా వారు న్యాయస్థానాల్లో ముస్లిం పౌరులకు గల హక్కులన్నింటినీ కల్గివున్న వారుగా పరిగణించబడేవారు. న్యాయస్థానాల్లో ఆర్య శాసనాలకు బదులు ఖుర్ఆన్ ప్రకారంగా తీర్పులు ఇవ్వబడేవి."

ఇంకో సందర్భంలో హీవల్, ఇస్లాం ఆత్మజ్ఞాన విలువల్ని ప్రస్తావిస్తూ భావయుక్తమైన ఈ విషయాన్ని కూడ వెల్లడించాడు :

"భారతదేశంలో ఇస్లాం స్వీకరించిన అసంఖ్యాక ప్రజలు దాన్ని దాని తాత్విక విలువల వల్ల స్వీకరించలేదు. కానీ అది నిర్దేశించిన సామాజిక కార్యక్రమం పట్ల విశేషంగా ఆకర్షితులయి స్వీకరించారు. నిస్సంశయంగా ప్రజలు ఓ తాత్విక విషయం పట్ల కాకుండా తమ జీవితాన్ని సౌభాగ్యవంతం చేసుకునే విషయమై హామీ ఇచ్చే కార్యక్రమం పట్లే ప్రభావితులవుతారు. భారతదేశంలో ఇస్లాం సామాజిక కార్యక్రమానికి విజయం, ప్రజల ప్రోత్సాహం లభించడానికి గల ఒకే ఒక్క కారణం – ఏ భారతీయ తాత్వికత అయితే దేశ సమాజ విధానాన్ని ఛిన్నాభిన్నం చేసివేసిందో దానికి ప్రత్యామ్నాయంగా అత్యుత్తమమైన తాత్విక విధానం వారి ముందే ఉండటం. ఈ వాస్తవాన్ని మనం మరుగుపరచలేం. ఆ తాత్వికత మరేదో కాదు – యుగాల తరబడి ఛిన్నాభిన్నం అయిపోయి, అంధకార కుహరంలో మ్రగ్గుతున్న ప్రజలు బయటపడ్డానికి సహకరించిన తాత్వికతే ఇస్లాం.

పైన వివరించిన వాస్తవాన్ని హీవల్ అంగీకరించిన తర్వాత ప్రస్ఫుటమయిన

విషయమేమంటే, క్రీ.శ. 13, 14 వ శతాబ్దాలలో కూడా భారతదేశంలో – ఇస్లాం పురోగమిస్తున్నప్పుడు – సమాజంలో విప్లవం ప్రజ్వరిల్లడం కోసం ప్రయత్నం నిరంతరం కొనసాగుతూనే ఉందన్నమాట. ఇంకో మాటలో చెప్పాలంటే ఆ కాలంలో కూడ ఇస్లాం భారతీయ తాత్వికత కంటే ఆధ్యాత్మికత, సామాజిక విధానమే అపరిమితమైన ప్రగతిశీలమైనదని రుజువయింది.

చరిత్రకారుడు హీవల్ పైన చెప్పినట్లుగా పూర్వపు భారతీయ, ఐరోపా నాగరికతలు, సంస్కృతుల పట్ల అపారమైన పూజ్యభావం కల్గి ఉండేవాడు. అంతేకాదు ఆ నాగరికతల్ని మానవుని అమూల్యమైన ఆవిష్కరణలుగా అభివర్ణించేవాడు. అయినా ఆయన తన ఉద్గ్రంథం "ఆర్యన్ రోల్ ఇన్ ఇండియా"లో ఈ వాస్తవాన్ని అంగీకరించక తప్పలేదు. "ఇస్లాం రాజకీయ దృష్టి భారతీయ సమాజంలో రెండు విధాలుగా ప్రభావితం చేసింది. కులం, వర్గ సంఘర్షణను ఘోరమైన అన్యాయమని అభివర్ణించి దానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది. ప్రారంభంలో అరబ్బులు ఇస్లాంలో ఏ ఆకర్షణానుభూతిని పొందారో సరిగ్గా అదే అనుభూతిని భారతీయ సమాజంలో అణగద్రొక్కబడ్డ వర్గాలు పొందాయి. ఇస్లాం శూద్రులకు విమోచనం ఒక్కటే కాదు, భారతీయ సమాజంలో అగ్రవర్ణాలను మించిన అగ్రస్థానాన్ని కూడా ప్రసాదించింది."

హీవల్ ఏ వాస్తవాన్ని అంగీకరించాడో దానికి ఇంకాస్త ముందుకు వెళ్ళి చూస్తే భారత్‌లో కబీర్, గురునానక్‌జీ, తుకారాం వంటి సంస్కర్తలు తీసుకువచ్చిన చైతన్యాలు కూడ బ్రాహ్మణత్వానికి విరుద్ధంగా ఏ తిరుగుబాటు బావుటా సర్వశక్తితో ఎగురవేశారో అది ముస్లిం సమాజ పంథా ఫలితమేనని వ్యక్తం చేస్తున్నాము.

క్లుప్తంగా చెప్పేదేమంటే చరిత్రను వాస్తవిక దృష్టితో అధ్యయనం చేసిన తరువాత ఇస్లాం మతధర్మం, ఇస్లాం నాగరికత, సంస్కృతికి విరుద్ధంగా ముస్లిమేతరులు చూపుతున్న అసూయ దోషభూయిష్టమైనది. అర్థరహితమైనదిగా గోచరిస్తున్నది. వారి ఈ అసూయ చరిత్రను అవమాన పరచడమే కాదు, దేశ భవిష్యత్తుకు అపాయకరమైనది కూడా.

నేడు ఆధునిక నాగరికతకు మార్గదర్శిగా భావించబడుతున్న ఐరోపా సర్వస్వం ముస్లింల నుండే నేర్చుకుంది. నేడు కూడా పాశ్చాత్యులు ఇస్లాం పుత్రరత్నాలు చేసిన ఉపకారాన్ని అంగీకరిస్తూ వేనోళ్ళ కొనియాడతారు. ఒకవేళ భారతీయులు ఈ మహోజ్వల చరిత్ర వాస్తవాన్ని గ్రహించగల్గితే ఎంత బావుంటుంది!

మానవ నాగరికత, సంస్కృతి ప్రగతిలో ఇస్లాం ఎంత అధికంగా తన పాత్రను పోషించిందో, అది చేసిన అవిరళ కృషికి గల చారిత్రక విలువలేమిటో గ్రహించగలిగితే వారు అపార్థాల స్వాప్నిక జగత్తులోంచి బయటపడతారు. ఆ కాలంనాటి పరిస్థితుల ప్రకారం ముస్లింలు భారత్‌లో తమ సామ్రాజ్యాన్ని స్థాపించడానికి వచ్చినా ఈ దేశవాసులను హింసించడమన్నది మాత్రం వారి ఆశయం కాదు. ముస్లింల సత్ప్రవర్తన, ఇస్లాం శిక్షణలే ఇక్కడి ప్రజల మీద ప్రగాఢ ప్రభావం వేశాయి. వారు తమ ఆత్మసాక్షిగా ఆనందంగా ఇస్లాంను స్వీకరించారు.

# నిజం నిప్పులాంటిది, దాన్ని ఏ చరిత్రా దాచలేదు

ముస్లింలు ఈ దేశపు నేలమీద విజేతలుగా కాలుమోపిన తర్వాత ఈ దేశాన్ని ఓ విదేశీ ముస్లిం రాజ్యానికి వలస దేశంగా మార్చలేదు. అందుకు చరిత్రే సాక్షి. పైగా వారు ఈ దేశవాసుల్లో కలసిమెలసిపోయారు. ఈ దేశపు పూర్వ వాసులపట్ల ఏనాడూ చిన్న చూపు చూడలేదు. వారు ఎల్లవేళలా వారికి సమాన స్థాయి కల్పించి వారి పట్ల గౌరవంగా ప్రవర్తించారు. ముస్లింల ఈ విధానం సామరస్యం వరకే పరిమితం కాదు. అందులో చాలా పెద్ద రాజకీయ యుక్తి, ఉపాయం ఉంది. వ్రేళ్ళమీద లెక్కపెట్టగల ముస్లింలు అధిక సంఖ్యాకులైన ఈ దేశ ముస్లిమేతర సోదరుల హృదయాల్ని జయించకపోతే వారిని పాలించడం కష్టసాధ్యం. కాబట్టే భారత దేశం మొట్టమొదటి విజేత ముహమ్మద్ బిన్ ఖాసిం సింధూ ప్రాంతాన్ని జయించాక హజ్జాజ్ బిన్ యూసుఫ్ తరపున ఆయనకు ఈ ఆజ్ఞలు జారీచేయబడ్డాయి.

"సింధూ ప్రాంత ప్రజలపట్ల సౌమ్యంగా, సామరస్యంగా ప్రవర్తించు. వారి సంక్షేమం కోసం ప్రయత్నించు. ఓ ప్రాంతం పెద్దలు, సర్దార్లు మిమ్మల్ని కలుసుకోడానికి వస్తే వారిని విలువైన కానుకలతో సన్మానించు. ఎవరికైనా వాగ్దానం చేస్తే దాన్ని తప్పకుండా నెరవేర్చు. ఎవరైనా మిమ్మల్మి ఓ జాగీరు, ఓ రాష్ట్రాన్ని ఇవ్వమని కోరితే వారిని నిరాశపరచవద్దు. మత విషయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోకూడదు. ఎందుకంటే అది పరిపాలనా సూత్రానికి విరుద్ధం. ఏ రాజు అయినా విధేయత పాటిస్తే అతని రాజ్యాన్ని అతని అధీనంలోనే ఉంచు. శతృత్వాన్ని తగ్గించి మైత్రిని పెంచు. పరాజితులతో చేసుకున్న ఒప్పందాల్ని పాటించు."

హజ్జాజ్ బిన్ యూసుఫ్ జారీ చేసిన ఈ ఆజ్ఞలు ముస్లింల పరిపాలనా విధానమేమిటో స్పష్టంగా తెలియపరుస్తున్నాయి. ముహమ్మద్ బిన్ ఖాసిం ఆ హితవుల్ని తు.చ. తప్పక పాటించాడు. ఈ దేశవాసుల మనసుల్ని ఏనాడూ నొప్పించలేదు. ఫలితంగా సింధూ ప్రాంతంలో ఆయన ప్రభుత్వం స్థిరపడిపోయింది. అందుకు అన్ని విధాల అండదండలు అందించిన వారిలో ముస్లింలకన్నా హిందూ సోదరులే అధికులు. అందరికంటే అధికంగా ఆక్షేపణలు, నిందలతో అప్రతిష్టపాలైన మహ్మూద్ గజనవి కూడ ఓ పెద్ద సేనను తయారు చేశాడు. దానిపై సైన్యాధిపత్య బాధ్యతల్ని హిందూ జనరల్స్ నిర్వహించేవారు. ఆ హిందూ సైన్యాధిపతుల్లో ప్రముఖుడయిన రాజా తిలక్‌కు అత్యంత కీర్తి ప్రతిష్టలు లభించాయి. తిరుగుబాటు చేసే పలు ముస్లిం తెగల్ని అణచివేయడానికి ఆయన మహ్మూద్‌కు అమితంగా సహకరించాడు. మహ్మూద్ గజనవిలానే ఆయన సంతానం కూడ హిందూ సేనాపతుల మీదే విశ్వాసముంచింది. సుల్తాన్ మసూద్ హిందూ సేనాపతుల పట్ల అంతగా విశ్వాసముంచిన కారణంగా ముస్లిం సేనాపతులు అతణ్ణి ఏవగించుకున్నారు. ఇంకో వాస్తవం కూడా బహిరంగ రహస్యమే. మహ్మూద్ గజనవి మనుమడు బహ్‌రాం బిన్ మసూద్ ప్రఖ్యాత సంస్కృత గ్రంథం “పంచతంత్ర”ను పారసీక భాషలోకి అనువదింపజేశాడు. ఇప్పటి వరకు చెక్కు చెదరకుండా ఉన్న అశోక స్థూపాన్ని ఫిరోజ్ షా తుగ్లక్ నేలలోంచి త్రవ్వించి ఆ చరిత్రాత్మకమైన చిహ్నాన్ని భద్రపరిచాడు. ఫిరోజ్ షా హృదయంలో సామ్రాట్ అశోకుని పట్ల ఎనలేని గౌరవం ఉండేది. అతడు పారసీక భాషలో సామ్రాట్ అశోకుని జీవిత చరిత్ర కూడ రచింపచేశాడు. అలాగే లోడీ వంశీయులు కూడా హిందూ సోదరుల హృదయాలను దోచుకున్నారు.

హిందూ సోదరులకు పెద్ద పెద్ద పదవుల్లో నియమించారు. పార్శీ భాష నేర్చుకోవాలని ప్రోత్సహించిన మొట్టమొదటి ముస్లిం పాలకుడు సికిందర్ లోడీ, ఈ అవకాశంతో ప్రయోజనం పొందిన కాయస్తులు పార్శీ భాషలో నిష్ణాతులయ్యారు. అందుకే వారు ప్రభుత్వంలో పెద్ద పెద్ద పదవుల్ని ఆక్రమించారు. ఆ తర్వాత ప్రభుత్వ శాఖల్లో హిందూ సోదరుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ పోయాయి. ఈ

సంఘటనలు, వాస్తవాల వల్ల తేటతెల్లమయ్యే విషయం ఏమంటే ముస్లిం పాలకుల కాలం సంకుచితతత్వానికి, విచక్షణ, అణచివేతలకు అతీతంగా ఉండింది. అలా ముస్లిం పాదుషాలు ఈ దేశవాసుల శరీరాల మీద కాకుండా వారి హృదయాల్ని పాలించాలని అన్ని విధాల ప్రయత్నించారు.

ఇక అక్బర్ సామరస్య విషయంలో మాత్రం ఎవ్వరికీ రవ్వంతయినా సంశయం లేదు. అక్బర్ కాలంలో భారత్‌లో జాతీయ ప్రభుత్వానికి అంకురార్పణ జరిగింది. అది హిందూ ముస్లింల సమైక్య ప్రభుత్వం. జహంగీర్, షాజహాన్ పాలనా కాలంలో కూడా ఈ సామరస్య హరివిల్లు కానవస్తున్నది. అయితే ఔరంగజేబు ప్రభుత్వానికి విరుద్ధంగా చాలా వ్రాయబడింది. కానీ నిజం నిప్పులాంటిది కదా! ఔరంగజేబు కరుడు గట్టిన ముస్లిం అయినప్పటికీ పరమత ద్వేషి మాత్రం కాడు. అతని సర్వ సైన్యాధ్యక్షుడు జైసింగ్. అతను జీవించి ఉన్నంతకాలం ఔరంగజేబు ఆ హిందూ సైన్యాధిపతిపై ఉంచిన విశ్వాసం మరి ఏ ముస్లిం సేనాపతికి లభించలేదు.

శివాజీకి విరుద్ధంగా సాగించిన యుద్ధాలన్నింటినీ హిందూ సేనాపతులే నిర్వహించారు. కాబూలులో తిరుగుబాటు చెలరేగినప్పుడు ఆ క్లిష్ట సమయంలో ఔరంగజేబు దృష్టి ఓ హిందూ సేనాపతి మీద పడింది. అతడు కాబూల్‌లోని నూరు శాతం ముస్లిం ప్రాంతాన్ని రాజా జస్వంత్ సింగ్ అధీనం చేశాడు. ఔరంగజేబు మరణించే వరకు భారత్‌లోని హిందూ రాజ్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నించలేదు. అతడు జోధ్‌పూర్, ఉదయ్‌పూర్, కూచ్‌బిహార్ ఇంకా ఇతర హిందూ రాజ్యాల జోలికి పోకుండా, వారి ఆంతరంగిక విషయాల్లో జోక్యం కల్పించుకోకుండా జాగ్రత్త వహించాడు. కాగా అతడు బీజాపూర్, గోల్కొండ ముస్లిం రాజ్యాలను నాశనం చేసేశాడే కానీ హిందూ రాజ్యాలపై కన్నెత్తయినా చూడలేదు.

అక్బర్ చక్రవర్తి ఎల్లప్పుడు గంగానది జలాన్ని ఉపయోగించేవాడు. అక్బర్ దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా తపాల చౌకీల ద్వారా గంగా జలాలు పంపించబడేవి. ఈ సంప్రదాయాన్ని ఔరంగజేబు కూడ కొనసాగించాడు. ముస్లింలు "హిందూ పండుగ" అని పిలిచే దసరా ఉత్సవంలో ఔరంగజేబు ఎల్లప్పుడూ పాల్గొనేవాడు. ఈ వాస్తవాల ద్వారా ముస్లిం పాలనా కాలంలో ఎంతటి సామరస్యం ఉండేదో గ్రహించవచ్చు.

శివాజీ వద్ద ముస్లిం సవారీల ఓ పెద్ద దళం ఉండేది. సయ్యిది సంబల్, సయ్యిది మిస్రి, సయ్యిది బిలాల్, దౌలత్ ఖాన్ మొదలగు వారు శివాజీ విశ్వాస పాత్రులైన లెఫ్టినెంట్లు. విచిత్రమేమంటే శివాజీ తండ్రిగారు, బాబాయి పేర్లు విన్నాక చాలామంది అబ్బురపడి పోక తప్పదు. తండ్రిపేరు షాజీ, బాబాయి పేరు షర్ఫ్‌జీ. వాస్తవానికి అవి ఇస్లామీయ పేర్లు. దక్కన్‌లో ప్రసిద్ధిగాంచిన తాత్వికుడు పీర్‌షా షర్ఫ్ పేరున ఆ పేర్లు పెట్టబడ్డాయి. ఆ తాత్వికుడు శివాజీ కుటుంబ గురువుగా, మార్గదర్శిగా ఉండేవారు. ఇంకో ప్రఖ్యాత తాత్వికుడు బాబా యాకూబ్ బంకోటి పట్ల శివాజీకి అపరిమితమైన విశ్వాసముండేది. అలాగే జహంగీర్ పాదుషాకు ప్రఖ్యాత హిందూ తాత్వికుడు గోసాటన్ జద్‌రూప్ పట్ల ఎనలేని విశ్వాసముండేది. భారత్‌లో ముస్లిం పాలనా చరిత్రను లోతుగ అధ్యయనం చేస్తే ఆ కాలంలో హిందువులు, ముస్లింలు అన్ని జాతుల వారు సమైక్యంగా అమిత అనురాగ క్షీరసాగరంలో మునిగి తేలుతున్నట్లు కానవస్తుండేది.

వాస్తవం ఏమంటే, ఈ దేశంలో తరాలుగా హిందూ ముస్లిం సామాజిక సమైక్యత వేర్వేరు అన్న భేదభావాలు అంతమవుతూ వచ్చాయి. కాబట్టే కబీర్, చైతన్య, దాదూదియా, ఖాజా గరీబున్నవాజ్, పీరానే పీర్ సాహెబ్, రామానంద్ లాంటి హిందూ ముస్లిం తాత్వికులు, మేధావులు సామరస్యానికి విస్తృతంగా శిక్షణలు ఇచ్చారు. ఇంకో వాస్తవం ఏమంటే ఆ కాలంలో హిందూ పండితులు, తాత్వికులు ముస్లింల ఏకేశ్వర వాదానికి ప్రభావితులయ్యారు. వారి ప్రచారం వల్ల హిందూ సోదరుల ఆలోచనా విధానంలోనే పెద్ద విప్లవం చెలరేగింది.

❋ ❋ ❋

# సామాజిక కార్యక్రమాలే ఇస్లాం విజయానికి మూలం

అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన మేధావి, రచయిత మిస్టర్ ఎం.ఎన్. రాయ్ "భారత్‌లో ఇస్లాం వ్యాప్తికి మూల కారణం కరవాలమా?" అనే అంశం మీద ఇలా వ్రాశారు –

"ఇస్లాం ప్రారంభ దశ దాదాపు ముగిసిపోయిన కాలంలో అది భారత్‌లో ప్రవేశించింది. దాని ప్రారంభదశలోని విప్లవ నాయకుల మార్గదర్శకత్వం అంతరించి పోయినప్పటికీ దాని పతాక మీద విప్లవ భావాలు చెక్కు చెదరకుండా నిలిచి ఉన్నాయి. చరిత్ర అధ్యయనం వల్ల తెలుస్తున్నదేమంటే ఏ కారణాల వల్ల అది ఈరాన్, క్రైస్తవ దేశాల్లో వ్యాప్తిచెంది, విజయం, ప్రగతి సాధించిందో ఆ కారణాలవల్లే భారత్‌లో కూడ విజయం, ప్రగతి సాధించింది. ఇక్కడ ఓ వాస్తవాన్ని జ్ఞాపకం ఉంచుకోవాల్సి ఉంది. అదేమంటే సుదీర్ఘమైన చరిత్రగల, ప్రాచీన నాగరికతను జీర్ణించుకున్న ఓ జాతి తన మీద దండయాత్ర చేసేవారిని తన పట్ల సానుభూతిగల వారిగా, మిత్రులుగా భావించకపోతే ఎన్నటికీ ఓ విదేశీ దండయాత్రికుల ముందు ఆయుధాలు పడవేయదు. అందువల్ల క్రీ. శ. 11, 12వ శతాబ్ద కాలంలో భారతదేశంలో బ్రాహ్మణవాదం మహాత్మ బుద్ధుడు ప్రభవింపజేసిన విప్లవం మీద విజయం సాధించింది. బ్రాహ్మణవాదం విజయం తర్వాత శాపగ్రస్తులు, అస్పృశ్యులు, పాపులుగా భావించబడ్డ దేశంలోని అధిక సంఖ్యాక ప్రజలు ఇస్లాం సందేశాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండినారు. ఆ కాలంలోనే ముహమ్మద్ బిన్ ఖాసిం భారత్ మీద దండయాత్ర చేశాడు. ఆయన చాలా సులభంగా సింధూ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు. ఆ కాలంలో బ్రాహ్మణుల అధికారంతో విసిగివేసారిపోయిన

జాట్లు, ఇతర వ్యవసాయ వర్గాల సహకారంతోనే ముహమ్మద్ బిన్ ఖాసిం సింధూను జయించాడు. ఏమైనా సింధూను జయించాక ముహమ్మద్ బిన్ ఖాసిం అక్కడి ప్రజల పట్ల చూపిన సత్ప్రవర్తనా సరళి ప్రస్తావన ఇలియట్ తన గ్రంథం "భారత్ చరిత్ర"లో ఇలా వర్ణించాడు.

"దేశంలో శాంతి భద్రతల్ని, ప్రజల్లో నమ్మకాన్ని పటిష్టంగా ఉంచేందుకు ఆయన బ్రాహ్మణులనే నియమించాడు. మందిరాల మరమ్మత్తుకు, పూర్వంలా పూజలు, ఆరాధనలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చాడు. పన్నులు వసూలు చేసేందుకు, స్థానిక శాంతి భద్రతలను కాపాడేందుకు వారికి ఉద్యోగాలు ఇచ్చాడు."

హీవల్ ప్రాచీన భారతీయ నాగరికత, సంస్కృతిని సమర్థించి ఆరాధించే వారిలో అగ్రగణ్యుడు. అలాంటి వ్యక్తి ముస్లింలను సమర్థించి వారి పట్ల న్యాయం చేకూరుస్తాడన్నది నమ్మశక్యం కాదు. అయినప్పటికీ భారత్‌లో ఇస్లాం ప్రగతిని ప్రస్తావిస్తూ అతను "ఇస్లాం స్వీకరించిన వారందరూ న్యాయస్థానం దృష్టిలో ఇతర ముస్లింలలాగే సర్వహక్కులు కలిగిఉన్న వారుగా పరిగణించబడేవారు. ఆ న్యాయస్థానాల్లో దివ్య ఖుర్‌ఆన్ ఆజ్ఞల ప్రకారం తీర్పులు ఇవ్వబడేవి" అని వ్రాశాడు.

ఇంకో సందర్భంలో హీవల్ ఆధ్యాత్మిక విలువలను విశదీకరిస్తూ అనేక వాస్తవాల్ని వెల్లడించాడు : "భారత్‌లో ఇస్లాం స్వీకరించిన అసంఖ్యాక ప్రజలు ఇస్లాం తత్వశాస్త్రానికి ప్రభావితులు అయ్యారని కాదు కాని, ఇస్లాం చేపట్టిన కార్యక్రమాల పట్ల అత్యంత ఆకర్షితులయ్యారు. నిజానికి ప్రజలు ఏదో ఓ తత్వశాస్త్రం పట్ల ప్రభావితులు కారు, ఆ కాలపు జీవన సరళిని తీర్చిదిద్దే నమ్మకాన్ని కల్గించే కార్యక్రమాల పట్లే ఆకర్షితులవుతారు. ఇంకో వాస్తవాన్ని కూడా మనం దృష్టిపథం నుండి తప్పించలేము. అదేమంటే ఇస్లాం సామాజిక కార్యక్రమానికి ప్రజల ప్రోత్సాహం, సహకారం లభించింది. అందుకు ఒకే ఒక్క కారణం, ఆ కార్యక్రమం వెనుక దేశ సామాజిక విధానాన్ని ముక్క చెక్కలు చేసి వేసిన భారతీయ తత్వవిధానమే. అందుకు విరుద్ధంగా ఛిన్నాభిన్నమయిపోయి అజ్ఞానాంధకారంలో తరాల తరబడి కొట్టుమిట్టాడుతున్న ప్రజలు బయటపడ్డానికి సహకరించి, ఇస్లాం చూపిన అత్యుత్తమ తత్వవిధానం వారి కళ్ళ ముందు కదలాడింది."

పైన పేర్కొన్న హీవల్ అభిప్రాయాల తర్వాత తేటతెల్లమయ్యే వాస్తవం ఏమంటే క్రీ. శ. 13, 14 శతాబ్దాలలో భారత్‌లో ఇస్లాం ప్రగతి చెందుతున్న సమయాన విప్లవాన్ని ప్రభవింపజేసే ఇస్లాంలోని క్రియాత్మక శక్తి సమాజంపై ప్రభావం చూపుతూ

పోయింది. మరోలా గ్రహించాలంటే ఆ కాలంలో ఇస్లాం తాత్వికంగాను, సామాజికంగాను, భారతీయ సంప్రదాయాలకు విరుద్ధంగా, అపరిమిత ప్రగతిశీల మైనదిగా రుజువైంది.

ప్రాచీన భారతీయ, ఐరోపా నాగరికతలు, సంస్కృతులను గౌరవించి, సమర్ధించడమేకాకుండ ఆ నాగరికతలు, సంస్కృతుల్ని మానవుని మేధ ప్రసాదించిన అమూల్యమైన ఆలోచనా సంపత్తిగా అభివర్ణించినప్పటికీ చరిత్రకారుడు హీనల్ తన గ్రంథం "ఆర్యన్ గోల్ ఇన్ ఇండియా" – "భారత్‌లో ఆర్యుల పాత్ర"లో ఈ వాస్తవాన్ని ఒప్పుకోక తప్పలేదు. "ఇస్లాం రాజకీయ విధానం భారతీయ సమాజం మీద రెండు విధాలుగా ప్రభావం చూపించింది. అది జాతి, కులాల వైరుధ్యాన్ని ఘోర అన్యాయమని అభివర్ణించింది. దానికి విరుద్ధంగా తిరుగుబాటు లేవదీసింది. ప్రారంభంలో ఇస్లాం అరబ్బులను ఆకర్షించినట్లుగా హిందూ సమాజంలో వెనుకబడిన, బలహీన వర్గాల వారిని అసాధారణమైన రీతిలో ఆకర్షించింది.

శూద్రులను స్వేచ్ఛాపరులుగానే కాకుండా సమాజంలోని ఉన్నత వర్గాలతో సమానస్థాయిని ప్రసాదించింది ఇస్లాం."

భారత్‌లో కబీర్, గురునానక్‌జీ, తుకారాం, చైతన్యలాంటి సంస్కర్తలు కూడ బ్రాహ్మణ ప్రాచీన సంప్రదాయాలకు విరుద్ధంగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. దానికి ప్రేరణ ఇచ్చింది ముస్లింల సామాజిక విధానమే.

క్లుప్తంగా చెప్పేదేమంటే, వాస్తవిక దృష్టితో చరిత్ర అధ్యయనం చేసిన తర్వాత, ఇస్లాం, ఇస్లాం నాగరికత పట్ల ముస్లిమేతరులకు గల అసూయ, ఆరోపణలు అర్థరహితంగాను, జుగుప్సాకరంగాను కానవస్తున్నాయి. వారికి గల ఈ అసూయ కారణంగా చరిత్రను అవమానించడమే కాకుండా, దేశ రాజకీయ భవిష్యత్తును పూడ్చలేని నష్టం వాటిల్లుతుంది. ఈనాడు ఆధునిక నాగరికతకు మార్గదర్శిగా భావించబడుతున్న ఐరోపా, సర్వ శాస్త్రాలు ముస్లింల నుండే నేర్చుకుంది. ఈనాడు కూడ న్యాయప్రియులైన ఐరోపా మేధావులు ఇస్లాం చేసిన మహోపకారాన్ని వేనోళ్ళా శ్లాఘిస్తూ సహృదయంతో అంగీకరిస్తున్నారు. ఒకవేళ భారతీయులు కూడ మానవ నాగరికత, సంస్కృతుల ప్రగతిలో ఇస్లాం ఎలాంటి పాత్రను నిర్వహించిందో, చరిత్ర విలువల కోసం అది చేసిన అనితర సాధ్యమైన ప్రయత్నాలు, అవిరళ కృషి, త్యాగాలు ఏమిటో గ్రహించగల్గితే వారు స్వాప్నిక జగత్తులోంచి జాగృతం చెందగలరు.

# సెక్యులర్ ప్రభుత్వాన్ని స్థాపించింది ముస్లింలే

"ఇస్లాం అవతరించిన స్వల్ప కాలంలోనే ముస్లింలు భారత్‌లో ప్రవేశించడం ప్రారంభించారు. అరబ్బులు సాధారణంగా వ్యాపారులు. తీర ప్రాంతంలోని అరబ్‌వాసులు తమ వ్యాపార అవసరాల నిమిత్తం సుదూరాల వరకు సముద్రయానం చేసేవారు. వారి సముద్ర వ్యాపార ప్రయాణాల కారణంగా ఇస్లాం సందేశం ఆసియా, ఆఫ్రికా మూలమూలలా వ్యాపించిపోయింది. ప్రారంభంలో ఆ వ్యాపారులే భారత్‌లో ప్రవేశించారు. తర్వాత ఈ దేశంలోని విజేతగా, అధినేతగా, ఇస్లాం వీరుల ప్రథమ బృందానికి సారథిగా వచ్చినది ముహమ్మద్ బిన్ ఖాసిం.

ముహమ్మద్ బిన్ ఖాసిం యువకుడయినప్పటికీ తనకు గల సైనిక సామర్థ్యం, యోగ్యత, రాజకీయ పరిజ్ఞానం వల్ల తీర ప్రాంతం నుండి సింధూనదితో పాటు పంజాబ్‌తో కలిసిపోయే ఉపఖండంలోని సింధూ ప్రాంతాన్ని జయించి ఇప్పటికీ ఆదర్శవంతమైన ప్రభుత్వమని శ్లాఘించబడే ఇస్లామీయ రాష్ట్రాన్ని స్థాపించాడు. ముస్లింల ఈ ప్రభుత్వం ఎంతో కాలం నిలువలేదు. అయినప్పటికీ ఈ స్వల్ప కాలంలో ముస్లింల మత సామరస్యం, చక్కని పరిపాలనా ప్రజ్ఞ, పాటవాల చిహ్నాలు చెక్కు చెదరకుండ కానవస్తున్నాయి.

మొట్టమొదటిసారిగా ఏర్పడిన ఈ స్వల్ప కాల ముస్లిం ప్రభుత్వంలో హిందూ సోదరులు మత, సామాజిక స్వేచ్ఛను సంపూర్ణంగా అనుభవించారు. ఆలయాల నిర్మాణం, మతాచార, సంప్రదాయాల బాధ్యతా నిర్వహణలో ఎలాంటి నిషేధం

లేదు. వారు అన్ని రకాల పౌర హక్కులు కలిగి ఉన్నారు. పైగా ఈ ఇస్లామీయ ప్రభుత్వంలో చాలా భాగాల్లో శాంతి భద్రతల సంరక్షణ బాధ్యత కూడా వారి చేతుల్లోనే పెట్టబడింది.

భారత్‌లో ముస్లింల పరిపాలనా యుగం ముగిసిపోయాక చాలా కాలం వరకు ఈ దేశ చరిత్రలో ముస్లింల గురించి ప్రస్తావించబడలేదు. కానీ ముహమ్మద్ ఘోరీ కారణంగా రెండవసారి ముస్లింలు ఈ దేశంలోకి వచ్చే అవకాశం లభించిన తరువాత ఓ వినూత్న పరంపర మొదలయింది. ఈ కాలంలో భారత్‌లో ఖుతుబుద్దీన్ ఐబక్ ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపించాడు. అయితే అది తన నిజస్వరూపంలో నిలబడలేకపోయింది. కానీ మొగల్ సామ్రాజ్యం దాని పునాదుల మీదే నిర్మించబడిందని చెప్పడమే సమంజసం.

ముస్లింలు భారత్‌కు వచ్చి మొట్టమొదట నిర్వహించిన పని ఏమంటే, దేశంలో సమైక్యతను పరిరక్షించడానికి వారు అవిరళ కృషి చేశారు. వారు ఇక్కడకు వచ్చిన సమయాన పాలకుల్లో రాజ్య విస్తీర్ణ కాంక్ష తీవ్రంగా ఉండేది. వారు ఇక్కడి రాజులు మహా రాజులతో చేసిన యుద్ధాల్లో ఆ ఉద్దేశమే ఉందని అంగీకరించినప్పటికీ ఆ యుద్ధాల కారణంగా భారత్ ప్రాంతీయ పరంగా సమైక్యమైందన్న వాస్తవాన్ని అంగీకరించి తీరాలి.

భారత్‌లోని ఆ ముస్లిం పాలకులు దేశాభివృద్ధి, పాలనా రంగాల్లో కూడ అసలు మతాన్ని జోక్యం చేసుకోనివ్వలేదు. ఆ కాలంలో ప్రజలకు సెక్యులరిజం భావం ఏమిటో తెలియదు. దాని పరిచయమే లేదు వారికి. ముస్లింలు భారత్‌లో అనూహ్యంగా, అనాలోచితంగానయినాసరే తమ ప్రభుత్వాలను సెక్యులర్ విధానంలోనే పరిపాలించారు.

పైన వివరించిన వాస్తవాలకు సాక్ష్యాధారాల కోసం మనం భారత్‌లో ముస్లిం పరిపాలనా యుగ చరిత్ర పుటల్ని తిరుగవేసే అవసరం లేదు. మనం కేవలం పఠాన్లు, అందులో కేవలం ఒక్క షేర్షా సూరీ పాలనను పరిశీలిస్తే చాలు ముస్లింలు ఈ దేశంలో ఎలా పరిపాలన సాగించారన్నది అవగతమవుతుంది.

షేర్షా భారత ప్రభుత్వాన్ని ఓ హిందూ రాజుతో పోరాడి సాధించినది కాదు. అతడు హుమాయూన్‌ను పరాజితుణ్ణి చేసి తన ప్రభుత్వాన్ని స్థాపించాడు. అతని ప్రభుత్వం అఫ్ఘానిస్తాన్ సరిహద్దుల నుండి బంగాళాఖాతం వరకు వ్యాపించి ఉంది. అతడు తన పరిపాలనా కాలమంతా యుద్ధాల్లోనే గడిపేశాడు. అయినా కూడా

అతడు దేశంలో ప్రాంతీయ, భావ సమైక్యత స్థాపన పరంపరలో నిర్వహించిన సాహస కార్యాల్ని పరిశీలిస్తే, దాని వల్ల ఈ దేశ ముస్లిం పాలకుల ఆశయాలు, వారి ప్రభుత్వాల లక్ష్యాలు ఏమిటో గ్రహించడం ఏమంత కష్టమైన పనికాదు.

ప్రభుత్వాల, పాలకుల భద్రతకు సైన్యమే ఆధారమని భావించబడేది. ఆ కాలంలో సైన్యం సహాయం లేకుండ ఒక్క రోజు కూడా పాలన సాగించడం కష్టం. అందువల్ల షేర్షా కూడ ఓ పటిష్టమైన సేనను సిద్ధం చేశాడు. అయితే ఆ సైన్యంలో కేవలం ముస్లింలే  కాక,  అసంఖ్యాక హిందూ, రాజపుత్రులకు కూడ అతడు ఉన్నత పదవులు కట్టబెట్టి,  భారత్‌లోని చాలా ప్రాంతాల్ని జయించి వాటిని హిందూ సర్దార్ల పరం చేశాడు. అంటే షేర్షా ప్రభుత్వం కొన్ని ప్రత్యేకతల కారణంగా సెక్యులర్ విధానానికి ఓ గొప్ప ఆదర్శవంతమైన ప్రతిరూపమని చెప్పక తప్పదు.

ఓ దేశం ప్రగతి కోసం ఆ దేశ ప్రజల మధ్య నమ్మకం, ఆర్థిక సమానతలు ఎంత అవసరమో, ఆ దేశం ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాల వ్యవస్థ కూడ అంతే అవసరం. అందుకు షేర్షా ఓ వైపు మత సామరస్యం, పౌరహక్కులను గౌరవిస్తూ క్రొత్తగా వచ్చే ముస్లింలు, భారత్ వాసుల మధ్య అనితర సాధ్యమైన భావ సమైక్యతను నెలకొల్పాడు. ఇంకోవైపు తన రాజ్య సరిహద్దుల్ని బెంగాల్ వరకు విస్తరింపజేసి భారత్‌ను సమైక్యపరిచాడు. మరో వైపు యావత్ దేశాన్ని కేంద్రీకృతం చేయడానికి పటిష్టతరమైన మార్గాల్ని సమకూర్చాడు. అందుకు అతడు ఓ సుదీర్ఘమైన రాజబాటను నిర్మించాడు. అది పెషావర్ నుండి కలకత్తా వరకు వ్యాపించి ఉంది. అది ఈనాడు కూడ ఉంది. ఆ సుదీర్ఘమైన రాచబాటలో యాత్రికుల సౌకర్యం కోసం ప్రతీచోట సత్రాలు నిర్మింపజేశాడు. వస్తుసామగ్రి రవాణా కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. దేశంలో మొట్టమొదటి సారిగా తపాల పద్ధతిని ప్రవేశపెట్టాడు.

షేర్షా కాలంలో ప్రవేశపెట్టిన తపాల, వస్తు సామగ్రి రవాణా పద్ధతులు, మార్గాలు భారత్ వర్తక, పారిశ్రామిక ప్రగతికి  పునాదులు.  అతని పాలనా కాలం తర్వాత ఈ పరంపరలో ఎన్నెన్ని ప్రగతులు సాధించాయో వాటన్నిటికీ షేర్షా పాలనా విధానమే మూలస్థంభం.

ఇది ముస్లిం పాలనా కాలంలో ప్రారంభ దశలోని ఓ కాంతికిరణం మాత్రమే. ఇలాంటి ఉదాహరణలు ఇంకెన్నో ఉన్నాయి.

# విభేదాలను విస్మరించిన విజేతలు - భారతదేశంలో హిందూ - ముస్లింల సఖ్యత

భారత దేశం సువిశాలమైన దేశం. ఈ దేశం గొప్ప గొప్ప మేధావులు, తాత్వికులు, సంస్కర్తలు, వీరయోధులు, సేనాపతులకు జన్మనిచ్చింది. ముస్లింలు ఈ దేశంలో ప్రవేశిస్తున్న సమయాన ఇక్కడ మేధావులు, పరాక్రమవంతులైన వీర యోధులు, సైన్యాధిపతులకు కొదువలేదు. అందువల్ల వారు అనన్య శౌర్య పరాక్రమాలతో ముస్లింలను ఎదిరించారు. అయినప్పటికీ ముస్లింలు ఈ దేశంలో విజేతలుగా ప్రవేశించిన వెంటనే విభేదాన్ని విస్మరించి పాలు నీళ్ళుగా కలసిపోయారు. ముస్లింలు, ముస్లిమేతరులన్న భేదభావం పొడచూపలేదు. అందువల్లే ఈ దేశంలో మొట్టమొదటి విజేత ముహమ్మద్ బిన్ ఖాసిం సింధూ ప్రాంతాన్ని జయించాక దేబల్ (కరాచి) గవర్నర్‌గా ఓ హిందూ పండితుణ్ణి నియమించాడు. సింధూ ప్రాంతం పూర్తిగా అధీనమయ్యాక కూడ సింధూ మాజీ రాజు దాహెర్ మంత్రి సిసాగర్ ప్రధానమంత్రిగానే కొనసాగాడు. ఆ హిందూ ప్రధానమంత్రి సిసాగర్ సహాయ సహకారం వల్లే ముస్లిం ప్రభుత్వ పునాదులు భారత్‌లో పటిష్టవంతమయ్యాయి. భారత ప్రఖ్యాత మేధావి మిష్టర్ ఎం.ఎన్. రాయ్ ఈ దేశంలో ముస్లింల విజయాలను సమీక్షిస్తూ ఇలా వ్రాశారు :

"ఆ కాలంలో బ్రాహ్మణ ప్రభుత్వంతో విసిగివేసారి పోయిన జాట్లు, ఇతర వ్యవసాయ వర్గాలవారి సహాయ సహకారాల వల్లే ముహమ్మద్ బిన్ ఖాసిం సింధూ ప్రాంతాన్ని జయించాడు. సింధూ విజయం తర్వాత ముహమ్మద్ బిన్ ఖాసిం హిందూ సోదరుల పట్ల చూపిన సామరస్య వైఖరి, సఖ్యతను ప్రస్తావిస్తూ ఇలియట్ తన గ్రంథం "భారత్ చరిత్ర"లో దేశంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం బ్రాహ్మణులనే నియమించాడు ముహమ్మద్ బిన్ ఖాసిం. ఆయన మందిరాలను మరమ్మత్తు చేసి

యధాప్రకారం అర్చనలు, పూజలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చాడు. భూమి శిస్తు, పన్నులు వసూలు చేయడానికి బ్రాహ్మణులనే నియమించాడు."

వాస్తవం ఏమంటే ముస్లింలు ఈ దేశంలో అడుగు పెట్టాక విశాల దృష్టి, యుక్తి, అవగాహన, విచక్షణ జ్ఞానం ప్రదర్శించి ఉండకపోతే మాత్రం విదేశాల నుండి వచ్చిన పిడికెడు ముస్లింలు 11 వందల సంవత్సరాల మాట అటుంచి 11 నెలలు అయినా ఇంత సువిశాలమైన దేశాన్ని పాలించడం అసాధ్యం. అసలు విషయం ఏమంటే ప్రారంభంలోనే ముస్లింలు ఈ దేశ వాసుల హృదయాల్ని ఎంతగా ఆకట్టుకున్నారంటే వారు భారత్‌లో ముహమ్మద్ బిన్ ఖాసిం స్థాపించిన ముస్లిం ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరించారు. రాజపుత్ర జాతి శౌర్య పరాక్రమాలు గల జాతి. ఆత్మాభిమానంలో ఆ జాతికి మరొకటి సాటిరాలేదు. కానీ ముస్లిం అధినేతల సామరస్యం, వారి పట్ల ప్రదర్శించిన గౌరవం, సద్వర్తనం ఆ వీరజాతిలోని పరాక్రమవంతుల హృదయాల్లో చెరగని ముద్ర వేసేసింది. ఆ కారణంగా వారు తమ రక్తాన్ని ధారపోసి భారత్‌లో ముస్లిం ప్రభుత్వం పునాదుల్ని పటిష్టపరిచాడు.

సుల్తాన్ మహ్మూద్ గజనవి భారత బద్ధశత్రువుగా భావించబడతాడు. చరిత్ర అధ్యయనం వల్ల మహ్మూద్ గజనవి స్థానం ఓ సాహసవీరుడు మాత్రమేనని తెలుస్తున్నది. అతడు హిందూ రాజ్యాల మీద దండయాత్రలు చేసినట్లుగానే ముస్లిం రాజ్యాలైన, హిరాత్, సీస్తాన్, ఆజర్ బైజాన్, బుఖార, సమర్‌ఖండ్, బల్ఖ్, ఇతర అనేక ముస్లిం ప్రభుత్వాల మీద కూడ దండయాత్రలు చేశాడు. మహ్మూద్ గజనీ చేసిన దండయాత్రల్లో కేవలం రాజ్య విస్తీర్ణమే తప్ప ఇంకేమీ లేదు. ముహమ్మద్ బిన్ ఖాసింలా అతనికి భారత్‌లో అధికారం హస్తగతమయ్యాక అతడు కూడ ముహమ్మద్ బిన్ ఖాసిం అడుగుజాడల్లో నడుస్తూ గజనీ సైన్యంలో హిందూ సోదరులకు పెద్ద పెద్ద పదవులు కట్టబెట్టాడు. హిందూ సోదరుల హృదయాల్ని నొప్పించకుండ ఉండడం కోసం అన్ని ప్రయత్నాలు చేశాడు. ఈనాటి ప్రఖ్యాత రచయిత శ్రీ గోపాల్ పురోహిత్, మహ్మూద్ గజనవి ఇతర భారత్ ముస్లిం అధినేతల స్టేట్ పాలిసీని సమీక్షిస్తూ ఇలా వ్రాశారు:

"మన దేశ చరిత్రలో భారత మధ్య యుగం అంటే ముస్లిం పాలన యుగ రూపురేఖల్ని హిందూ సోదరుల దృష్టి నుండి దిగజార్చి హృదయాల్లో విద్వేషం రగిల్చేలా చిత్రించబడింది. అయితే ఆ కాలంలోని నిజ పరిస్థితుల్ని పరిశీలించాల్సి

ఉంది. ఆంగ్ల చరిత్రకారులు వాస్తవ పరిస్థితుల్ని మరుగుపరచి, వక్రీకరించి, వికృత రూపంలో చిత్రించి మన చరిత్రపట్ల ఘోర అన్యాయం చేశారు. మన ఉద్రేకాన్ని అతి దారుణంగ ప్రజ్వరిల్ల చేశారు. మనకు వారు చూపించిందేమంటే మహ్మూద్ గజనవి లేక ముహమ్మద్ ఘోరీ ఎన్నిసార్లు భారత్ మీద దండయాత్ర చేశాడు, ఎంత ధన సంపత్తిని దోచుకుని తన దేశానికి తరలించాడనే. కానీ ఆ చరిత్రకారులు మనకు ఏనాడు చూపించని వాస్తవం ఏమంటే మహ్మూద్ గజనీ సైన్యంతో పాటు అల్ బెరూని పేరుగల ఓ విద్వాంసుడు భారత్ వచ్చాడనీ, వచ్చాక ఆయన సంస్కృత భాషకు ఎనలేని సేవ చేశాడనీ, హిందూ ముస్లిం తత్వశాస్త్రాన్ని సమ్మిళితం చేయడానికి ప్రయత్నించాడన్న వాస్తవాల్ని వారు మనముందు వ్యక్తం చేయలేదు. అంతేకాదు, మహ్మూద్ గజనీ పంజాబ్‌లో అమలు పరచిన నాణాలమీద సంస్కృత అక్షరాలు చెక్కబడి ఉన్నాయని, ఆ కాలపు ముస్లింలు హిందూ సోదరుల్లా భారత జాతీయతను పొందారని ఆ చరిత్రకారులు మనకు తెలియపరచలేదు. స్వయంగా బాబరు తన “తజక్ బాబరీ”లో ఇలా ఉల్లేఖించాడు : మేము భారతీయులం. మా దేశం భారత దేశం అని. అంతేకాదు, ముస్లింల రాక భారత నాగరికత మీద చక్కని ప్రభావం వేసిందని, అందువల్ల ఆ కాలంలో ముస్లింల పర్వదిన వేడుకల్లో, ఉత్సవాల్లో హిందూ సోదరులు, హిందువుల పర్వదిన వేడుకల్లో ముస్లింలు అమితోత్సాహంతో పాల్గొనేవారని కూడ ఆ చరిత్రకారులు మనకు తెలియపరచలేదు. జహంగీర్, బెంగాల్ అధినేత సిరాజుద్దౌలా హోలీ వేడుక చాలా ప్రఖ్యాతి గాంచింది. హిందూ ముస్లిం సోదరులు కలిసి ఆ వేడుకను జరుపుకునేవారు. సంస్కృతి, వస్త్రాలంకరణ వల్ల కూడ పరస్పరం ప్రభావితులయ్యారు. భారతీయ నాగరికతలో ఈనాడు కానవస్తున్న రంగు రంగుల హరివిల్లు హిందూ ముస్లిం సోదరులు పరస్పరం కలసిమెలసి పోయినందువల్లే.” (శ్రీ గోపాల్ పురోహిత్, ఎం.ఎ.)

మహ్మూద్ గజనవి తర్వాత అతని పుత్రుడు మసూద్ గజనవి సింహాసనం అధిష్టించాక తన సేనకు సర్వసైన్యాధ్యక్ష పదవిని ఓ ముస్లింకు కాకుండా హిందువైన జగన్నాథ్‌కు కట్టబెట్టాడు. ఆ కారణంగా పంజాబ్ ముస్లిం సైన్యాధిపతి అహ్మద్ నయాక్తగీన్ తిరుగుబాటు చేస్తున్నాడని అనుమానం రాగానే అతణ్ణి అణచడానికి హిందూ సైన్యాధ్యక్షుడైన జగన్నాథ్‌నే పంపించాడు. వాస్తవం ఏమంటే, భారత ముస్లిం పాదుషాలు ఎల్లప్పుడు స్పర్థలకు, అసూయలకు అతీతంగా ప్రవర్తించారు. అలా

వారు వ్యవహరించి ఉండకపోతే హిందూ ముస్లింలు కలహాగ్ని గుండంలో పడి సర్వనాశనమయి పోయేవారు. ఇంకో వాస్తవం ఏమంటే వారు ఈ దేశాన్ని జయించాక ఆంగ్లేయులవలె ఈ దేశాన్ని కొల్లగొట్టి దోచుకుపోలేదు. వారు ప్రారంభం నుండే ఈ దేశాన్ని తమ మాతృభూమిగా భావించి దాన్ని ఓ పరిపూర్ణ సభ్యతాయుత దేశంగా, సుఖప్రశాంతులకు నిలయంగా మలచడానికి బహువిధాల ప్రయత్నించారు. ప్రఖ్యాత చరిత్రకారుడు రాజ్‌కుమార్ సిన్హా భారత్ మీద ముస్లిం నాగరికత ప్రభావాన్ని సమీక్షిస్తూ ఇలా వ్రాస్తారు :

"ముస్లింలు ఈ దేశ భాషకు ఎనలేని సేవ చేశారన్నది ఖండించలేని వాస్తవం. ఈ దేశ సంగీతం (మ్యూజిక్)లో చాలా రకాల స్వరాలు, భాగాలు చేర్చారు. ముస్లింల నిర్మాణ కళానైపుణ్యం ఈ దేశానికి ఎల్లప్పుడు గర్వకారణంగా ఉంటుంది. ఈ దేశంలోని ప్రతీ అంశంలో ముస్లింల ప్రభావం ఉండడం మనం చూస్తాము. అన్న పానీయాలు, దుస్తులు, పాత్రలు, ఆభరణాలు, అలంకరణ చివరికి ఫల పుష్పాదులు అన్నింటిమీద ముస్లిం ప్రభావం కానవస్తుంది."

"మన ప్రతీ సామాజిక అంశంలో మహాద్భుతమైన సంస్కరణలు చేసినవారు ముస్లింలేనని అంగీకరించాలి. భారత్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు హిందూ, ముస్లింలు చేసిన ప్రయత్నాల ఫలితమే. చారిత్రకంగా మనకు ఆ అవసరం ఉండింది కూడ. ఎందుకంటే మన సంస్కృతిలో సమతుల్యం లేనంతవరకు భారత్‌లో ఓ సమైక్యతా సమాజం జనించడం అసాధ్యం. హిందూ, ముస్లిం – రెండు వర్గాల్లోని గౌరవనీయులైన పెద్దలు ఈ అవసరాన్ని గుర్తించి జీవితానికి ఓ సామాజిక విధానాన్ని రూపొందించారు. మత విభేదాలు ఉన్నప్పటికీ అది అన్ని వర్గాల వారి ఉమ్మడి సొత్తు. అలా మనకు గర్వకారణమైన, పటిష్టమైన ఉమ్మడి సాంస్కృతిక జీవన విధానం ఆవిర్భవించింది."

13 వందల సంవత్సరాల క్రితం ప్రారంభంలో ముస్లింలు వచ్చాక రెండు వర్గాల మధ్య సంఘర్షణలు సంభవించాయన్న వాస్తవాన్ని తిరస్కరించలేము. కానీ ఆ సంఘర్షణలు అంతమయిపోయాక ఇక నీవు, నేను అన్న విభేదాలు లేకుండ ఇరువర్గాలు కలిసిమెలసిపోయాయి. కాబట్టే భారత దేశంలో విభిన్న నాగరికతల రంగు రంగుల హరివిల్లు మహోజ్వలంగా వెలిగిపోతున్నది.

❋ ❋ ❋

# మతవర్గాల సుహృద్భావానికి మచ్చుతునక

మన దేశ ప్రఖ్యాత మేధావి, రచయిత డా. సయ్యిద్ మహ్మూద్, పి.హెచ్.డి. "అజాయ్‌జుల్ హింద్" గ్రంథం ఆధారంగా వ్రాసిన ఈ వ్యాసం హిందూ ముస్లిం సోదరుల సంబంధాల వాస్తవిక సంఘటనల్ని వ్యక్తపరుస్తూ ఉంది. దానిని పాఠకుల కోసం ఇక్కడ పొందుపరుస్తున్నాం.

ఈనాడు మన భారత దేశంలో హిందూ, ముస్లిం సోదరుల మధ్య తీవ్రమైన ఉద్రిక్తత నెలకొని ఉంది. అయితే అది వాస్తవమైనది కాదు. ఆంగ్లేయులు రాజేసిన అగ్ని గుండమది.

ఐరోపా, ఆసియాలో క్రైస్తవ పాలకులకు, ముస్లింలకు మధ్య క్రీ.శ. 8వ శతాబ్దిలో జరిగిన సంఘర్షణల్లో క్రైస్తవుల సానుభూతిని పొందడం కోసం క్రైస్తవ పాలకులు ఫాదిరీల సహాయ సహకారాలతో ఇస్లాం, ముస్లింలకు విరుద్ధంగా ఎన్నో తప్పుడు అభిప్రాయాలు, సంఘటనలను ప్రచురింపజేసి ప్రచారం చేయించారు. అలా ఐరోపాలో ఇస్లాంకు విరుద్ధంగా నిరాధారమైన ఆరోపణలు, అపనిందలతో కూడిన గ్రంథాల భాండాగారం సమకూర్చబడింది. భారత్‌లో తమ అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి ఆంగ్లేయులు ఆ గ్రంథాల ద్వారా లబ్ది పొందారు. వాటి సహాయంతో భారత దేశ చరిత్రను అతి క్రూరంగా, హేయంగా చిత్రించిన కారణంగా ఈ దేశంలోని రెండు పెద్ద జాతుల మధ్య అనుమానాలు, అపార్థాలు ఏర్పడ్డాయి. వారి సంబంధాలకు తీవ్రమైన విఘాతం సంభవించింది.

భారత్‌లో ఆంగ్లేయుల ప్రవేశానికి పూర్వం పరిస్థితులు భిన్నంగా ఉండేవి.

హిందూ ముస్లిం సోదరుల మధ్య విభేదాలు, వైషమ్యాలు ఉండేవి కావు. పరస్పర సానుభూతి, సమైక్యతతో ఉండేవారు. అందువల్ల భారత్‌లో ముస్లింల ప్రభుత్వ స్థాపనకు పూర్వం చాలా మంది హిందూ రాజులు వారిని గౌరవంతో చూడ్డమే కాకుండ, ఆ రోజుల్లో చాలామంది ఇస్లాంను పరిచయం చేసుకోవడాన్ని అభిలషించారు. ''అజాయ్‌బుల్ హింద్'', ''భారత్ వింతలు'' గ్రంథాల అధ్యయనం వల్ల తెలుస్తున్నదేమంటే మొదటి సారిగా భారత్‌లో ముస్లిం యాత్రికుల రాక ప్రారంభం కాగానే వారు అనుమానంతో చూడబడేవారు. కానీ తర్వాత వారి అనుమానాలన్నీ పటాపంచలైపోయాయి. హిందూ రాజులు ఇస్లాం గురించి విషయాలు సేకరించడానికి ప్రయత్నించారు. అందువల్ల ఖలీఫా హారూన్ రషీద్ సమకాలికుడైన ఓ హిందూ రాజు ఖలీఫాకు ఇలా వ్రాశాడు : "ఇస్లాం గురించి అన్ని విషయాలు క్షుణ్ణంగా బోధపరచగల ఓ విద్వాంసుణ్ణి మా దర్బారుకు పంపించగలరు" అని.

గ్రంథం అజాయ్ బుల్ హింద్ అధ్యయనం వల్ల ఇంకో విషయం తేటతెల్ల మవుతూ ఉంది. క్రీ.శ. 1280లో ఓ హిందూ రాజు ఆజ్ఞ మేరకు దివ్య ఖుర్‌ఆన్ అనువాదం అప్పటి భాష సంస్కృతంలో అనువాదం చేయబడింది. ప్రఖ్యాత ముస్లిం యాత్రికుడు, చరిత్రకారుడు మసూది క్రీ.శ. 10వ శతాబ్దిలో భారత్ సందర్శించి ఇలా వ్రాస్తారు : "ఖాంబే రాజు మత ధర్మ విషయాల్ని తెలుసుకోవడానికి అమిత ఆసక్తి కలిగి ఉన్నాడు. ఆయన తన రాజ్యంలోకి వచ్చిన ముస్లింలతో ఇస్లాం మత విషయాల్ని గురించి చర్చిస్తూ ఉంటాడు."

"ఆ రాజ్యంలో ముస్లింలను గౌరవించడమే కాదు, వారి భద్రత కోసం తగు జాగ్రత్తలు తీసుకోబడ్డాయి. అక్కడ అందమైన మస్జిద్‌లు కూడ ఉన్నాయి. వాటిలో ముస్లింలు స్వేచ్ఛగా నమాజ్ చేసుకుంటారు. ఈ రాజ్యంలో ఇస్లాం అన్ని విధాల సురక్షితంగా ఉంది." అసలు విషయం ఏమంటే హిందూ రాజులు, హిందూ ప్రజానీకం చూపిన సామరస్యం వల్లే ఈ దేశంలో ఇస్లాం ప్రగతికి మార్గం సుగమమైంది. భారత్‌లో ముస్లిం ప్రభుత్వాల స్థాపన తర్వాత ముస్లింలు కూడా హిందూ సోదరుల పట్ల ప్రదర్శించిన సామరస్యంలో రవ్వంత లోపం రానీయలేదు. భారత ముస్లిం ప్రభుత్వాల చరిత్ర చాటుతున్న వాస్తవం ఏమంటే, సామరస్యం విషయంలో హిందూ సోదరుల కంటే ముస్లింలు వెనకబడి లేరు.

భారత్‌లో ముస్లింల మొదటి ప్రభుత్వం ముహమ్మద్ బిన్ ఖాసిం సింధ్‌లో స్థాపించాడు. ఆ ప్రభుత్వం చాలాకాలం నిలువలేకపోయింది. ముహమ్మద్ బిన్ ఖాసిం ప్రభుత్వం, పాలన రంగం, శాంతి భద్రతల సంరక్షణా బాధ్యతల్ని దాదాపు హిందూ సోదరులే నిర్వహించేవారని స్వయంగా హిందూ చరిత్రకారులే అంగీకరించారు. ముహమ్మద్ బిన్ ఖాసిం హిందూ సోదరుల మత స్వేచ్ఛ గురించి వివరించాల్సిందని ఇరాఖ్ గవర్నర్ హజ్జాజ్ బిన్ యూసుఫ్‌ను కోరగా అందుకు ఆయన ఓ ఆజ్ఞాపత్రాన్ని జారీ చేశాడు. అందులో ఇలా ఉంది : "హిందూ సోదరులు వారి దేవతల్ని పూజించుకోవడానికి అనుమతి, పరిపూర్ణ మత స్వేచ్ఛ ఇవ్వబడుతుంది. ఏ వ్యక్తి అయినా వారి మత విశ్వాసాల ప్రకారం చేసే ఆరాధనల్ని అడ్డుకోరాదు. వారు తమ ఇళ్ళల్లో స్వేచ్ఛగా తిరుగుతూ తమ సమాజ కట్టుబాట్లు, పద్ధతుల ప్రకారం మనుగడ సాగించడంలో సర్వస్వతంత్రులు."

సింధూలో స్థాపించబడిన ఆ మొట్టమొదటి ఇస్లామీయ ప్రభుత్వం గురించి జర్మన్ చరిత్రకారుడు వాన్ క్రీమర్ ప్రకటన ఇలా ఉంది : "హిందూ పరిపాలన కాలంలో బ్రాహ్మణులకు ఉన్న గౌరవస్థానాలు, ప్రత్యేకతల్ని ముహమ్మద్ బిన్ ఖాసిం ప్రభుత్వం అలాగే కొనసాగించింది. అందువల్ల సామగ్రి రవాణాలో, ఆలయాల కోసం బ్రాహ్మణులకు చెల్లించబడే మూడు శాతం భాగం ఇస్లామీయ ప్రభుత్వం అలాగే చెల్లిస్తూ వచ్చింది. మందిరాల నిర్మాణానికి హిందువులకు అనుమతి ఉంది. యుద్ధ సమయంలో దెబ్బతిని నష్టపోయిన మందిరాల మరమ్మత్తుల ఖర్చుల్ని ఇస్లామీయ ప్రభుత్వ ఖజాన భరించింది. హిందువులు, ముస్లింలు కలసి మెలసి మనుగడ సాగించారు. అభివృద్ధి, ప్రగతుల అన్ని అవకాశాలు హిందువులు కలిగి ఉన్నారు."

అరబ్ యాత్రికుడు అల్ ఇస్తెఖారి 10వ శతాబ్దిలో భారత్ సందర్శించాడు. ఆ సమయంలో సింధూలోని ఇస్లామీయ ప్రభుత్వం తప్ప ఇంకో ముస్లిం ప్రభుత్వం లేదు. యావత్ దేశాన్ని హిందూ రాజులే పాలిస్తున్నారు. వారి అధికారమున్న భారత్ పశ్చిమ తీర నగరాల్లోకి ముస్లిం వ్యాపారులు వస్తూ ఉండేవారు. వారిలో చాలామంది అక్కడే స్థిరపడ్డారు. ముస్లింలు నివాసమున్న ప్రాంతాల్లో ఆ యాత్రికుడు పర్యటించాడు.

ఆయన వ్రాశాడు, “హిందూ, ముస్లింల సామాజిక సంబంధాలు సుహృద్భావంతో విలసిల్లుతున్నాయి. వారి ఆచార సంప్రదాయాలు, పద్ధతులు సమాజంలో సమానంగా పయనిస్తూ పోతున్నాయి. హిందూ రాజులు ముస్లింలకు అన్ని సౌకర్యాలు సమకూర్చుతున్నారు.”

ముస్లింలు భారత్ వచ్చాక భారత్ సమాజ, నాగరికత జీవన స్రవంతిలో సమ్మిళితమై పోవటానికి సర్వవిధాలా ప్రయత్నించారు. అసలు విషయం ఏమంటే ఇస్లామీయ ప్రభుత్వాలు ఏర్పడకముందు హిందూ పాలనా కాలంలో ముస్లింలను ఎంతగానో గౌరవించేవారు, ఆదరించేవారు. తర్వాత ముస్లింల పాలనా కాలంలో హిందూ సోదరుల మత భావాలను సాదరంగ గౌరవించారు, ఆదరించారు. అలా ఈ దేశ ప్రజానీకం ఒకే భారత జాతి వ్యక్తులుగా ప్రేమానురాగాల్ని పంచుకుని మనుగడ సాగించారు. మళ్ళీ ఆ యుగం పునరుజ్జీవం పొంది ఈ దేశానికి తిరిగి రాగలిగితే ఎంత బావుంటుందో!

# భారత్‌లో ఇస్లాం విరాజిల్లిన వేళ

*(ప్రొఫెసర్ జె.సి. ఛటర్జీ ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఆచార్య పదవిని నిర్వహించారు. ఆయన లాహోరులో జరిగిన అంజుమన్ హిమాయతుల్ ఇస్లాం చరిత్రాత్మక సమావేశంలో "భారత్‌లో ఇస్లాం" అన్న అంశం మీద ఓ ఆంగ్ల వ్యాసాన్ని చదివారు. దాన్ని ఖాజీ ఇష్తియాఖ్ హుసైన్ ఖురైషీ, ఎం.ఎ., ప్రొఫెసర్ స్టెఫిన్‌సన్, ఢిల్లీ కాలేజి అనువదించారు. అది మాసపత్రిక "అల్ ఈమాన్" (ఢిల్లీ)లో ప్రచురితమైంది. దానిలోని కొన్ని భాగాల్ని ఇక్కడ పొందుపరుస్తున్నాం.)*

"ఇస్లాం ప్రారంభం, విస్తరణ కేవలం భారత్‌లోనే కాదు, యావత్ ప్రపంచ మానవ చరిత్రలోనే మహాద్భుతమైన విచిత్రం. అది ఎంతటి మహాద్భుతమైనదో వివరిస్తూ ఐరోపా మేధావి ప్రొఫెసర్ విన్‌సెంట్ స్మిత్ ఆ అంశంమీద ఓ వ్యాసాన్ని కూడా వ్రాశారు. ఆయన అభిప్రాయం ప్రకారం, "హజ్రత్ ముహమ్మద్ (సఅసం) బోధించిన మత ధర్మం అత్యంత వేగంగా వ్యాపించడమే కాకుండ ఓ వింతవేగంతో దాని అనుయాయులు ప్రభుత్వ ఉన్నత పదవుల్ని అలంకరించడం అంటే అది మహాద్భుత సంఘటనయే కాదు, అది పరమాద్భుత మహిమ. మేధలను స్తంభింపచేసే ఆ పరమాద్భుత సంఘటనల్ని కేవలం అవేవో మామూలు పరిస్థితులుగా ప్రకటిస్తూ ఉంటే హృదయం తృప్తి చెందదు. అలాంటి వింతగొలిపే సంఘటనలు, కారణాలు ఏమిటో ఇప్పటి వరకు కనుగొనజాలని సంఘటనలు చరిత్రలో తక్కువేమీ లేవు. భూత, వర్తమాన కాలంలోని చాలా విషయాలు మానవ మేధకు అందనివి ఉన్నాయని మనం అంగీకరించాల్సి ఉంది."

చాలా విషయాలు మానవ మేధకు అందనివి ఉన్నాయన్నది వాస్తవం. ఇస్లాం ప్రారంభం, దాని విస్తృతి పరమాద్భుతమైన సంఘటన అన్నది కూడా వాస్తవమే.

ఆత్మజ్ఞాన దృష్టితో చూస్తే మాత్రం ఆ వాస్తవాన్ని గ్రహించడం ఏమంత కష్టం కాదు. ఎందుకంటే ప్రతీ అంశంలాగే చరిత్రను కూడా రెండు దృక్కోణాల్లోంచి అధ్యయనం చేయడం జరుగుతూ ఉంది. ఒకటి : భౌతిక దృష్టికోణం. ఇస్లాం అవతరణ, దాని విస్తరణలకు భౌతిక దృష్టికోణం ద్వారా కారణాలు వెల్లడిస్తే అవి ఎల్లప్పుడూ అసంతృప్తికరంగానే ఉంటాయి. కానీ ఆధ్యాత్మిక దృక్కోణంతో కారణాలు పరిశీలిస్తే అవి అతి సులభంగా అవగాహనకు అందుతాయి.

భారత్‌లో ఇస్లాం అన్న అంశం మీద సంభాషించటానికి ముందు ఇస్లాంకు పూర్వం అరేబియా దాని ఇరుగుపొరుగు దేశాల పరిస్థితి ఎలా ఉండేదో క్లుప్తంగా వివరించడం అవసరం. ఆ పరిస్థితులు మీకు కూడా తెలుసు. అరబ్బులు అసంఖ్యాక విగ్రహాల్ని ఎలా పూజించేవారో మీకు తెలుసు. యూదులు కూడా "ఈల్" లేక "ఎలూమియమ్"ను పూజించేవారు. దాని అనువాదం, "దేవుడు" బహువచనంలో దేవుళ్ళు రెండు ఉన్నాయి. అప్పటి నైతిక పరిస్థితుల పతనావస్థ కూడా మీకు తెలుసు. ఆధ్యాత్మిక రంగంలో అంతగా పతనావస్థకు దిగజారిపోయింది కేవలం అరబ్ జాతియే కాదు, తూర్పున అరేబియా పొరుగు దేశమైన ఈరాన్, పశ్చిమాన, ఉత్తరాన రోమన్ సామ్రాజ్యం ఉంది. ఆధ్యాత్మిక నైతిక రంగాల్లో ఈ రెండు దేశాల ప్రజల పరిస్థితులు కూడా పతనావస్థలోనే ఉన్నాయి. జోరాష్ట్ర విధానాన్ని నమ్మిన ఈరాన్‌లో ఇద్దరు దేవుళ్ళ విశ్వాసం ఉండింది. అంటే ఒక దేవునికి విరుద్ధంగా ఇంకో దేవుడు. ఒకరు చెడులకు స్రష్ట. ఇంకొకరు శుభాలకు సృష్టికర్త. క్రైస్తవుల విశ్వాసం ప్రకారం ముగ్గురు దేవుళ్ళు పూజించబడేవారు. రోమన్లు చాలావరకు క్రైస్తవులే. అలాగే యూదుల్లో కూడా అసలు ధర్మం విస్మరించబడి పతనావస్థకు చేరింది. ఇది ఆనాటి ప్రపంచ పరిస్థితి. అంతటి గాఢాంధకార యుగంలో మహా గౌరవనీయులు, ఉన్నతులైన ముహమ్మద్ ప్రవక్త (సఅసం) అత్యంత నిరాడంబర జీవితం గడిపేవారు. ఒక్క ఏకేశ్వరవాదం తప్ప సర్వ దైవత్వాన్ని ఖండించివేసిన మహా విప్లవ నాయకుడాయన. "మంచి" మానవరూపం దాల్చి అన్ని చెడులను అంతమొందించడానికి అవతరించి, ఆ అంధకారయుగంలో దివ్యకాంతితో మెరుపులా నిల్చాడాయన. ఏకాగ్రచిత్తుడై ఏకేశ్వరారాధనలోనే జీవితమంతా నిరాడంబరంగా గడిపిన ప్రేమమూర్తి. ఆయన అనుచరులు కూడా ఆయననే అనుసరించారు. దైవభక్తి పరాయణులైన ఆయన ఖలీఫాలు సువిశాల సామ్రాజ్యంలో అత్యున్నత పదవుల్ని అలంకరించినా అతి సామాన్య

జీవితం గడిపారు. ఆధ్యాత్మిక చింతన దేవుని పట్ల గల వారి అపూర్వారాధన, ప్రేమానురాగం కారణంగా సహజంగానే వారి ఆలోచనలు, అభిప్రాయాలు ఈరాన్, రోమ్ దేశాల్లో మూలమూలలా వ్యాపించి పోయాయి.

కానీ భారత్ ప్రస్తావన రాగానే క్రీ. శ. 8వ శతాబ్దిలో అరబ్బులు సింధూ ప్రాంతాన్ని జయించడానికి గల కారణం ఏమై ఉంటుంది? ఆనాడు భారత్ పరిస్థితులు ఎలా ఉండేవి? అన్న ప్రశ్నలు ఉదయిస్తాయి. ఇక్కడ ఏకేశ్వరవాదం ఎన్నో యుగాలకు పూర్వమే ప్రకటితమయి ఉంది. వేదాలు, ఉపనిషత్తుల్ని అధ్యయనం చేయండి. ఇక్కడ చరిత్రకు పూర్వమే ఏకేశ్వరవాదం ప్రకటించబడిందని మీకు తెలుస్తుంది. పశ్చిమ మత ధర్మాల్లోని దైవదూతల భావమే ఇక్కడ దేవతల్ని పూజించడానికి కారణభూతమైంది. అలా నిరక్షరాస్యులు, అల్ప వర్గాల జాతుల్లో దేవీలను సర్వశక్తి సంపన్నులుగా ఆరాధించడం జరుగుతూ వచ్చింది.

కాని ఇస్లాం అన్ని రకాల దేవీదేవతల ఆరాధనల్ని ఖండించివేసింది. అది కేవలం ఏకేశ్వరారాధన వాది (వ్యాసకర్త).

అయితే భారత్‌లో ఇస్లాం ప్రవేశం ఏ దేవుని ప్రసన్నతకోసం అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ముందు ఆ కాలంలో భారత్ పరిస్థితులు ఎలా ఉన్నాయో అధ్యయనం చేయడం అత్యంత అవసరం.

ఇస్లాం 8వ శతాబ్ది ప్రారంభంలో అంటే క్రీ.శ. 712లో భారత్‌లో ప్రవేశించింది. అప్పటికి హర్ష చక్రవర్తి మరణించి ఎక్కువకాలం కాలేదు. ఆ కాలం గురించిన వాస్తవాలను చైనా యాత్రికుడు హ్యూన్‌త్సాంగ్ సాక్ష్యం మన వద్ద ఉంది. ఆ యాత్రికుడు ప్రకటించిన అప్పటి పరిస్థితుల్ని ఇతరత్రా వివరణలు కూడా సమర్థిస్తున్నాయి. ఆ పరిస్థితుల ద్వారా తెలుస్తున్నదేమంటే, భారత్ ఒకే దేవుణ్ణి ఆరాధిస్తూ ఉండింది. ఎందుకంటే ఇక్కడ చాలా యుగాలకు పూర్వమే ఏకేశ్వరవాదన ప్రకటితమై ఉంది. భారత్ వాసులకు ఉన్నతమైన ఆత్మజ్ఞాన శిక్షణలు బోధించబడినప్పటికీ భారత్‌లోని ఆరాధనా మందిరాలన్ని మాంత్రిక మఠాలుగా మారిపోయాయి.

తర్వాత ప్రొఫెసర్ జె.సి. ఛటర్జీ మాంత్రిక వ్యవస్థ ఓ వాస్తవమైనదిగా నిరూపించడానికి ప్రయత్నించారు. ఆ పరంపరలో ఆయన ఫ్రెంచి విద్వాంసుడు అద్‌సీని గ్రంథాన్ని ప్రస్తావిస్తూ దాని అధ్యయనం వల్ల తెలుస్తున్నదేమంటే ఇప్పుడు

కూడ మాంత్రిక విద్యను ప్రదర్శించడం సాధ్యమని అన్నారు. తర్వాత ఆయన ఇలా వ్రాస్తారు : "మాంత్రిక విద్య గురించి నేను ప్రస్తావించాను. ఈనాడు టిబెట్‌లో లామాల విశ్రాంతి గృహాలు ఉన్నట్లుగానే ఆ కాలంలో దేశంలో బౌద్ధ మఠాలు అధిక సంఖ్యలో ఉండేవి. ఆనాడు ఆ మఠాలు అధికంగా ఈ మాంత్రిక విద్యా కేంద్రాలుగా విలసిల్లాయి. ఈ విషయంలో నాకు కొంచెం అనుభవం ఉంది. నేను పశ్చిమ టిబెట్‌లో పర్యటించిన సమయాన కొందరు మాంత్రికులను కలుసుకోవడం జరిగింది. వారిలో కొందరు మంచివారు. మరికొందరు తమ ప్రతిభలను చెడు ఆశయాలకోసం ప్రయోగిస్తుండేవారు. అసలు చెప్పొచ్చేదేమంటే క్రీ. శ. 8వ శతాబ్దిలోని మఠాలు మాంత్రిక కేంద్రాలుగా మారిపోయాయి. అంతేకాదు, ఆ మఠాల్లో నివసించే బైరాగులు, సాధువులు, భిక్షువులు కామకేళీ కలాపాల్లో పశువుల కంటే హీనంగా ప్రవర్తించేవారు.

భారత్‌లో ముస్లింల ప్రవేశానికి అర్ధ శతాబ్దానికి పూర్వం సింధూను సందర్శించాడు హ్యూన్‌త్సాంగ్. ఆయన అక్కడి మఠాల్లో 10వేల భిక్షువుల్ని చూశాడు. వారు చెడుకార్యాల్లో, కామకలాపాల్లో మునిగి ఉన్నారు. అంతేకాదు, వారు బౌద్ధ మతంలో అత్యంత జుగుప్సాకరమైన దుష్ప్రవర్తనలకు శ్రీకారం చుట్టి బుద్ధుడు బోధించిన ఆత్మ జ్ఞానానికిగల అన్ని విలువల్ని తిరస్కరిస్తూ వచ్చారు. నేను పాళీ భాషలోని బౌద్ధ గ్రంథాన్ని అధ్యయనం చేశాను. అందులో భౌతిక వాదం గల ఏ ఒక్క విషయం కూడా నాకు కానరాలేదు. దీనివల్ల బౌద్ధమతాచారులు తర్వాత ఆ విధానాన్ని స్వయంగా సృష్టించుకున్నారని తెలుస్తూ ఉంది.

ఇక బ్రాహ్మణ అనుచరుల విషయానికి వస్తే వారిలో కూడా నైతిక చెడులు ప్రబలి ఉండేవి. వారిలో అహంభావం, ఈర్ష్య, కుల మత వైషమ్యాలు, అసూయ అమితంగా ఉండింది. మీరు నమ్మజాలరు కానీ వారిలో ఉన్న కులం, జాతి భేదాల సూత్రాల వల్ల ప్రజలు పడరాని బాధలు సహిస్తూ పోయారు. ప్రభుత్వాధినేతలైన రాజుల్లో పరస్పర విభేదాలు, శత్రుత్వం, అంతర్ యుద్ధాలు తప్ప ఏ ఒక్క సుగుణం కానరాదు. సింధూ వాసుల్ని అధికారవర్గం ఎలా హింసించేదో ఇంకో సందర్భంలో ప్రస్తావిస్తాను. ఇప్పుడు సింధూ నది లోయలో వ్యాపించి ఉన్న ప్రాంతమంతా అప్పుడు సుఖ శాంతులతో విలసిల్లిందని మీరు జ్ఞప్తియందుంచుకోవాలి.

లీన్‌పోల్ "మిడివల్ ఇండియా"లో ఇలా వ్రాశారు :

"సింధూలోని హిందూ అధినేతలు వారిని అంటే తమ ప్రజల్ని ఎంత దారుణంగా హింసించేవారంటే దండయాత్రలు జరిపే జాట్లు, ఇతర జాతులను ఆ బాధితులు సమర్థించాల్సి వచ్చింది. అలా ఇతర జాతుల విజయాలు భారత్ వాసుల పరస్పర సంఘర్షణలు, పోరాటాలు, జాతి మత వైషమ్యాల కారణంగా చాలా సులభతరమయిపోయాయి".

ఆ కాలానికి పూర్వం భారత్‌లో పెద్ద పెద్ద రాజ్యాలు ఉండేవని మనకు బాగా తెలుసు. మహాభారత్ కాలం చాలా పురాతనమైనది. అశోకుని సామ్రాజ్యం యావత్ భారత్‌లో వ్యాపించి ఉండేది. కాబూలు నుండి గోదావరి వరకు దాని సరిహద్దులు వ్యాపించి ఉండేవి. గుప్త వంశం ప్రభుత్వ కాలంలో కూడా భారత్ సువిశాలంగా ఉండింది. హర్ష మహా రాజు ప్రభుత్వం కూడా చాలా శక్తిమంతంగా ఉండింది. అతని తర్వాత ప్రభుత్వ నేతల్లో ఏర్పడిన విభేదాల కారణంగా ప్రతీ చోటా ఘర్షణలు, పోరాటాల కాలం ప్రారంభమైంది. పరస్పర సంఘర్షణల గురించి అల్ బేరూని గ్రంథంలోని ఓ ఆసక్తికరమైన భాగాన్ని మీ ముందు ఉంచగలను, కానీ ఆ గ్రంథం నాకు లభ్యం కాలేదు. దాని ద్వారా బ్రాహ్మణులు, వారి అనుచరుల్లో ఎంత సంకుచిత్వం, ఎంత ఈర్ష్య ఉండేదో తెలుస్తుంది. వారి వర్గం నుండి ఏ వ్యక్తి దూరమైనా అతణ్ణి అపవిత్రునిగా భావించేవారు. అతని పట్ల అస్పృశ్యునిలా ప్రవర్తించేవారు. కానీ అంతకు పూర్వం భారత్‌లో అలాంటి ఆచారం కానరాదు. క్రీ.శ. ప్రారంభంలో గ్రీక్ (యవన) దేశస్థుడైన పాలోనీస్ భారత్ వచ్చాడు.

అతడు గ్రీక్ అవడం వల్ల యవనుడు లేక మ్లేచ్ఛుడు. పూర్వకాలంలో హిందువులు విదేశీయులను ఆ పేరుతో పిలిచేవారు. అయినా తక్షశిల పురాతన హిందూ నగరంలో ఓ మందిరంలో అతనికి విడిది ఏర్పాటు చేశారు. ఆ కాలంలోని హిందువులు విశాల హృదయులు. వారు ప్రతీ హిందూవేతరుణ్ణి అస్పృశ్యునిగా భావించేవారు కాదు. ఆ కాలంలో హిందువులు, హిందువేతరుల మధ్య వివాహ బంధాలు ఏర్పరచుకునే సంప్రదాయం ఉండేది. ఉదాహరణకు సెల్యూకస్ నికేటర్ (భారత్‌లో అలెగ్జాండర్ ప్రతినిధి) కూతుర్ని చంద్రగుప్తుడు వివాహమాడాడు. ఆమె గ్రీకు దేశస్థురాలు. భారత్‌లో విశాల హృదయం ఉన్నంత వరకు ఇతరుల పట్ల సుహృద్భావం, సామరస్యం విలసిల్లింది.

అలా భారత్ ప్రగతి పథంలో పయనించింది. కానీ తరువాత కాలంలో బయటి వారిని నీచులుగా, అంటరానివారుగా భావించడం వల్ల దాని పతనం ప్రారంభమైంది. పతనం ప్రారంభమయ్యాక పరిస్థితి అన్ని రకాలుగా దోషభూయిష్టమైపోయింది. ఆ దోషాల్ని తొలగించడం అత్యవసరం. కానీ అదెలా సాధ్యం? ఇలాంటి వారినుండి లోకాన్ని విముక్తం చేయడానికి ఎల్లప్పుడూ మూడు మార్గాలు అనుసరించబడ్డాయి.

ఆ దోషాల నిర్మూలనకు మూడు మార్గాలు దైవికంగా అనుగ్రహించబడతాయి. వానిలో మూడవ మార్గం గురించి ఆయన ఇలా వ్రాస్తారు : "మూడవది ఏమంటే, ధర్మం అనే ముసుగు నుండి మేధను తప్పించి దాన్ని ఓ పెద్ద కేంద్రబిందువు చుట్టూ నడిపించాలి. అంటే ఈ విశ్వాసానికి మూలాధారం, యజమాని అయిన ఏకేశ్వరుణ్ణి విశ్వసించడానికి వత్తిడి తేవాలి. ఇస్లాం అనుసరించిన మార్గం ఖచ్చితంగా అదే. అందువల్లే ఆత్మ జ్ఞానం, నైతికంగా పతన మొందిన సింధూ ప్రాంతంలో మొట్టమొదట ఇస్లాం వ్యాపించింది. ఈ సందర్భంలో చర్చనీయాంశం ఏమంటే అరబ్ విజేత తన మార్గానికి అడ్డువచ్చిన అన్ని మందిరాల్ని నేలమట్టం చేసివేశాడా? గృహాల్ని కూల్చివేశాడా? పట్టణాల్ని అకారణంగా దహనం చేసివేశాడా? లేదు. లేదు. సింధూ విషయంలో అరబ్ విజేత ప్రదర్శించిన ప్రవర్తనా సరళిని అధ్యయనం చేయండి. యుద్ధ సమయాల్లో అత్యవసరంగా కొన్ని పొరపాట్లు, నష్టాలు సంభవిస్తాయి. అందులో రవ్వంత సంశయం లేదు. కానీ సింధూలో అలాంటి అకృత్యాలు సంభవించలేదు. పైగా అరబ్ విజేత మందిరాల మీద వ్రేలు కూడా పెట్టరాదని, బ్రాహ్మణులు, ఇతర హిందువులకు ప్రభుత్వ ఉన్నత పదవుల్ని కట్టపెట్టాలని చాలా కఠినమైన ఆజ్ఞల్ని జారీ చేశాడు. ఫలితంగా హిందూ, ముస్లిం సోదరుల్లో చక్కని సంబంధాలు ఏర్పడ్డాయి. నేను మీకు ఇంకో వివరణ కూడా వినిపిస్తాను. దానివల్ల నేను ప్రకటించిన అభిప్రాయాలు వాస్తవమని మీరు విశ్వసిస్తారు. వీన్‌పోల్ ఇలా వ్రాశారు :

"ముల్తాన్‌లో స్థాపించబడిన ముస్లింల ప్రభుత్వం సామరస్యపూర్వకమైనది, సమతుల్యం గలది. నగరవాసులు, గ్రామీణులు పన్నులు వసూలు చేసే అధికారులను తామే స్వయంగా ఎంపిక చేసుకునేవారు. బ్రాహ్మణులు సంరక్షించబడుతూ ఉండేవారు. వారికి పెద్ద పెద్ద పదవులు ఇవ్వబడేవి. విజేత తన అధికారులకు ఇచ్చిన ఆజ్ఞలు అనురాగపూరితమైనవి. సముచితమైనవి. ప్రభుత్వం ఆజ్ఞ ఏమంటే ప్రజలు,

ప్రభుత్వాధికార్ల మధ్య న్యాయం, సఖ్యత, పరస్పర విశ్వాసం ఉండి తీరాలి. అన్ని విషయాల్లో వారందరు సమానులు. చెల్లించగలిగినంత పన్నులే విధించబడాలి. పరస్పరం కలసిమెలసి పనులు చేసుకోవాలి. పోరాడుకోరాదు. దానివల్ల దేశ ప్రజలకు నష్టం, బాధ కల్గుతుంది.”

చివరి వాక్యాన్ని చదవండి, బాగా ఆలోచించండి. అరబ్ విజేత తన జాతి, తన అధికారులను ఐకమత్యంగా ఉండి తీరాలని, పరస్పరం సంఘర్షించుకోరాదని, ప్రజలకు బాధ కల్గించకూడదని ఆజ్ఞాపిస్తున్నాడు. అధిక సంఖ్యాకులైన హిందూ ప్రజానీకం నశించి పోకూడదన్న ఆలోచనే ప్రభుత్వాధినేతను పట్టి పీడిస్తున్నది. ఇక్కడ సమ్మతం, అసమ్మతం అన్న భేదం లేకుండా గ్రుడ్డిగా విధ్వంసం, వినాశం చేయబడిందని మచ్చుకైనా ఉదాహరించబడరాదన్న యుక్తి, ఉపాయాన్ని ఆ విజేత అనుక్షణం పాటించాడు. మానవతా ప్రవర్తనా సరళిని అనుసరించాడు. దేశంలోని విశాల హృదయులు, ఉన్నత మేధా సంపన్నులు ప్రభుత్వాధినేతకు తమ సలహాలు, సహకారాలు అందించేవారు. ప్రజలు దాదాపు స్వయం నిర్ణయాధికారం కలిగి ఉండేవారు. ఎందుకంటే పన్నులు వసూలు చేసే అధికారులను ప్రజలే ఎంపిక చేసుకునేవారు. పన్నులు చెల్లించే శక్తి, సామర్థ్యాలు ఉన్న వారి వద్ద నుండే వసూలు చేయాల్సిందిగా వారికి ఆదేశాలు ఉండేవి. మీ ముందు నేను వెల్లడిస్తున్న అభిప్రాయాలు సాధారణంగా ప్రజలకు తెలుసు. కేవలం నేను ఓ క్రొత్త పంథాలో వాటి ప్రాధాన్యతను వ్యక్తం చేస్తున్నాను. ఇస్లాం విధ్వంస కాండను జరపడానికి ఇక్కడికి వచ్చిందన్న పాఠాలను చాలా పాఠశాలల్లో బోధిస్తున్నారు. దానితో నేను ఓ హిందువుగా ఏకీభవించను. ఇస్లాం కేవలం విధ్వంసమే గావించలేదని, నిర్మాణం కూడా చేసిందని నిరూపించడానికే నేను మీ ముందు హాజరయ్యాను. కానీ అది చేసిన నిర్మాణాత్మక కార్యాల్ని ఇంకో సందర్భంలో వ్యక్తం చేస్తాను. ఇస్లాం జరిపిన విధ్వంసంలో దైవ సంకల్పం ఉంది. ఎందుకంటే ప్రజలు హింసావాదులయ్యారు.

అంతేకాకుండా నేను చెప్పినట్లుగా భారత్‌లో ధర్మం అనేది పతనావస్థకు చేరి అదొక మాంత్రిక వ్యవస్థగా మారిపోయింది. చరిత్ర విద్యార్థుల దృష్టిని ఈ అంశం వైపు మరల్చడం బహుశా ఇది మొదటి అవకాశంగా భావిస్తున్నాను. వాస్తవానికి భారత్‌లోంచి మాంత్రిక విద్య అనే మౌఢ్యాచారాన్ని రూపుమాపడం ఇస్లాం ఆశయంగా ఉండిందని నా నమ్మకం.

కానీ మొదటి విజేత ఈ విషయంలో అంతగా పట్టించుకుని ప్రయత్నించలేదు. అంతకు ముందు పరిస్థితుల్ని ప్రకటిస్తూ లీన్‌పాల్ ఇలా వ్రాశారు :

"క్రొత్తగా వచ్చిన అరబ్బులు ముల్లాన్ (మైసూర్ దక్షిణ ప్రాంతంలో విజేత) కుమారుడు నిర్మించిన క్రొత్త నగరాల్లో పాలక వంశాలకు అంకురార్పణ చేశారు. క్రీ.శ. 10వ శతాబ్దిలో మసూది అనే యాత్రికుడు ఈ దేశంలో పర్యటిస్తున్న సమయాన ఇక్కడ మేవత్ వంశం అధికారంలో ఉంది. తర్వాత ఇబ్నె హైకల్ సింధూలో పర్యటించగా ఇక్కడ అరబ్బీ, సింధీ భాషలు చలామణిలో ఉండడం, ముస్లిం, హిందూ సోదరుల మధ్య సఖ్యత, సామరస్యం విలసిల్లడం చూశాడు."

ముఖ్యంగా ఓ విషయాన్ని జ్ఞప్తియందుంచుకోవాలి. ఇస్లాం మొదటిసారి క్రీ. శ. 8వ శతాబ్ది ప్రారంభంలో భారత్‌లో ప్రవేశించింది. గోర్ నివాసులు భారత్ జయించాక గజనీ నేతలు దేశం మీద దండయాత్ర జరిపారు. అప్పటికి 3 వందల సంవత్సరాలు గడిచిపోయాయి. ఇందులో రహస్యం ఏముంది? ఓ హిందువుగా నాకు ఇందులో దైవ సంకల్ప శక్తియే కానవస్తున్నది. మొదటిసారిగా ఇస్లాం ఈ దేశంలో విశాల హృదయం గల మిత్రునిగా, దైవ ప్రేరేపిత హెచ్చరికగా అవతరించింది. హిందువులు తమ అంతర్యుద్ధాలు, రక్తపాతం, దుర్వర్తన, అనైతికతను విడనాడాలని, తమ పూర్వపు వాస్తవ ధర్మం, ఆత్మజ్ఞాన జీవితం గడపాలని సందేశమిచ్చేవారుగా ఉండాలని కోరింది ఇస్లాం. కానీ హిందువులు ఈ సందేశం పట్ల శ్రద్ధాసక్తులు చూపలేదు. ఈ మూడు వందల సంవత్సరాలు అధినేతల మధ్య సామరస్యం, సఖ్యత నెలకొనలేదు. ఆత్మజ్ఞాన జీవిత విధానంలో ప్రగతి సాధించనూ లేదు. అప్పటికి భారత్‌లో గొప్ప గొప్ప నాయకులు, మతాచార్యులు ముస్లిం పాలన కాలంలోనే జన్మించారన్న విషయం మీకు తెలుసు. రామానందుడు, రామానుజుడు, చైతన్య, గురునానక్ మొదలగు మతాచార్యులు ఆ కాలంలోనే జన్మించారు. ముస్లింలకు పూర్వం, హిందువులకు మరల మత ధర్మ సందేశం ఇచ్చేవారు జన్మించనేలేదు. బహుశా శంకరాచార్యులు ఈ పతనావస్థ ప్రారంభం కాక పూర్వం సన్మార్గ ప్రబోధనం చేశారు. పాశ్చాత్య దృక్పథం గల ఆధునిక చరిత్రకారుల అభిప్రాయం ఏమంటే ఆయన క్రీ. శ. ప్రారంభకాలంలో అవసాన దశకు చేరుకున్న ప్రపంచానికి శిక్షణ

ఇస్తూ వచ్చారు. క్లుప్తంగా చెప్పేదేమంటే ఈ మూడు వందల సంవత్సరాల వరకు ఆ హెచ్చరిక కొనసాగుతూనే వచ్చింది. కానీ దాన్ని పట్టించుకునే నాధుడే లేకపోయాడు. భారతదేశం వినాశకరమైన మార్గం దిశలో గ్రుడ్డిగా పరుగులు తీస్తూ పోయింది. కాబట్టి ఆ పరుగులకు అడ్డుకట్టవేయడం, చేదు పాఠాలు నేర్పడం అవశ్యమైంది. మెదడుకు చికిత్స చేయడానికి నెత్తిమీద బలమైన సుత్తిపోట్లు వేయడం అత్యవసరమైంది. ఆ సుత్తిపోట్లు గజనీ, గోర్ దండయాత్రలే. అవి తప్ప భారత్‌ను జాగృతం చేయడానికి ఇంకో మార్గమే లేకపోయింది. హిందూ మందిరాల విధ్వంసానికి మాంత్రిక వ్యవస్థ ఎంతగా కారణభూతమైందో దైవ సంకల్పిత ప్రేరేపితుడైన మహ్మూద్ కూడా అంతే కారకుడయ్యాడని నా విశ్వాసం. బహుశా అతనికి ఈ విషయం తెలుసో లేక తెలియదో కానీ అతణ్ణి భారత్‌లోకి పంపించింది దేవుడే అన్నది వాస్తవం. అందులో రవ్వంత సంశయం ఉండబోదు.

ప్రతీ చర్య వెనుక దేవుని హస్తం ఉంటుందని హిందువుగా నా నమ్మకం. లోకంలో దైవ సంకల్పం, నిశ్చయం లేకుండా ఏ పనీ, ఏ సంఘటనా సంభవించబోదని, ఆయన తీర్పు, అభీష్టం లేకుండా ఏదీ జరగబోదని  నా నమ్మకం.

ఒకవేళ మీకు దేవుడే ఉన్నాడని, సర్వ కార్యాలు ఆయన అభీష్టం ప్రకారం జరుగుతాయన్న నమ్మకం ఉంటే మాత్రం ఈ మందిరాలు వాస్తవానికి పవిత్రమైనవిగా ఉంటే ఆయన ఈ విధ్వంసాన్ని ఎందుకు సాగనిచ్చినట్లు? అందుకే మూడు వందల సంవత్సరాల హెచ్చరిక తర్వాతనే అవి వినాశనం గావించబడ్డాయి. అధికార రూపంలో ఇస్లాం భారత్‌లో ప్రవేశించాక దేశమంతా మరోసారి సమైక్యమైంది. మాంత్రిక విద్య సాగిన కేంద్రాలన్నీ పవిత్రం గావించబడ్డాయి. దేశ పరిస్థితి చక్కబడింది. చరిత్ర విద్యార్థులందరూ ఈ సంఘటనలు, వాస్తవాల్ని అంగీకరిస్తారని నా నమ్మకం.

# ముస్లింలు ఈ దేశానికి ఏం చేశారు?

ముస్లింలు భారతదేశానికి వచ్చిన కారణాలు ఏమైనప్పటికీ ఇప్పుడు మాత్రం వారు హిందువుల్లానే ఈ దేశ పౌరులు. ఈ దేశవాసులు హిందూ, ముస్లిం సోదరులు. శతాబ్దులుగా ఈ దేశంలో కలిసిమెలసి మనుగడ సాగిస్తూ వస్తున్నారు. వారి జీవితాలు, ప్రయోజనాలు, వారి ఆలోచనలు విడదీయజాలనంతగా పరస్పరం పెనవేసుకు పోయాయి. ఇది ఒక చారిత్రక వాస్తవం. ముస్లింలు కేవలం భారత్‌లో నివాసం ఏర్పరచుకున్నారే తప్ప వారు ఈ దేశానికి ఏమీ చేయలేదు అన్న అభిప్రాయం అనుచితమైనదే కాదు, అది చాలా పెద్ద పొరపాటు ఆలోచన కూడా. వాస్తవం ఏమంటే సాహిత్యం, నిర్మాణ కళా నైపుణ్యం, పరిపాలనా విధానంలో అసమానమైన సేవల్ని ముస్లింలు ఈ దేశానికి అందించారు. భారత దేశ నాగరికత, సంస్కృతులలో మనోరంజకంగా కానవస్తున్న రంగురంగుల హరివిల్లు వారి బుద్ధికుశలత ఫలితమే. భారత దేశానికి వారు తొడిగిన రత్న మాణిక్యాల స్వర్ణాంబరాలను తొలగించినట్లయితే దాని ఆకర్షణీయమైన, అనుపమానమైన సౌందర్యం మ్లానమయిపోతుంది. ఆ వాస్తవాన్ని ప్రతీ వ్యక్తి అంచనా వేయగలడు.

ఇలా చెప్పడానికి అఖండితమైన సాక్ష్యం కేవలం ఒక్క కుతుబ్‌మీనార్, ఒక్క తాజ్‌మహల్ చాలు. అది వారు సాధించిపెట్టిన మహోన్నతమైన ఘనకార్యం. ఈ కట్టడాలపై భారతదేశం నేడు కూడా గర్విస్తోంది.

భారత్‌లో ముస్లింల చరిత్ర చూస్తే హిందూ, ముస్లిం సుహృద్భావం, సమైక్యతలు కొట్టొచ్చినట్లు కనబడతాయి. అందుకు ప్రబల నిదర్శనం సుల్తానుల గొప్ప గొప్ప సేనాపతులు, దీవాన్లు, గొప్ప రాజనీతి దురంధరులైన మంత్రులు హిందువులే. ఆంగ్ల పరిపాలనా అంతిమ దశలో ఆ ప్రభుత్వం లార్డ్ సిన్హాను ఒక సూబాకు గవర్నర్‌గా

చేసినందుకు ఆ ప్రభుత్వ సామరస్యాన్ని శ్లాఘిస్తాం, కాని ముస్లింల పరిపాలనా కాలంలో అలాంటి ఎందరు సిన్హాలు, జస్వంత్‌సింగ్‌లు, జైసింగ్‌లు, మానసింగ్‌లు, తోడర్ మల్లులు ఆ పదవికంటే అత్యంత కీలకమైన, ఉన్నతమైన పదవులను అలంకరించారో ఆ వాస్తవాన్ని మనం విస్మరించాం.

భారత్ ముస్లిం పాదుషాల సామరస్యానికి, విశాల హృదయానికి తిరుగులేని నిదర్శనం ఏమంటే ఇంగ్లాండు మహారాణి మతపరమైన విభేదాల కారణంగా తన రాజ్యంలోని ఒక వర్గాన్ని సజీవ దహనకాండకు బలిచేస్తున్న కాలంలో అక్బర్ చక్రవర్తి భారత్‌లో సామరస్యానికి గల సాధారణ సూత్రాల్ని ప్రచారం చేశాడు. ముస్లిం విద్వాంసులు, హిందూ పండిత శ్రేణులు, యూదు, క్రైస్తవ మేధావుల్ని తన దర్బారులో సమావేశపరచి వారి వారి ధర్మాల్లోని మౌలిక సూత్రాలు, తత్వశాస్త్రాల నిగూఢ అంశాల మీద చర్చలు కొనసాగించాడు. ఔరంగజేబు హిందువుల పట్ల అసూయ, ఈర్ష్య, సంకుచిత భావం ప్రదర్శించాడని ఎన్నెన్నో అపనిందలు, ఆరోపణలు చేస్తూ చాలా గ్రంథాలు వ్రాయబడ్డాయి. అవమానకరమైన ఆక్షేపణలతో దుష్ప్రచారం చేయబడింది. అయితే సుప్రసిద్ధ చరిత్రకారుడు "ఎల్ఫిన్‌స్టన్" వ్రాసింది చదివితే వాస్తవాలపై పడివున్న తెరలు తొలగిపోతాయి. "ఔరంగజేబు పాలనా కాలంలో ఒక్క హిందువు కూడా మతం కారణంగా ధనం కాని, ప్రాణం కాని కోల్పోలేదు లేక జైలు శిక్ష అనుభవించనూ లేదు." పైగా ఔరంగజేబుకు జస్వంత్‌సింగ్, జైసింగ్ విశ్వాసపాత్రులు అయిన కార్యదర్శులు. షేర్షా పఠాన్ అయినప్పటికీ అతడు హిందువుల పట్ల ప్రదర్శించిన సామరస్యం, ప్రవర్తనా సరళి ఇప్పటికీ చరిత్ర పుటల్లో చెక్కుచెదరకుండా ఉంది. అతడు నెలకొల్పిన ప్రజా సంక్షేమ శాఖ అప్పుడే కాదు, ఇప్పుడు కూడా వేనోళ్ళ శ్లాఘించబడుతూ ఉంది. అతడు కూడలి స్థలాల్లో సత్రాలు, ప్రయాణీకులకు విశ్రాంతి శాలలు నిర్మింపజేశాడు. అందులో హిందువులకు హిందువులే వండిన వంటకాలు వడ్డించబడేవి. ఎందుకంటే ఎవ్వరికీ మతపరమైన భేదభావం, విచారం, దు:ఖం కలగకూడదన్న విశాల దృక్పథంతో ఆ ప్రత్యేక సదుపాయం సమకూర్చబడింది.

వేలాది సంవత్సరాలుగా నిరాఘాటంగా సాగుతూ వస్తున్న పూర్వపు సంప్రదాయమైన కులం, అంటరానితనం, హిందూ సమాజంలో పేరుకుపోయిన

అసూయ, ఈర్ష్యాద్వేషాలను నిర్మూలించి విశాల భావం జనింపజేయడంలో ఇస్లామీయ ప్రజాస్వామ్య భావన ఎంతగానో సహకరించింది. బెంగాల్‌లో ఆవిర్భవించిన "విష్ణు ఉద్యమం" విప్లవాత్మకమైన ఇస్లామీయ ప్రజాస్వామ్య విధానాల ప్రేరణ ఫలితమే. భారత ముస్లిం పాదుషాల కారణంగా ఇతర ముస్లిం దేశాలలో కూడా భారత్ సంబంధాలు అత్యంత స్నేహపూర్వకంగా నెలకొన్నాయి. అందువల్లే ఖలీఫా మన్సూర్ అబ్బాసి పాలనా కాలంలో భారత్ నుండి గొప్ప గొప్ప పండితులు బగ్దాద్‌కు ఆహ్వానించబడ్డారు. వారి సహకారంతో యజుర్వేదం మీద ఒక ఉత్తమ గ్రంథం ''చరక్'' రచించబడింది. అంతేకాదు ''సిద్ధాంతం''అనే గ్రంథం కూడా అనువదించబడింది. కఠిన హృదయుడు, విగ్రహభంజకుడు, నిర్దయుడు అని ఆక్షేపించబడిన మహ్మూద్ గజనవి దర్బారు అన్ని జాతుల, అన్ని మతాల విద్వాంసులు, కవులతో కళకళ లాడుతూ ఉండేదన్నది చారిత్రక వాస్తవం. అల్ బేరూని గజనవి మాతృభాషలాగే గ్రీకు, సంస్కృత భాషలో అనర్గళంగా మాట్లాడేవాడు. ఈయన భారతీయ తత్వశాస్త్రాలకు కేంద్రమైన బనారస్‌లో ఉండి హిందువులకు గ్రీకు శాస్త్రాలు, గణితం బోధించడంతోపాటు స్వయంగా తను కూడా భారతీయ శాస్త్రాలను నేర్చుకునేవాడు. మానవుణ్ణి మానవునిగా తీర్చిదిద్దడంలో ఇస్లాంకు అతిపెద్ద పాత్ర ఉందని నేను భావిస్తున్నాను. రాజకీయాలను కూడా ఇస్లాం ప్రగతి పథాన నడిపించింది. అసలు ఇస్లాం ప్రజాస్వామ్యమే వాస్తవమైన ప్రజాస్వామ్యం. అది జాతి, వర్ణం, ఆర్థిక అసమానతలవల్ల భ్రష్టుపట్టిపోయిన పాశ్చాత్య నకిలీ ప్రజాస్వామ్యం లాంటిది కాదు. హిందూ సమాజంలోని జాతి, మత, కుల వైషమ్యాల విష వలయంలో పడిపోయిన మేము భారీ నష్టంలో ఉన్నాము. మీరు ఒక హిందూ దేవాలయంలోకి వెళ్ళి చూడండి, అక్కడ విభిన్న స్థానాలుగల వర్గాల వారికి వేర్వేరు స్థానాలు కేటాయించబడి ఉంటాయి. దానికి భిన్నంగా ఒక మస్జిద్ మీనార్ నుండి ముఅజ్జిన్ అజాన్ పిలుపు వినబడగానే అమీరు, ఫకీరు, కూలీ, ధనికుడు, నిరుపేద అయిన ముస్లింలందరూ ఒకే స్థలంలో, ఒకే వరుసలో, భుజం భుజం కలిపి సమానంగా నిలబడి దేవుణ్ణి ప్రార్థిస్తారు.

ఇస్లాం మనిషికి, మనిషికి మధ్య అంతరాలు, విభేదాలు సృష్టించదు. అది కేవలం ఒక్క సర్వోన్నతుడైన ఏకేశ్వరుణ్ణి విశ్వసిస్తుంది. ఆ మౌలిక సిద్ధాంతం ప్రాతిపదికగా సర్వమానవ సమానతలు, హక్కులు, సమైక్యత, ప్రజాస్వామ్య విధానాల్ని

పరిరక్షిస్తుంది ఇస్లాం. భారత్‌లో దాని ఆగమనం కారణంగా దేశంలోని అంటరానితనం తీవ్రత చాలావరకు తగ్గిపోయింది.

క్లుప్తంగా చెప్పేదేమంటే, ముస్లింలు భారత్‌కు వచ్చినందువల్ల చాలా పెద్ద ప్రయోజనం ప్రాప్తించింది. వారి నాగరికత, భారత్ నాగరికతతో సమ్మిళితమై సుగంధాలు గుబాళించే రంగురంగుల పూలవనంలా, ఆకర్షణీయంగా మన దేశాన్ని తీర్చిదిద్దింది. ముస్లింలు మన దేశంలో అడుగుపెట్టక ముందు ఈ దేశం అనేక భాగాలుగా విభజించబడి ఉండేది. కానీ ముస్లింలు ఇక్కడకు వచ్చి జాతీయ సమైక్యతను ప్రసాదించి, ఒక పటిష్టమైన దేశానికి శంఖుస్థాపన చేశారు. అనేకమంది రాజులు, రాజ్వాడాల్లో విభజింపబడిన దేశాన్ని మహాశక్తిమంతమైన ఒకే దేశంగా నిర్మించిన వారు ముస్లింలే. వారు ఈ దేశాన్ని తమ మాతృభూమిగా భావించి ఇక్కడి వాసులకు సర్వజాతి, మత, వైషమ్యాలకు అతీతంగా ఉండి అకుంఠిత దీక్షతో తమ సేవల్ని అందించారు. అసలు నిజం ఏమంటే ఈ దేశ వాసులకు సెక్యులర్ విధానాన్ని బోధించిన వారు కూడా ముస్లింలే. మనం వారి జాతీయ, ఆచరణాత్మకమైన సేవల్ని విస్మరించడం అంటే ఆత్మవంచన చేసుకోవడమే అవుతుంది.

# చరిత్ర చెప్పే నిజాలు

మహాప్రవక్త (సఅసం) పవిత్ర జీవిత కాలంలో అరబ్బులు భారత్‌లోకి ప్రవేశించలేదు. కానీ ఆయన (సఅసం) దివంగతులయిన కొంతకాలానికి వారు భారత్‌లో ప్రవేశించారు. అంటే ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ కాలంలో వారు భారత్‌లో ప్రవేశించడం ప్రారంభమైంది. అప్పటికి ముహమ్మద్ బిన్ ఖాసిం భారత్ ఉత్తర పశ్చిమ భాగాన్ని జయించి సామరస్య పూర్వకమైన ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. ఆయన సింధులోని ముస్లిమేతర సోదరులను సగౌరవంగా ఆదరించి వారి హృదయాల్ని చూరగొన్నాడు.

ముహమ్మద్ బిన్ ఖాసిం తర్వాత సింధ్‌లోని ఆ ప్రభుత్వం బలహీనమయిపోయినా కూడా సింధ్‌లోని హిందూ ప్రజలు ఆ ప్రభుత్వాన్ని వేనోళ్ళా శ్లాఘించేవారు. ఆ ప్రభుత్వం పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించేవారు. ప్రఖ్యాత చరిత్రకారుడు "హౌఖల్" ప్రకారం "సింధ్‌లోని ముహమ్మద్ బిన్ ఖాసిం ప్రభుత్వం ఎంతగా ప్రభావం చూపింది అంటే ముల్తాన్ ప్రజలు అరబ్బీ, సింధ్ భాషలు మాట్లాడ్డం ప్రారంభించారు. ఇస్లాంలోని సాదాసీదా, పవిత్రమైన పద్ధతులు, వారి హృదయాలను జయించాయి. సింధ్ చరిత్ర మనకు స్పష్టం చేసేదేమంటే ముహమ్మద్ బిన్ ఖాసిం ప్రభుత్వం పట్ల సింధ్‌లోని హిందూ ప్రజలు ప్రభావితులయ్యారు. ఆయన హిందువులకు మత విషయాల్లో పూర్తి స్వేచ్ఛను ప్రసాదించారు. వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ముహమ్మద్ బిన్ ఖాసిం తర్వాత మహ్మూద్ గజనీ యుగం ప్రారంభమయింది. గజనీ రాజకీయ జీవితం, అతని దండయాత్రలను గురించి ఎక్కువగా ప్రస్తావించనక్కరలేదు. కానీ ఆ దండయాత్రల తర్వాత అతనికి హిందూ ప్రజల పట్ల అమిత సానుభూతి కలిగింది. బహీఖీ చరిత్ర అధ్యయనం వల్ల వెల్లడవుతున్న నిజాలు ఏమంటే సుల్తాన్ మహ్మూద్ దర్బారు హిందూ సిపాయీలు, జనరల్సు, ఉన్నతోద్యోగులతో నిండి ఉండేది. అతని

దర్బారులో హిందువుల సంఖ్య ఎంతగా పెరిగిపోయిందంటే గజనీకి కొందరు హిందుస్తానీ దుబాసీలను నియమించే అవసరం ఏర్పడింది. మహ్మూద్ గజనవి, అతని తర్వాత వచ్చిన వారి పాలనా కాలంలో హిందూ సోదరులతో అసాధారణమైన సంబంధాలు ఏర్పడ్డాయి. గజనవి కాలంలో హిందువులు పెద్ద పెద్ద పదవులు నిర్వహించారు. మహ్మూద్ గజనవి గతించిన 5 రోజుల తరువాత రాజు మస్ఊద్ జనరల్ సోంధ్‌రాయ్‌ను తన శత్రువులైన అమీర్లను అణచడానికి పంపించాడు. చాలా రోజుల వరకు జరిగిన ఆ యుద్ధంలో సోంధ్‌రాయ్, ఆయన అనుచరులు అత్యంత ధైర్యసాహసాలతో పోరాడారు. (ఇలియట్ 2వ భాగం పేజి 59). ఆ సంఘటన జరిగిన 5 సంవత్సరాల తరువాత తిలక్ బిన్ జైసేన్‌ను లాహోర్ తిరుగుబాటు గవర్నర్ అహ్మద్ లంగీన్‌ను అణచడానికి పంపించాడు. తిలక్ బిన్ జై సేన్ గజనవి ముఖ్యమైన వ్యక్తి. మేము అతని గురించి కొంచెం వివరిస్తాము. తిలక్ అసలు ఒక మంగలివాని కొడుకు. చాలా కాలం అతడు కశ్మీర్‌లో ఉండి మంత్ర, తంత్ర విద్యను అభ్యసించాడు. అతడు చాలా అందగాడు. బహు భాషా కోవిదుడు. మంత్రి అహ్మద్ హసన్ మైమండి అతణ్ణి తన కార్యాలయంలో పెట్టుకున్నాడు. చరిత్రకారుడు బహీఖీ ప్రకారం, “అతడు కాగితాలు పట్టుకుని ప్రధానమంత్రితో మంతనాలు జరపడం ...... ప్రత్యేక లక్షణాల వల్ల మొదట అతడు ఖాజా హసన్ బిన్ మైమందికి కార్యదర్శి అయ్యాడు. మహ్మూద్ గజనవి అతడు ఎన్నో గణనీయమైన సేవల్ని అందించాడు. అతడు చేసిన ప్రయత్నాల కారణంగా చాలామంది తిరుగుబాటుదార్లు లొంగిపోయారు.

సుల్తాన్ మహ్మూద్ కూడా అతణ్ణి బహుధా శ్లాఘించాడు. మస్ఊద్ అతణ్ణి అహ్మద్ లంగీన్‌ను అణచడానికి పంపించగా అతడు తన పలుకుబడిని ప్రయోగించి లాహోర్‌లోని తిరుగుబాటుదారులందరినీ తన వైపునకు త్రిప్పుకున్నాడు. వారిని వెంటబెట్టుకొని అహ్మద్ లంగీన్ మీద దాడిచేసి ఓడించాడు. తిరుగుబాటు సర్దార్, అతని కొడుకు తప్పించుకుని పారిపోయారు. కానీ తిలక్ పన్నిన వలలో వారు చిక్కుకుపోయారు. బహీఖీ ప్రకారం తిలక్, అహ్మద్ లంగీన్‌ను అంతమొందించి లాహోర్ తిరిగి వచ్చాడు. అక్కడ నెలకొని ఉన్న క్రమశిక్షణా రాహిత్యాన్ని రూపుమాపి పోలీసు, రెవెన్యూ చట్టాలను కొత్త పద్ధతిలో ప్రవేశపెట్టాడు. తర్వాత దేశ శాంతి

భద్రతల కోసం పూర్వం కంటే ఉచితమైన పద్ధతుల్ని చేపట్టాడు. (ఇలియట్ 2వ భాగం, పేజి 127).

గజనీల దర్బారులో అత్యున్నత పదవిని అలంకరించిన వ్యక్తి ఈ తిలక్ బిన్ జైసేన్. మహ్మూద్ దర్బారులో ఉన్న ఇంకో వ్యక్తి జనరల్ విజయ్‌రాయ్. ఆయనకు చాలా ప్రాధాన్యత ఉండేది. (ఇలియట్ 2వ భాగం, పేజి 59).

వాస్తవాల కారణంగా దాడులు, యుద్ధాల కాలంలో తప్ప గజనీల యుగంలో కూడా హిందువుల పట్ల ముస్లిం పాలన సామరస్యపూర్వకంగా ఉండేదని స్పష్టమవుతూ ఉంది. మత వైరుధ్యాలు అర్హతలను అణచేవి కావు. అర్హతలు, యోగ్యతలకు వారి దర్బారులో అత్యంత విలువ ఉండేది. ఒక వ్యక్తి యోగ్యుడయితే మత అసూయకు అతీతంగా అతడికి అవకాశం ఇచ్చేవారు. మందిరాల ధ్వంసం, విగ్రహాల ఖండన సంఘటనలు కేవలం యుద్ధాగ్ని ప్రజ్వరిల్లిన సమయంలోనే కానవచ్చేవి. రాజకీయ ప్రయోజనం అన్నింటినీ ఆక్రమించేది. గ్రామాల్లో నివసించే సామాన్య హిందూ ప్రజలు తమ పూర్వపు సంప్రదాయాలను పాటిస్తూ ప్రశాంతంగా జీవించేవారు. ముస్లింలకు పూర్వం కూడా రాజులు, గ్రామ ప్రజలకు మధ్య విధేయత తప్ప ఎలాంటి సంబంధాలు ఉండేవి కావు. అదే గజనీల కాలంలో కూడా ఉండేది. గజనీలకు లోబడిన యుద్ధ పిపాసగల హిందూ తెగలు తమ తమ వర్గ నాయకుల సారధ్యంలో గజనీ సైన్యంలో చేరిపోయాయి. వాస్తవం ఏమంటే భారత్‌లో ఏ ముస్లిం ప్రభుత్వ పాలనా కాలాన్నయినా నిశితంగా శోధించినట్లయితే సామరస్యం కనబడి తీరుతుంది.

# ఇస్లాం ఛాందస మతం కాదు

**- బి.ఎన్. పాండే**

స్వార్థపరులు అనాదిగా ఆనవాయితీగా రగిలిస్తున్న మత విద్వేషాల కార్చిచ్చు కారణంగా దేశంలో మనిషికి – మనిషి, మతానికి – మతానికి మధ్య అవగాహన, అభిమానం కొరవడి ప్రార్థనా స్థలాల ధ్వంసం వంటి ఉన్మాద చేష్టలు చోటుచేసుకున్నాయి.

ప్రముఖ పార్లమెంటేరియన్, సోషలిస్టు, గాంధేయవాది, చరిత్రకారుడు, పరిశోధకుడు, మాజీ గవర్నర్ బి.ఎన్. పాండే తన అమూల్య పరిశోధనల ద్వారా యథార్థాలను సేకరించి హిందూ ముస్లింల మధ్య గూడుకట్టుకున్న అనుమానాలు అపోహలను పటాపంచలు చేయడానికి కృషి చేస్తున్నారు.

ఎంతో ప్రాముఖ్యంగల ఆయన పరిశోధనలు వివిధ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. ఈ నేపథ్యంలో బి.ఎన్. పాండే ప్రఖ్యాత దినపత్రిక "టైమ్స్ ఆఫ్ ఇండియా"కు గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూను యధాతథంగా పాఠకులకు అందిస్తున్నాము.

*ప్రశ్న : ఇస్లాంలో ఛాందసం, మూఢత్వం రోజురోజుకు మితిమీరుతున్నట్లు విస్తృతంగా ప్రచారం కొనసాగుతోంది. ఈ విషయమై మీ అభిప్రాయం ఏమిటి?*

**జవాబు :** స్వభావ సిద్ధంగా, సైద్ధాంతికంగా ఇస్లామ్‌లో మూఢత్వం, ఛాందసం లేనేలేవు. ఖుర్ఆన్‌ను నేను చాలా లోతుగా ఆమూలాగ్రం అధ్యయనం చేశాను. ఖుర్ఆన్ సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, శాంతిని సమానత్వాన్ని ప్రేమను, ఏకేశ్వరోపాసనను బోధించింది. ఇవే విషయాలను ప్రచారం చేసేందుకు అన్ని భాషల్లో – అన్ని కాలాల్లో అన్ని చోట్లా ప్రవక్తలను, సందేశ ప్రచారానికి ఆవిర్భవింపజేసినట్లు ఖుర్ఆన్ స్పష్టం చేస్తోంది. దైవంచే పంపబడిన ప్రవక్తల మధ్య తారతమ్యం, భేదభావం చూపేవారిని ఖుర్ఆన్ కాఫిర్‌గా ప్రకటించింది. అలాంటి ఇస్లాం ఛాందస, మూఢభావాల

మతం ఎలా అవుతుంది? ఇస్లాం పట్ల కొనసాగుతున్న దుష్ప్రచారం పూర్తిగా అర్థరహితమని, ఆధారాలు లేనిదని నేను స్పష్టంగా చెప్పగలను. ముస్లిం ముల్లాలు ఏ విషయాలనైతే ఆచరించేందుకు ముస్లింలను ప్రోత్సహిస్తున్నారో వాటితో చాలా వాటిని ఇస్లాం సమర్థించడం లేదని నేను ఖరాఖండిగా చెప్పగలను.

***ప్రశ్న :*** *"జిహాద్" పేరుతో కొనసాగుతున్న ఇస్లామిక్ ఉగ్రవాదుల ఉన్మాద పోకడలు ఎంత వరకు సమర్థనీయం? "ఆఫ్ఘనిస్తాన్, కశ్మీర్" టెర్రరిస్టు గ్రూపుల పంథా సముచితమేనా?*

**జవాబు :** కశ్మీర్‌లోకాని, ఆఫ్ఘనిస్తాన్‌లోకాని మరెక్కడైనాసరే కొనసాగుతున్న ఉగ్రవాద ధోరణులకు ఇస్లాంలో ఎటువంటి స్థానం లేదు. ఉగ్రవాదానికి ఇస్లాంకు సంబంధం ఏ మాత్రం అంటగట్టలేము. "ఖుర్‌ఆన్" స్పష్టం చేసినంతవరకు ఇస్లాంలో జిహాద్ రెండు రకాలు. ఒకటి 'జిహాదె అస్గర్', రెండు 'జిహాదె అక్బర్'. ఒక విశ్వాసి ప్రాణానికి ముప్పు వాటిల్లినప్పుడు, ఆత్మీయులకు, రక్తసంబంధీకులకు ప్రాణ నష్టం జరిగినప్పుడు ఆస్తిపాస్తులపై దురాక్రమణ జరిగినప్పుడు జరిపేది 'జిహాదె అస్గర్'. రెండవ దాని విషయానికొస్తే (జిహాదె అక్బర్), ఒక విశ్వాసి తన పంచేంద్రియాలను స్వాధీనంలో ఉంచుకోవటం, దైవ ప్రసన్నత పొందటానికి దైవ ఆదేశాల పరిధిలో వాటిని వినియోగించడం. ఇదే విధానం 'ఇంద్రియ నిగ్రహణ' పేరుతో 'హిందూయిజం'లో సైతం కనబడుతుంది. భారతావనిలో 'సూఫియిజం' కాలిడక ముందు వేద బోధనలకు ప్రచారం ఉండేది. స్పష్టమైన విషయం ఏమిటంటే, వేదాల్లో కూడా 'ఇస్లాం'లోని ఏకేశ్వరవాదం బలంగా కానవస్తుంది. హైందవంలోకాని, ఇస్లాంలోకాని మౌలిక సిద్ధాంతాలలో స్పష్టమైన సారూప్యత ఉంది.

***ప్రశ్న :*** *ఇస్లాం మత వ్యాప్తి కోసమే అనేక యుద్ధాలు జరిగాయన్న యథార్థాన్ని కాదనగలరా?*

**జవాబు :** ఇది చిక్కు ప్రశ్నే. దీని జవాబు చారిత్రక ఆధారాలతో ముడిపడి ఉంది. ఇక్కడ రెండు విషయాలు పరిగణించదగ్గవి. ముస్లిం రాజులు తమ సామ్రాజ్య వ్యాప్తికి చేసిన యుద్ధాలను ఇస్లాం మతంతో ముడిపెట్టారు. వేరే మతాల రాజులు సైతం ఇదే విధానాన్ని అవలంబించారు. క్రీస్తు శకం 800ల మొదలు క్రీ.శ. 1000 వరకు, 200 ఏళ్ళపాటు అవిశ్రాంతంగా కొనసాగిన క్రూసేడులు (మత

యుద్ధాలు) 'కానిస్టాంటినోపిల్' హస్తగతం కోసం క్రైస్తవులకు, ముస్లింలకు మధ్య జరిగాయి. ముస్లింలను పారద్రోలండి, ఇస్లాంను పారద్రోలండి అనే నినాదాలను సైతం ఆ కాలంలో క్రైస్తవులు విస్తృతంగా ప్రచారం చేశారు. 200 ఏళ్ళపాటు కొనసాగిన యుద్ధ కాలాన్ని అధ్యయనం చేస్తే ఇస్లాంకు, ముస్లింలకు వ్యతిరేకంగా ఎంతగా ద్వేషభావం, అసత్యం రంగరించి ప్రచారం చేయాలో అంతగా నిందారోపణలలో క్రిష్టియన్‌లు చరిత్రను పక్షపాతంతో కలుషితం చేశారు. పాశ్చాత్య సాహిత్యం, యూరప్ భాషా సాహిత్యం యావత్తు ముస్లిం, ఇస్లాం వ్యతిరేక ప్రచారంతోనే నిండిపోయింది. అప్పట్లో 'ప్రవక్త' ముహమ్మద్ పట్ల సైతం అపచారం చేశారు. ముహమ్మద్ అనే పదాన్ని విడదీసి 'మా–హౌండ్'గా మార్చి షైతాను లేక దయ్యం, తనకు తాను దైవంగా ప్రకటించుకున్నట్లు నిందా ప్రచారం చేశారు. ఇంతకు మించిన నీచ ప్రచారం మరొకటి లేదు. దురదృష్టవశాత్తు పాశ్చాత్య సాహిత్యంలో ఇటువంటి అభూత కల్పనలు, ఇస్లామిక్ ఫండమెంటలిజం వంటి పదప్రయోగాలు నేటికీ చోటు చేసుకుంటున్నాయి. ఇంకో కోణంలో పరిశీలించినట్లయితే మధ్య యుగం కాలంలో మధ్య ప్రాచ్యాన్ని మధ్య ఆసియాకు ఇస్లాం శాస్త్రీయ వైజ్ఞానిక చైతన్యాన్నిచ్చింది.

బగ్దాద్ ఖలీఫా రాజదర్బారు వ్యవహారాలను పరిశీలించినట్లయితే ఆ కాలంలో శాస్త్రీయ వైజ్ఞానిక రంగాల అభివృద్ధికి ప్రయోగశాలలు ఉండేవి. అరుదైన గ్రంథాలలో పెద్ద పెద్ద గ్రంథాలయాలు ఉండేవి. ఇతర మత గ్రంథాలను, బోధనలను, సిద్ధాంతాలను అనువదించటం జరిగేది. రాజదర్బారులో భారత పండితులు ఆదరించబడేవారు. ఖొరాసన్, మెసొపటామియాలో వర్ధిల్లిన ఇస్లాం పట్ల బౌద్ధులు ముగ్ధులయ్యేవారు. అనేకచోట్ల దేవాలయాలు నిర్మితమయి ఉన్నట్లు ఆ కాలంలో పర్యటించిన చైనా యాత్రికుడు హూయాన్‌త్సాంగ్ తన రచనల్లో పేర్కొన్నాడు.

*ప్రశ్న : మధ్య యుగం ప్రాంతంలో ముస్లిం రాజులు భారతదేశంపై దండెత్తి సంపదను దోచుకోవటమే కాక దేవాలయాలను ధ్వంసం చేసినట్లు, భారతీయులను క్రూరంగా సంహరించినట్లు పేర్కొన్న చారిత్రక కథనాల పట్ల మీ వివరణ ఏమిటి?*

**జవాబు :** ఈ విషయాలను వాస్తవకోణంలో పరిశీలించాలి. ఆ కాలంలో ఈ విధానాన్ని అందరూ పాటించేవారు. అన్ని మతాలకు ఇది వర్తిస్తుంది. శౌర్య, పరాక్రమాల మీదే పాలనా సామ్రాజ్యాలు ఆధారపడి ఉండేవి. ఏటా విజయదశమినాడు

ప్రతి పరాక్రమవంతుడైన హిందూ రాజు సమీప హిందూ రాజు సామ్రాజ్యాలపై దండెత్తి యుద్ధం దేహి అని చాటేవాడు. దానర్థం యుద్ధం చేయమని, లేనిపక్షంలో తనకు సామ్రాజ్యం ధారాదత్తం చేయమని ఛాలెంజ్ చేయడం. రాజపుత్రులు, హిందువులు, ముస్లిం రాజులు అందరూ పాటించిందే. ముస్లిమేతర సామ్రాజ్యాలపై చేసిన దాడులు యుద్ధాలకంటే ముస్లిం రాజులు తమలో తాము చేసుకున్న దాడులు, యుద్ధాల సంఖ్య ఎక్కువని చరిత్ర సాక్ష్యం చెబుతోంది. సంపదను కొల్లగొట్టారు, క్రూరంగా హింసించి చంపారు అనే విషయాలను పరిశీలించినట్లయితే ముస్లిం రాజులు ఎక్కడ నుంచి వచ్చారో ఆ సొంత భూభాగాలలో సైతం అదే విధానాన్ని అవలంబించారు. (నిజానికి రాజులందరూ ఇదే విధానాన్ని అవలంబించారు). ఈ విషయం చాలామందికి తెలియదు. కాని ముహమ్మద్ గజనవి వద్ద 'తిలక్' అనే గవర్నర్ జనరల్ ఉండేవాడు. ఆ కాలంలో 'తుర్కిస్తాన్'లో చెలరేగిన తిరుగుబాటును అతడు అత్యంత క్రూరంగా పాశవికంగా వర్ణించలేనంత హేయంగా అణచివేశాడు.

***ప్రశ్న :*** *ముస్లిం పాలకులు, ముస్లిం దురాక్రమణ దారులు, హిందువులను బలవంతపు మతమార్పిడితో ఒత్తిడిచేశారు అనే అంశంపై మీ అభిప్రాయం?*

**జవాబు :** ఈ విషయమై నేను స్పష్టమైన వివరణ ఇచ్చేందుకుగాను లోతుగా అధ్యయనం చేయలేదు. అందుకు అధికారికంగా ఏమీ చెప్పలేను కాని ఒకటి మాత్రం వాస్తవం. అది నిరాధారం. మత మార్పిడులు అప్పట్లో ఇప్పటి మాదిరిగానే సామాజిక వ్యత్యాసాలు, పెత్తందారితనం, ఆధిపత్యం మూలంగానే జరిగేవి. సమాజంలో బ్రాహ్మణ ఆధిపత్యం అధికమవటంతో, అణగారిన వర్గం సామాజిక సమతుల్యత కోసం, కనీస ఉనికి గౌరవ మర్యాదల కోసం తిరుగుబాటు చేసి మతం మార్పిడిల పట్ల మొగ్గుచూపేది. ఈ పరంపర నేటికీ బెంగాల్, గుజరాత్‌లలో కొనసాగుతూ ఉంది.

***ప్రశ్న :*** *వాస్తవాలు ఒకలా ఉంటే హిందువుల పట్ల ముస్లింలకు, ముస్లింలపట్ల హిందువులకు అపోహలు విద్వేషం రగిల్చే విధంగా మరోలా కొనసాగుతున్న అసత్య ప్రచారం అంతమయ్యేదెలా?*

**జవాబు :** దీనికి బీజాలు బ్రిటిష్ పాలనలో నాటారు. బ్రిటిష్ చరిత్రకారులు పక్షపాతంతో చరిత్రను వక్రీకరించి వ్రాశారు. హిందూ చక్రవర్తులు-చంద్రగుప్త మౌర్య, అశోకుడు, విక్రమాదిత్యుడు తదితరులు శౌర్య పరాక్రమాలను, పాలనా తీరును

అతిశయించి మోతాదుకు మించి ప్రాధాన్యం కలుగచేస్తూ చరిత్ర గ్రంథంలో నిక్షిప్తం చేశారు. ముస్లింల సామ్రాజ్య స్థాపనతో చరిత్ర వైభవం అంతమైనట్లు పేర్కొన్నారు. ఇంకో కోణంలో మధ్యయుగ చరిత్రపై పరిశోధన అధ్యయనం పూర్తిగా నిర్లక్ష్య పరిచారు. మధ్యయుగ చరిత్ర కొనసాగితే హిందూ ముస్లింల మధ్య గాఢమైన ఐక్యత ఏర్పడుతుందని నా దృఢ అభిప్రాయం.

*ప్రశ్న : హిందూ ముస్లిం ఐక్యత కొనసాగినట్లు మీరు వివరించగలరా?*

**జవాబు :** మధ్య యుగ కాలంలో ముస్లిం సూఫీలు, హిందూ సన్యాసులు ఒకే విధానాన్ని అవలంబించారు. ఇరువురు “ఏకేశ్వరవాదాన్ని” బలంగాను, విస్తృతంగాను ప్రచారం చేశారు. పరమత సహనాన్ని పరస్పర సోదర భావాన్ని ప్రేమ ఆప్యాయతను ‘భక్తి’తో సమ్మిళితం చేసి తమ ప్రచారాన్ని కొనసాగించారు. ఆ కాలంలో సంగీతం, సాహిత్యం, తత్వాలలో భక్తి భావనల, మత సిద్ధాంతాల ప్రచారం ఆరోగ్యవంతమైన రీతిలో కొనసాగేది. భారతీయ సాంప్రదాయ, సంస్కృతులు అత్యున్నతంగా గౌరవప్రదంగా ఆదరించబడ్డాయి. మధ్య యుగ కాలంలో విలసిల్లిన మత సహనం, ఐక్యత, సోదర భావం వారధిగా భారత దేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా హిందూ ముస్లింల ఐక్యత, మత సహనం, స్నేహసౌభ్రాతృత్వాలు కొనసాగాలని నేను దృఢంగా ఆకాంక్షిస్తున్నాను.

**- : సమాప్తం : -**